
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ప్రకాశం 5

జిల్లా వార్తలు

మంగళవారం 24, సెప్టెంబరు 2024



కనిగిరిలోని రూ.3 కోట్లతో నిర్మించిన సబ్‌స్టేషన్ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఉగ్ర తదితరులు

టీడీపీ కూటమి తరపున ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను ప్రభుత్వం వంద రోజుల్లోనే నేరవేర్చింది. పెన్షన్ల పెంపు, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణతోపాటు పలు పథకాలపై దృష్టిపెట్టింది. రాష్ట్రంలో సంస్కరణలతోపాటు వైసీపీ ప్రభుత్వం వివిధ శాఖల్లో నిలిపేసిన ప్రజోపయోగ పథకాలను పునఃప్రారంభించింది. ఇలా ప్రజలకు మేలు జరిగే అనేక పనులను చేపట్టిన కూటమి ప్రభుత్వం ఆ విజయాలను జనంలోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించింది. వంద రోజుల పాలన పూర్తయిన నేపథ్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో ఈనెల 20 నుంచి 26 వరకూ వారంరోజులపాటు ప్రత్యేక కార్యక్రమానికి పిలుపునిచ్చింది. సభలు, సమావేశాల నిర్వహణతోపాటు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి ప్రభుత్వం సాధించిన విజయాలను వివరించాలని సూచించింది. అందులో ప్రజాప్రతినిధులు, స్థానిక అధికారులు, సిబ్బంది పాల్గొనాలని ఆదేశించింది. తదనుగుణంగా జిల్లాలో కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది.

ప్రజల వద్దకే పాలన



అనుమలవీడులో మహిళ సమస్యను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముత్తుముల



కురిచేడు మండలం ఆవులమందలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ అశోక్‌బాబు, దర్శి ఇన్‌చార్జి లక్ష్మి, పాపారావు



గొల్లవాండ్లపల్లిలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

వైసీపీ హయాంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి

కనిగిరి, సెప్టెంబరు 23 : గత వైసీపీ పాలనలో ప్రభుత్వ వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. రాష్ట్రం ఆర్థికంగా వెనుకబడిపోయిందన్నారు. సోమవారం పట్టణ సమీపంలోని అర్బన్ కాలనీలో నూతనంగా రూ.3కోట్లతో ఏర్పాటు చేసిన 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి రవికుమార్ మాట్లాడుతూ నమ్మకంతో ఓట్లేసిన ప్రజల్ని వైసీపీ ప్రభుత్వం నిలువునా మోసం చేసిందని ధ్వజమెత్తారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో రైతులను చెప్పు చేతల్లో పెట్టుకునేలా భయభ్రాంతులకు గురిచేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఈ చట్టాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు రద్దుచేశారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని అన్న క్యాంటీన్లను మూసివేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో 175 ప్రాంతాల్లో అన్న క్యాంటీన్‌లను పునఃప్రారంభించామని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తిచేసి కనిగిరి ప్రాంతంలో వ్యవసాయ రంగానికి ఊతమిస్తామన్నారు. కనిగిరి అభివృద్ధికి తన వంతు సహాయ, సహకారాలు ఎప్పుడూ ఉంటాయని చెప్పారు. కనిగిరి ప్రాంతంలో మరమ్మతులకు గురైన స్తంభాలను తొలగించి వాటి స్థానంలో వంద నూతన స్తంభాలు ఏర్పాటు చేయిస్తామన్నారు. రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించినట్లు మంత్రి రవికుమార్ చెప్పారు. కనిగిరి ప్రాంతంలో ఆర్‌డీఎస్ స్కీం కింద రూ.70 కోట్లతో విద్యుత్ పనులు చేపట్టి పూర్తి చేయనున్నట్లు చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో కూడా కనిగిరిలో అన్న క్యాంటీన్ నిర్వహించి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పేదల ఆకలి తీర్చడం గొప్ప విషయమన్నారు.

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను సీఎం చంద్రబాబు చేపట్టారన్నారు. కనిగిరి నియోజకవర్గంలో ఎక్కువమంది రైతులు బోర్లపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారన్నారు. లోవోల్టేజీతో ఇబ్బందులు పడుతున్నారని మంత్రి గొట్టిపాటికి వివరించారు. అదనంగా సబ్‌స్టేషన్లు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సబ్‌స్టేషన్‌లలో నూతనంగా ఎంపికైన ఆరుగురు షిఫ్ట్ ఆపరేటర్లకు మంత్రి నియామకపత్రాలు అందజేసి ప్రాంగణంలో మొక్కలు నాటారు. తొలుత మండల పరిధిలోని నందనమారెళ్లలో ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ సమస్యతో వ్యవసాయం ఇబ్బందిగా మారిందన్నారు. దీనిపై స్పందించి మంత్రి ఈ ప్రాంతంలో రూ.1.5కోట్లతో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో ఇప్పటికే ఐదు ప్రాంతాల్లో నూతన సబ్‌స్టేషన్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో జాన్‌ఇర్విన్, ఎస్ఈ కేవీజీ సత్యనారాయణ, ఈఈ ఎం.హరిబాబు, డీఈ ఉమాకాంత్, ఎంపీపీ ప్రకాశం, మున్సిపల్ ఛైర్మన్ గఫార్, టీడీపీ నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, నారపరెడ్డి(యడవల్లి), శ్రీనివాసులరెడ్డి, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, ముచ్చుమూరి చెంచిరెడ్డి, మాజీ కౌన్సిలర్ షేక్ వాజిదాబేగం తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్తున్న పాలకులు

- ఇది మంచి ప్రభుత్వం పేరుతో వంద రోజుల విజయాలపై ప్రచారం
- కీలక ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతల భాగస్వామ్యం



ముక్తినూతలపాడులో 100 రోజుల్లో ప్రభుత్వం సాధించిన విజయాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో ప్రజల వద్దకు వెళ్తున్నారు. స్థానిక సిబ్బందితో కలిసి రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల్లో సాధించిన విజయాలను ప్రజలకు వివరిస్తున్నారు. ఈ ఏడాది జూన్ 12న రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడగా ఈ నెల 20 నాటికి వంద రోజుల పాలన పూర్తయింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ వంద రోజుల్లో చేపట్టిన పథకాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజల వద్దకు వెళ్లి వివరించాలని పాలక పెద్దలు నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా నుంచే ప్రారంభించిన విషయం విదితమే. తొలి రోజున నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడులో ఆ కార్యక్రమం జరగ్గా కొద్దిగంటల వ్యవధి ముందుగా మాత్రమే సమాచారం అందినా జిల్లా యంత్రాంగం స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో విజయవంతం చేసింది. అదే ఉత్సాహంతో జిల్లావ్యాప్తంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం కొనసాగుతోంది. అందులోభాగంగా సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కీలక ప్రజాప్రతినిధులు, ఇతర ముఖ్యనేతల ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగాయి. టీడీపీ శ్రేణులు, స్థానిక సిబ్బంది ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వ విజయాలను వివరిస్తూ కరపత్రాల పంపిణీతోపాటు స్టిక్కర్లను అందించారు.

అన్ని నియోజకవర్గాల్లో కార్యక్రమం

కనిగిరి నియోజకవర్గంలోని వెలిగండ్లలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి నేతృత్వంలో గ్రామ సభ నిర్వహించగా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఒంగోలు నగర పరిధిలోని ముక్తినూతలపాడులో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాల్గొన్నారు. నగరంలోని పలు డివిజన్లలో స్థానిక టీడీపీ శ్రేణులు నిర్వహించాయి. దర్శి నియోజకవర్గంలోని వెంకటాపురం, ఇతర గ్రామాల్లో టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి నేతృత్వంలో జరిగిన సభల్లో ఎమ్మెల్సీ అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్యే పాపారావు, టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ తదితరులు పాల్గొన్నారు. గిద్దలూరులో జరిగిన కార్యక్రమంలో అక్కడి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, త్రిపురాంతకం మండలం గొల్లవాండ్లపల్లిలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పాల్గొన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంలోని చీమకుర్తి నగర పంచాయతీలో టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మన్నం ప్రసాద్ నేతృత్వంలో పెద్దసంఖ్యలో టీడీపీ శ్రేణులు ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని ఇతర పలు ప్రాంతాల్లోనూ ఉత్సాహంగా కార్యక్రమం నిర్వహిస్తున్నారు.



భిక్షాటన చేస్తున్న పిల్లల కుటుంబంతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

కారు దిగొచ్చి కరుణించిన కలెక్టర్!

పేద కుటుంబంపై మానవత్వం ▸ బాల భిక్షాటకులకు ఆసరా

దుస్తులు కొనిచ్చి, వైద్యసేవలు అందించి, నైట్ షెల్టర్‌లో వసతి




మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

విధి నిర్వహణలో నిరంతరం బిజీగా గడిపే కలెక్టర్ తమీమ్ అన్సారియా మానవత్వం చాటుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమానికి హాజరవుతున్న క్రమంలో అక్కడ కనిపించిన దృశ్యం ఆమెను కదిలించింది. కారులో వెళుతున్న కలెక్టర్ అక్కడ గాంధీ వేషధారణలో ఇద్దరు ఆడపిల్లలు భిక్షాటన చేస్తుండటాన్ని చూసి ఆగారు. వారి వద్దకు వెళ్లి ఆరా తీశారు. గుంతకల్లుకు చెందిన సంచార జాతులకు చెందిన కుటుంబం ఐదుగురు పిల్లల్తో అక్కడే భిక్షాటన చేస్తున్నట్లు తెలుసుకున్నారు. ఆ కుటుంబంలో ఎనిమిది నెలల చిన్నారి కూడా ఉంది. చదువుకోవాల్సిన వయస్సులో భిక్షాటన చేయించకూడదని ఆ కుటుంబానికి సూచించిన కలెక్టర్.. పిల్లలను హాస్టల్‌లో చేర్పించి చదివిస్తానని, అవసరమైతే నివాస స్థలం కూడా ఇస్తామని వారికి భరోసా ఇచ్చారు. కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, మెప్మా పీడీ టి.రవికుమార్‌ను అక్కడకు పిలిపించారు. చిన్నారులను జీజీహెచ్‌కు తరలించి వారికి అవసరమైన వైద్యం అందించాలని ఆదేశించారు. దీంతో కమిషనర్ వారిని జీజీహెచ్‌కు తీసుకెళ్లడంతోపాటు కొత్త దుస్తులు అందజేశారు. అనంతరం వారి కుటుంబసభ్యులకు వైద్య పరీక్షలు చేయించి జీజీహెచ్‌లోని నైట్ షెల్టర్‌లో వసతి కల్పించారు.

- ఒంగోలు (కార్పొరేషన్)

మాగుంట పార్వతమ్మ ఆరోగ్యం విషమం

- చెన్నైలో వెంటిలేటర్‌పై చికిత్స



ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ఒంగోలు మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి సతీమణి, మాజీ పార్లమెంట్ సభ్యురాలు పార్వతమ్మ ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. చెన్నైలోని ఓ వైద్యశాలలో ప్రస్తుతం ఆమెకు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. నాలుగు మాసాల క్రితం ఆమె కుమారుడు మృతి చెందారు. ఆతర్వాత పార్వతమ్మ ఆరోగ్యం మరింత దెబ్బతింది. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డితోపాటు కుటుంబ సభ్యులంతా చెన్నైకు చేరుకున్నారు. ఆమె పరిస్థితి విషమంగానే ఉందని ఎంపీ తెలిపారు.

ఒకే ఒక్కడు

- బాలినేనితో జనసేనలోకి వాయల
- వైసీపీలోనే ఉంటామంటున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు

కొత్తపట్నం (ఒంగోలు నగరం) సెప్టెంబరు 23 : ఆయనతో పోయేదెవరు.. ఇక్కడే (వైసీపీలో) ఉండేదెవరు అనే అభిప్రాయ సేకరణలో ఒకే ఒక్కడు నేను వెళతానంటూ ముందుకొచ్చాడు. మిగిలిన నాయకులు, వైసీపీ తరఫున సర్పంచ్‌లు, ఎంపీటీసీలుగా గెలిచిన వారు, కార్యకర్తలు, గ్రామస్థాయి నాయకులు కూడా బాలినేనితో వెళ్లేదే లేదంటూ తేల్చిచెప్పారు. వైసీపీ మండల స్థాయి విస్తృత సమావేశం సోమవారం రాత్రి కొత్తపట్నంలో జరిగింది. జనసేన తీర్థం పుచ్చుకోబోతున్న మాజీ మంత్రి బాలినేనితో కలిసి నడిచేది ఎంతమంది అనే విషయంపై ప్రత్యేకించి ఈ సమావేశాన్ని నిర్వహించారు. బాలినేని దూతగా ఇనగంటి పిచ్చిరెడ్డి హాజరయ్యారు. అయితే ఈ సమావేశంలో దాదాపు అందరూ బాలినేని వెంట జనసేనలోకి వెళ్లేదే లేదంటూ కరాఖండిగా తేల్చిచెప్పారు. మాజీ ఎంపీపీ వాయల మోహనరావు మాత్రమే 'బాలినేని వెంటే నేను.. ఆయనతోనే నా పయనం' అంటూ స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, దాచూరి గోపాలరెడ్డి, వీరేపల్లి రామచంద్రారెడ్డి(వీఆర్సీ), జిల్లా వ్యవసాయ సలహామండలి మాజీ ఛైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, వాయల మోహనరావు, మండలంలోని వైసీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు. బాలినేని వైఖరిపై సమావేశంలో కొంతమంది ఆగ్రహం వ్యక్తం చేయగా మరికొందరు అసంతృప్తిని వెళ్లగక్కారు. పార్టీని నట్టేట ముంచేసి జనసేనలోకి పోతున్న బాలినేనితో కలిసి నడిచే ప్రసక్తేలేదంటూ సమావేశంలో పాల్గొన్న అందరూ తేల్చిచెప్పారు. ఒక్క వాయల మోహనరావే నాకు అన్నివేళలా అండదండగా ఉన్న బాలినేనితోనే తాను అడుగులు వేస్తానంటూ అభిప్రాయాన్ని తేల్చిచెప్పారు. కాగా వాయలపై సమావేశంలో పలువురు వైసీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం. మొత్తం మీద బాలినేని ఆశించినట్లుగా కొత్తపట్నం మండలం నుంచి జనసేన జెండా కిందకు పోయే వారు ఒక్కరే కనిపిస్తున్నారు. మిగిలిన వైసీపీ నాయకులు, కేడర్ ఆయన తీరుపై ఆగ్రహంతో ఊగిపోతున్నారు.



కొత్తపట్నంలో జరిగిన వైసీపీ సమావేశంలో మాట్లాడుతున్న అంజిరెడ్డి, హాజరైన నేతలు

ష్.. గప్‌చుప్

బాలినేని, జనార్దన్‌లకు అధిష్ఠానాల నుంచి ఆదేశాలు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిలకు స్థానికంగా మాటల తూటాలు పేల్చుకోవద్దని అధిష్ఠానాల నుంచి ఆదేశాలు అందినట్లు తెలిసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలోని భాగస్వామ్య పార్టీలు అనేక అంశాలపై కలిసి పయనిస్తున్న విషయం విదితమే. అయితే జిల్లాలో ఇటు దామచర్ల, అటు జనసేనలో చేరబోతున్న బాలినేని ఆదివారం ఒకరిపై ఒకరు చేసుకున్న విమర్శలపై రెండు పార్టీల అధిష్ఠానాలు స్పందించినట్లు తెలుస్తోంది. మున్ముందు ఏమైనా సమస్యలు వస్తే తమ దృష్టికి తేవాలని, కిందిస్థాయిలో ఒకరిపై ఒకరు వ్యాఖ్యానాలు చేసుకుంటూ బజారుకెక్కడం సరికాదన్న సంకేతాన్ని వారికి ఇచ్చినట్లు తెలుస్తోంది. విభేదాల ద్వారా రాష్ట్ర స్థాయిలో ఇరు పార్టీల మధ్య సఖ్యత దెబ్బతినకూడదన్న ఉద్దేశంతో అధిష్ఠానాలు ఇటు దామచర్ల, అటు బాలినేనికి పలు సూచనలు చేసినట్లు సమాచారం. తదనుగుణంగానే సోమవారం ఈ ఇద్దరు నాయకులు ఆదివారం చోటుచేసుకున్న వ్యవహారాలకు కొనసాగింపుగా సోమవారం ఎలాంటి వ్యాఖ్యానాలు చేయకుండా మిన్నకుండిపోయినట్లు తెలుస్తోంది. జనసేనలో చేరబోతున్న బాలినేనికి కూడా వివిధ కారణాల దృష్ట్యా చేరిక కార్యక్రమానికి పరిమితంగానే నాయకులను తీసుకురావాలన్న సంకేతాలు ఆ పార్టీ నాయకుల నుంచి అందినట్లు తెలిసింది.

పోలీసు స్టేషన్‌లో సివిల్ పంచాయితీ

బాధితుడు ఆత్మహత్యాయత్నం

- నిందితులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని దళిత నాయకుల డిమాండ్



వైద్యశాలలో చికిత్స పొందుతున్న కుమార్

ఒంగోలు (క్రైం), సెప్టెంబరు 23: సివిల్ వివాదంలో విచారణ పేరుతో ఓ యువకుడిని ఎస్‌ఐ భయభ్రాంతులకు గురిచేయడంతో పోలీసు స్టేషన్‌లోనే ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన సోమవారం స్థానిక తాలూకా పోలీసు స్టేషన్‌లో చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. చిత్తూరు జిల్లా ఎస్ఆర్‌పురానికి చెందిన దామరగుంట కుమార్ 2019లో కూల్‌డ్రింక్ షాపు కోసం స్వగ్రామంలో రూ.10 లక్షలు అప్పు చేశాడు. రూ.5లక్షలు తిరిగి చెల్లించాడు. మిగిలిన రూ.5లక్షల కోసం కుమార్ ఇంటితోపాటు పొలాన్ని అప్పు ఇచ్చిన చిత్తూరు చంద్రబాబు, నరసింహారెడ్డి, శోభారాణి దౌర్జన్యంగా రాయించుకున్నారు. దీంతో రెండేళ్ల క్రితం ఒంగోలు వెంకటేశ్వరకాలనీలోని అత్తగారింటికి వచ్చిన కుమార్ క్యాటరింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 21 రాత్రి చంద్రబాబు, మరికొందరిని వెంట తీసుకొని వెంకటేశ్వరకాలనీకి వెళ్లి కుమార్‌పై దౌర్జన్యం చేయబోయాడు. దీంతో అతను 100కు ఫోన్ చేశాడు. ఒంగోలు తాలుకా పోలీసులు వారందరినీ స్టేషన్‌కు తీసుకొచ్చి ఈ విషయం చిత్తూరులో మాట్లాడుకోవాలని చెప్పి పంపించారు. ఈ మేరకు ఆదివారం చిత్తూరు వెళ్లేందుకు కుమార్ బయల్దేరగా తాలూకా పోలీసు స్టేషన్ నుంచి ఎస్‌ఐ ఫిరోజ్ ఫోన్ చేశారు. సోమవారం స్టేషన్‌కు రావాలని చెప్పారు. అక్కడకు వెళ్లగా కుమార్‌ను ఎస్‌ఐ ముందే చంద్రబాబు తదితరులు కులం పేరుతో దూషించారు. అలాగే ఎస్‌ఐ ఫిరోజ్ దురుసుగా ప్రవర్తించాడు. దీంతో మనస్తాపం చెంది తన వద్ద ఉన్న చీమల మందును సేవించినట్లు బాధితుడు కుమార్ తెలిపారు. వెంటనే పోలీసులు అతనిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఎలాంటి కేసు లేకుండా సివిల్ వివాదంలో పోలీసు స్టేషన్‌కు పిలిపించిన ఎస్‌ఐ ఫిరోజ్‌ను సస్పెండ్ చేయాలని, చంద్రబాబు ముఠాపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. చిత్తూరులో లక్షల్లో నగదును తీసుకొని తిరిగి ఇవ్వకుండా కుమార్ పలువురిని మోసం చేశాడని, దానిపై విచారణ కోసం ఆయన్ను స్టేషన్‌కు పిలిచామని తాలూకా సీఐ అజయ్‌కుమార్ తెలిపారు.



ధర్నాలో మాట్లాడుతున్న ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్ రంగారావు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్)సెప్టెంబరు 23 : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు సోమవారం విశాఖ ఉక్కుకు రక్షణ, నాలుగు లేబర్ కోడ్ల రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కొత్తకోట వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ధర్నాలో రంగారావు మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక కుట్రలు పన్నుతుందన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. శ్రీనివాసులు మాట్లాడుతూ విశాఖ ఉక్కుకు రూ. 15వేల కోట్లు కేటాయించాలని డిమాండ్‌చేశారు. ధర్నాలో వివిధ సంఘాల నాయకులు జయంతిబాబు, సుబ్బారావు, చీకటి శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు, కంకణాల రమాదేవి, తంగిరాల మహేష్, దామా శ్రీనివాసులు, ఎస్‌డీ సర్దార్, బి. సుబ్బారావు, రాము, బసవయ్య, బాలకోటయ్య, మోజేష్ ఎంఎస్‌సాయి తదితరులు ఉన్నారు.

ఇబ్బందులు భరించలేకనే బయటకు వచ్చా

● వైసీపీ నేతలతో సమావేశంలో బాలినేని

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 23 : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో అనేక ఇబ్బందులు తట్టుకోలేకనే బయటకు వచ్చానని, అందుకు మీరందరూ సహకరించాలని మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక లాయర్ పేటలోని బాలినేని నివాసంలో సోమవారం కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ ఇతర ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలతో బయటకు వచ్చానని తెలిపారు. ఎన్నికల ముందే పార్టీనుంచి బయటకు వద్దామని ఆలోచన చేశామని, అయితే రాజశేఖర్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో అక్కడే ఉండాల్సి వచ్చిందన్నారు. వైసీపీ ఆవిర్భావం నుంచి తాను ఏవిధంగా పనిచేసిందని అందరికి తెలిసిందేనన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక తాను అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. అధినేత జగన్మోహన్‌రెడ్డి వద్దకు అనేక పర్యాయాలు వాటిని తీసుకెళ్లినా పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. వైసీపీలో ఆర్థికంగా తనను దెబ్బతీశారని, దాని వల్లనే తాను వైసీపీ నుంచి బయటకు రావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. అందులోభాగంగానే ఇటీవల జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిశానన్నారు. ఈనెల 26వతేదీన పవన్ సమక్షంలో జనసేనపార్టీలో చేరుతామని, ఆ రోజున ప్రతి ఒక్కరూ కదిలిరావాలని కోరారు. అనంతరం ఆ సమావేశంలో పాల్గొన్న కొంత మంది నాయకులు మీరు ఏ నిర్ణయం తీసుకుంటే ఆ నిర్ణయం ప్రకారం నడుచుకుంటామని స్పష్టం చేసినట్లు సమాచారం. డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావుతో పాటు మరో ఏడుగురు కార్పొరేటర్లు, 15 మంది డివిజన్ అధ్యక్షులతో పాటు వివిధ హోదాల్లోని పార్టీనాయకులు, వివిధ కార్పొరేషన్లలో పనిచేసిన డైరెక్టర్లు, ఇతర ముఖ్యనాయకులు పాల్గొన్నారు.



క్లబ్ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటేష్

ఘనంగా లయన్స్ ఎలైట్ కార్యవర్గ ప్రమాణం

ఒంగోలు(కల్చరల్),సెప్టెంబర్ 23:లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ నూతన అధ్యక్షుడి, కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. స్థానిక పద్మావతి ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడిగా ఈదర వెంకటేష్, కార్యదర్శిగా గ్రంధె పార్థసారథి, కోశాధికారిగా బొమ్మిశెట్టి లక్ష్మణ స్వామి, ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం బాధ్యతలు స్వీకరించారు. క్లబ్ మొదటి డిస్ట్రిక్ గవర్నర్ చందోలు హరిప్రసాద్ వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్‌లో కొత్తగా చేరిన వారిచేత రెండవ డిస్ట్రిక్ గవర్నర్ లక్ష్మీనారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ ఇప్పటివరకు క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అందరి సహకారంతో నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా విజయ్‌కుమార్ రెడ్డి, నామినేని మోహన్ రావు, ఎస్.వెంకటేశ్వర్లు, షేక్ షాకిర్, చిట్టెంరెడ్డి శ్రీనివాస రెడ్డి, లయన్స్ ఒంగోలు సిటిజన్స్ అధ్యక్షులు చలువాది శ్రీహరి, ఫౌండర్ కూరపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్డీవో డాక్టర్ సుజాత

సహ చట్టంతో పాలనలో పారదర్శకత

కొత్తపట్నం(ఒంగోలు,నగరం) సెప్టెంబరు 23: ప్రభుత్వ యంత్రాంగం ద్వారా పారదర్శకమైన పాలన అందించేందుకు, అవినీతిని రూపుమాపేందుకు , ప్రజలకు ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం జవాబుదారీ తనంగా ఉండేందుకే సమాచార హక్కు చట్టం ఉందని కొత్తపట్నం మండల అభివృద్ధి అధికారి డాక్టర్ సుజాత అన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో జరిగిన సమాచార హక్కు చట్టం అవగాహన సదస్సులో ఆమె పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి మండల వ్యవసాయ అధికారి మోహనరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఎమ్డీవో డాక్టర్ సుజాత మాట్లాడుతూ 2005వ సంవత్సరం అక్టోబరు 12వ తేదీ నుంచి ఈ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారాన్నయినా పొందే హక్కు ఉంటుందన్నారు. ఈ అవగాహనసదస్సులో వ్యవసాయ, ఉద్యాన గ్రామ సహాయకులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు శానిటరీ వర్కర్లకు వైద్య పరీక్షలు

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 23 : ఒంగోలు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు కమిషనరు డాక్టర్ కే. వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్పొరేషన్ కార్యాలయం ఆవరణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒంగోలు నగరపాలక సంస్థ, ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులో శానిటరీ విభాగం వర్కర్లు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోవాలని కమిషనరు తెలిపారు.

ఇది ప్రజలు కోరుకున్న ప్రభుత్వం

ముక్తినూతలపాడులో ఎమ్మెల్యే జనార్దన్



ముక్తినూతలపాడులో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 23 : ఇది ప్రజల కోరుకున్న మంచి ప్రభుత్వం అని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ముక్తినూతలపాడులో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తామని దామచర్ల స్పష్టం చేశారు. 100 రోజులలో అమలు చేసిన పథకాలు వివరించడంతోపాటు, ప్రజల సమస్యల తెలుసుకోవడం కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెంచిన పింఛన్‌లు, అన్న క్యాంటీన్‌ల పునరుద్ధరణ, 16,500 టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ విడుదల చేశారని అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, నైపుణ్యాభివృద్ధి సెంటర్లు ఏర్పాటు వంటి ఐదు ప్రధాన అంశాలపై తొలి సంతకం చేసిన ప్రజా నేత చంద్రబాబు నాయుడు అన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు నూకసాని బాలాజీ, నగర కమిషనరు డాక్టర్ కే. వెంకటేశ్వరరావుతో పాటు, పలువురు టీడీపీ కూటమి నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంక్షోభంలోనూ సంక్షేమం కూటమి ప్రభుత్వం ఘనత

● చీమకుర్తిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం



చీమకుర్తి 13వ వార్డులో జరిగిన కార్యక్రమంలో నాయకులు,అధికారులు

చీమకుర్తి,సెప్టెంబరు 23 : సంక్షోభ పరిస్థితుల్లోనూ ప్రజలకు సంక్షేమం అందివ్వడం,అభివృద్ధికి రెక్కలు తొడగటం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వందరోజుల్లో సాధించిన ఘనత అని చీమకుర్తి మున్సిపాల్టీ 13వ వార్డు టీడీపీ కౌన్సిలర్ గొల్లపూడి రమాదేవి తెలిపారు.ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం పట్టణంలోని 13వ వార్డులో ఉత్సాహభరితమైన వాతావరణంలో జరిపారు. అధికారులు,కూటమి నాయకులు, వార్డులో ఇంటింటికీ తిరుతుగా వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమం,అభివృద్ధి కార్యక్రమాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన ప్రజావేదికలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ పోతురాజు, టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, అడకా స్వాములు, గొల్లపూడి సుబ్బారావు, కందిమళ్ల గంగాధరరావు, కాట్రగడ్డ రమణయ్య, గొల్లపూడి కోటేశ్వరరావు, రావిపాటి రాంబాబు, సూరంపల్లి హనుమంతరావు, ఉన్నం సుబ్బారావు, వెంకాయమ్మ, జనసేన,బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



ఉప్పుగుండూరులో కరపత్రాలు అందిస్తున్న టీడీపీ నాయకులు

వంద రోజుల ప్రగతిపై ప్రచారం

నాగులుప్పలపాడు సెప్టెంబరు 23 : తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు ముగిసిన సందర్భంగా చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం ప్రచార కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని వివిధ గ్రామాలలో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఉప్పుగుండూరులో గ్రామ పార్టీ అధ్యక్షులు కాట్రగడ్డ చంద్రబాబు, టి.అగ్రహారంలో మాజీ ఎంపీటీసీ పొద శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో సచివాలయ అధికారులతో కలిసి ప్రభుత్వ వంద రోజుల ప్రగతిని వివరిస్తూ, కరపత్రాలను ఇంటింటికీ అందించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ మండలాధ్యక్షుడు బెల్లం వెంకటేశ్వర్లు, తెలుగు మహిళా నాయకురాలు కుంభా పార్వతి, జనసేన నాయకులు బాలిశెట్టి నాగేశ్వరరావు, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'మీకోసం'కు ప్రజల బారులు

మూడు వారాల అనంతరం కిక్కిరిసిన హాలు

ఒక్కరోజే వచ్చిన అర్జీలు 400





అర్జీలు ఇచ్చేందుకు బారులు తీరిన ప్రజలు, పక్కన సమస్యలు వింటున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 23 నెల రోజుల అనంతరం మీ కోసం కార్యక్రమం ప్రారంభం కావడంతో జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు భారీగా తరలివచ్చారు. విజయవాడ వరదల కారణంగా మీ కోసం కార్యక్రమం రెండు వారాలువాయిదాపడగా మరో వారం పండుగ కావడంతో సెలవు వచ్చింది. సోమవారం కలెక్టరేట్‌లోని మీకోసం హాలులో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, డీఆర్వో శ్రీలతతో పాటు పలు శాఖల అధికారులు అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తమ సమస్యలను చెప్పుకునేందుకు భారీ క్యూలైన్‌లో ప్రజలు నిలబడ్డారు. తమ సమస్యలు మండల, డివిజన్ స్థాయిలో పరిష్కారం కాకపోతుండటంతో అందరూ ఒంగోలుకు పరుగులు పెడుతున్నారు. దీంతో ఆ హాలు వద్ద సోమవారం భారీ క్యూలైన్‌లో ప్రజలు తమ సమస్యలు విన్నవించేందుకు వచ్చారు. ఈ వారం సుమారు 400 వరకు అర్జీలు వచ్చాయి. దివ్యాంగులు సదరమ్ సర్టిఫికెట్ల కోసం ఎక్కువ మంది రాగా ఇతర ప్రజలు భూ సమస్యలు, ఇంటి స్థలాలు, ఇతర పలు రకాల సమస్యలపై కలెక్టర్, జేసీని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు.

అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి

● కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 23 : వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో సోమవారం సాయంత్రం ప్రజా సమస్యలవేదికలో వచ్చిన అర్జీలపై సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను రాష్ట్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఏ వారం అర్జీలు ఆ వారం తప్పని సరిగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈవిషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కోర్టు కేసులకు సంబంధించి జాప్యం లేకుండా కోర్టుల్లో ఎప్పటికప్పుడు అఫిడవిట్‌లు దాఖలు చేయాలన్నారు ఈవిషయంలో సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. పత్రికల్లో వచ్చే వివిధ రకాల యాంటీ వార్తలపై కూడా దృష్టి సారించాలన్నారు. ఈ మూడు అంశాలపై ప్రతి సోమవారం ఇక నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తామని తెలిపారు. స్వర్ణాంధ్ర - 2047పై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అంశాల వారీగా సమీక్షించి కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్వో శ్రీలత, ఎస్‌డీసీ లోకేశ్వరరావు తదితరులు ఉన్నారు.



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ దామోదర్

ఫొటోలు మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిల్

● ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు

ఒంగోలు(క్రైం)సెప్టెంబరు23: ఇన్‌స్టాగ్రామ్‌లో తమ ఫొటోలు మార్ఫింగ్ చేసి షేర్ చేస్తూ డబ్బులు పంపించమని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు బాధితులు ముగ్గురు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 115 మంది తమ ఫిర్యాదులను ఎస్పీకి విన్నవించారు. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు బాధితులు తమ ఫొటోలు మార్ఫింగ్ చేసి షేర్ చేస్తూ డబ్బులు డిమాండ్ చేసి బెదిరిస్తున్నారని ఎస్పీ వద్ద వాపోయారు. అదే విధంగా రెవెన్యూ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఒంగోలు చెందిన ఇరువురు రూ. 3 లక్షలు తీసుకొని ఉద్యోగం ఇప్పించకుండా, డబ్బులు తిరిగి ఇవ్వకుండా బెదిరింపులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఒక మహిళ రూ. 5 లక్షలు నగదు చిట్టీపాటల పేరుతో తీసుకొని తిరిగి చెల్లించడంలేదని ఒంగోలుకు చెందిన బాధితురాలు ఫిర్యాదు చేశారు. ఇలా జిల్లాలోని 115 మంది తమ ఫిర్యాదులను ఎస్పీకి అందజేశారు. ఈమేరకు సంబంధిత అధికారులతో మాట్లాడిన ఎస్పీ చట్టపరిధిలో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎస్వి.శ్రీధర్‌రావు, కె.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, సీఐలు వి.సూర్యనారాయణ, కె.అజయ్‌బాబు, వై.పాండురంగారావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

యూనిఫాంలో రావడంపై కలెక్టర్ ఆగ్రహం

● హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆదేశం

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 23 : ఇరువురు విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన స్థానిక పీవీఆర్‌బాలికోన్నత పాఠశాల పీడీకి మద్దతుగా యూనిఫాంతో విద్యార్థినులు కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసేందుకు పంపడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన మీ కోసం కార్యక్రమంలో యూనిఫాంతో వచ్చిన విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థినులను పీడీకి మద్దతుగా పంపడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల జరుగుతున్న సమయంలో విద్యార్థినులను బయటకు పంపడంపై సంబంధిత పాఠశాల హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు ఇచ్చి విచారణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.



స్కూలు మధ్యలో కలెక్టరేట్‌కు వచ్చిన విద్యార్థినులు



కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో ధర్నా చేస్తున్న కుటుంబసభ్యులు

న్యాయం చేసి ఆదుకోండి

● కలెక్టరేట్ ఎదుట బాధిత కుటుంబం ధర్నా

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 23 : తమ కుటుంబానికి చెందిన పది సెంట్ల భూమిని అక్రమించుకొని అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని పామూరుకు చెందిన అన్నమ్మ కుటుంబ సభ్యులు పిల్లలతో కలిసి సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. మా పూర్వీకులకు చెందిన పది సెంట్ల స్థలాన్ని పామూరులోని ఒక స్కూలు యజమాని, ఒక చర్చిపాస్టర్ కలిసి ఆక్రమించుకున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ స్థలాన్ని ఆక్రమించుకోనేందుకు సహకరించిన తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకొని తమ స్థలాన్ని తమకు అప్పగించాలని కోరారు. అనంతరం కలెక్టర్ అన్సారియాను కలిసి వినతి పత్రం అందజేశారు. ధర్నాలో జయప్రద, మనమరాలు జ్యోతిర్మయి ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

జర్నలిస్టులకు అండగా ఉంటా

● ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 23 : ఒంగోలులోని జర్నలిస్టులకు ఇంటి స్థలాలతో పాటు ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తానని ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ హామీ ఇచ్చారు. స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఏపీయూడబ్ల్యూజే) జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టులకు ఎప్పుడూ తాను అండగా ఉంటానని తెలిపారు. విధి నిర్వహణలో జర్నలిస్టులు వాస్తవాలు తెలుసుకుని రాస్తే మంచిదని సూచించారు. అలాగే అర్హులైన వారికి ఇంటి స్థలాలు ఇస్తామని తెలిపారు. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం మూడు నెలలకు ఒకసారి మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసుకుంటే అందుకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తానని తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం జర్నలిస్టుల సంక్షేమం కోసం యూనియన్ సాధించిన విజయాలను వివరించారు. 2024లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు దృష్టికి పలు రకాల సమస్యలను తీసుకెళ్లామని, వాటన్నింటిపై సానుకూలంగా స్పందించారని ఐవీ తెలిపారు. అంతకు ముందు ఏపీయూడబ్ల్యూజే, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యవర్గం సమావేశం జరిగింది. ఈసమావేశంలో పలు అంశాలపై తీర్మానాలు చేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి ఎంవీ రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి దాసరి కనకయ్య, యూనియన్ బాధ్యులు సురేష్‌కుమార్ రెడ్డి, వెంకట్రావు, ఎ. సురేష్, విస్సా శ్రీను, ఇష్తేకర్‌బాషా తదితరులు ఉన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

ఉద్యానవన శాఖ అధికారి ప్రత్యూష



మద్దిపాడు, సెప్టెంబరు 23: కూరగాయ పంటల సాగులో రైతులు సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని ఉద్యాన శాఖ అధికారి డి.ప్రత్యూష తెలిపారు. సోమవారం ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు వాడిని నేల సారవంతంగా మారుతుందని దిగుబడి కూడా ఏ మాత్రం తగ్గదని అన్నారు. రైతులు రసాయన ఎరువులు వాడటానికి సేంద్రియ ఎరువులు అందుబాటులో లేకపోవటం కూడా కారణమని అన్నారు. అలాగే ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గాడిపర్తివారిపాలెంలో డిప్యూటీ కలెక్టర్ విచారణ

చీమకుర్తి,సెప్టెంబరు 23 : మండలంలోని గాడిపర్తివారిపాలెం గ్రామ రేషన్‌షాపు వద్ద విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ ఆరవకుమార్ సోమవారం విచారణ జరిపారు.గ్రామంలోని ప్రభుత్వ చౌక ధరల దుకాణంలో గోల్‌మాల్ వ్యవహారాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నారిపెద్ది వెంకట్రావు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.అంతేకాక ఇటీవల చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయం వద్ద కూడా ధర్నా నిర్వహించారు.దీనికి స్పందించిన ఉన్నతాధికారులు ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి విచారణాధికారిగా ఆరవకుమార్‌ని నియమించారు.దీంతో గ్రామంలో రేషన్‌షాపు వద్ద సమగ్రంగా విచారణ జరిపారు.తదుపరి చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయంలో విచారణ జరిపారు. తహసీల్దార్ బ్రహ్మయ్యరెవెన్యూ అధికారులు విచారణలో పాల్గొన్నారు.

నేడు మంత్రి గొట్టిపాటి రాక

మద్దిపాడు,సెప్టెంబరు 23:రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని పరిశీలించనున్నట్లు మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఆయనతోపాటు సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్‌కుమార్ సైతం రానున్నారు.

టపాసుల తయారీదారులు జాగ్రత్తలు పాటించాలి

దీపావళి టపాసుల తయారీదారులు నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తలు వహించాలని మద్దిపాడు ఎస్సై శివరామయ్య అన్నారు. సోమవారం ఆయన దీపావళి టపాసుల తయారీదారులతో సమావేశం నిర్వహించారు. తయారీ సమయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, మందుగుండు సామగ్రి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

ఒంగోలు(క్రైం)సెప్టెంబరు23: రైలు కింద పడి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు.ఈ సంఘటన ఒంగోలు రైల్వేస్టేషన్ సమీపంలోని ఉత్తరం వైపున గల రైల్వే బ్రిడ్జి సమీపంలో సోమవారం జరిగింది. సుమారు 35 ఏళ్ల వయసు కలిగిన యువకుడు పసుపు రంగు షర్టు, బ్లూకలర్ షాట్ వేసుకున్నాడు.గుండె పైన హనీ అని పచ్చ బొట్టు ఉంది. సంఘటన స్థలాని రైల్వే ఎస్సై టి.అరుణకుమారి పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నారు. వివరాలు తెలిసిన వారు 9440627647, 9381923900 నంబర్లకు తెలపాలని ఎస్సై కోరారు.

జాతీయ సెమినార్‌కు ఏకేయూ విద్యార్థులు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 23 : ఆంధ్రకేసరి యూనివర్శిటీ కళాశాలలో ఎమ్మెస్సీ ఆక్వా కల్చర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కేరళ రాష్ట్రంలోని కొట్టాయం యూనివర్శిటీలో నాలుగు రోజుల పాటు జరిగే జాతీయ సెమినార్‌కు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డీవీఆర్ మూర్తి, రిజిస్ట్రార్ బి. హరిబాబులు అభినందించారు.

నేడు జాబ్ మేళా

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 23 : స్థానిక త్రోవగుంట ఐఎల్‌టీడీ వద్ద గల శ్రీ శివ సాయి ఐటీఐలో మంగళవారం ఉదయం పది గంటలకు జాబ్ మేళా జరుగుతుందని కరస్పాండెంట్ కారుమూడి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. దివి లేబరేటరీస్ వారు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నారన్నారు. పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, బీఎస్సీ, బీఫార్మసీ, ఎం.ఫార్మసీ విద్యార్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. విద్యార్థులు తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లు, జెరాక్స్ కాపీలు, ఆధార్ కార్డుతో జాబ్ మేళాకు హాజరుకావాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 23 :స్థానిక విజయనగర్ కాలనీలోని 75,76 అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీడీపీవో కే ఫణిరాజకుమారి పాల్గొని మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహారపదార్థాలు తీసుకోవాలన్నారు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు కే పద్మకుమారి, జి. శ్రీలక్ష్మి, ఉష తదితరులు ఉన్నారు.

నేటి నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమం

సంతనూతలపాడు, సెప్టెంబరు 23: నేటినుంచి మండలంలో ప్రతి మంగళ , బుధ వారాల్లో రోజుకు రెండు గ్రామాల చొప్పున పొలంపిలుస్తోంది కార్యక్రమం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి పి.పావని సోమవారం ఓప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఉదయం 8.30 గంటలనుంచి సాయంత్రం 5.30 గంటలవరకు వ్యవసాయ అనుబంధ శాఖల సమన్వయంతో నిర్వహిస్తామని, నెలకు 8 రోజులు చొప్పున డిసెంబరు 31వరకు జరుగుతాయని తెలిపారు.

వరద బాధితులకు హెచ్‌ఎం సంఘం విరాళం

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 23 : వరద బాధితులకు ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లాశాఖ రూ. 25వేల విరాళాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అందజేసింది. ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం భవనం మెయింటెనెన్స్ ట్రస్టు ద్వారా ఈ మొత్తాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కలెక్టర్‌ను కలిసి చెక్కు ఇచ్చిన వారిలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టీఎల్ కాంతారావు, వై. వెంకట్రావు, కోశాధికారి జీఎస్‌ఆర్ సాయిలు ఉన్నారు.

ముసికి ఒక టీఎంసీ సాగర్ నీరు ఇవ్వాలి

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రావు

కొండపి, సెప్టెంబరు 23 : ముసికి ఒక టీఎంసీ సాగర్ నీరు ఇచ్చి నదీ పరివాహకంలోని 40 గ్రామాల ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు కోరారు. కొండపిలో ఈనెల 25న ఏర్పాటు చేసిన రైతు సదస్సు సన్నాహక సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను వరదలు ముంచెత్తుతున్నా కొండపి ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ముసి పూర్తిగా ఎండిపోయిందన్నారు. ఈ నేపథ్యంలో ముసిలో నీరుంటేనే రైతులు వరి, పొగాకు నారుమడులను కాపాడుకోవడంతోపాటు వచ్చే నెలలో పొగ మొక్కలు వేసుకోగలరన్నారు. రెండు మార్గాల ద్వారా ముసికి ప్రభుత్వం సాగరు నీరు ఇవ్వవచ్చని వెంకటరావు సూచించారు. ఈ విషయమై భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకునేందుకు ఈనెల 25న కొండపిలో అన్ని వామపక్షాలు, రైతు, రైతుకూలీ, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాల నాయకులతో కలిసి సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో రైతుకూలీ సంఘం నాయకుడు పరిటాల కోటేశ్వరరావు, వై.వి.కృష్ణారావు, కంకణాల ఆంజనేయులు, కేజీ మస్తాన్, భారతి, ముప్పరాజు బ్రహ్మయ్య, తెలుగు రైతు నాయకుడు కొల్లూరి బాలయ్య, జయంత్‌బాబు, మాబు తదితరులు పాల్గొన్నారు.


మంత్రులకు విరాళం అందిస్తున్న కొణిజేడు యువత

వరద బాధితులకు రూ.లక్ష విరాళం

టంగుటూరు, సెప్టెంబరు 23 : విజయవాడ వరద బాధితులకు కొణిజేడు గ్రామ తెలుగు యువత ఆధ్వర్యంలో రామ చైతన్య అండ్ టీం రూ.లక్ష విరాళం ప్రకటించింది. అందుకు సంబంధించిన చెక్కును ఆదివారం తూర్పునాయుడుపాలెంలో జరిగిన మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు వర్ధంతి సభలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు డాక్టర్ స్వామి, గొట్టిపాటి రవికుమార్‌కు అందించింది. కార్యక్రమంలో కొణిజేడు టీడీపీ నాయకులు దావులూరి వేణుగోపాల్, రామా నరేంద్రబాబు, పరిటాల బాలకోటయ్య, గొట్టిపాటి వెంకట్రావు, వేమూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


పోటీలకు ఎంపికైన ఆలకూరపాడు హైస్కూల్ విద్యార్థులు

స్కూల్ గేమ్స్‌లో ఆలకూరపాడు విద్యార్థుల సత్తా

టంగుటూరు, సెప్టెంబర్ 23 : టంగుటూరులో నిర్వహించిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో ఆలకూరపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. 12 మంది బాలికలు, 14 మంది బాలురు 43 పతకాలు సాధించారు. వీరంతా కొండపి నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను హెచ్‌ఎం వాకా వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు దామచర్ల శ్రీధర్, పి.జ్యోతి, ఎం.చెంచయ్య, ఎం.విజయలక్ష్మి, సురేష్, పి.సుభాషిణి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


వాహనంలో ఇరుక్కొని మృతిచెందిన అశోక్

వెంకటాచలం, సెప్టెంబరు 23 : మండలంలోని టోల్‌ప్లాజా వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. గుడ్లూరుకి చెందిన వ్యాపారి సైదులు చెన్నైలో కోడిగుడ్లు కొనుగోలు చేసుకుని బొలేరో వాహనంలో తిరిగి వస్తుండగా వారువస్తున్న వాహనం ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో గుడ్లూరుకి చెందిన బొలేరో డ్రైవర్ అశోక్ (33) వాహనంలోనే ఇరుక్కొని అక్కడికక్కడే మృతి చెందాడు. వ్యాపారి సైదులుతోపాటు ఆయన అన్న కుమార్తె గాయపడ్డారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని క్షతగాత్రులను నెల్లూరుకి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరద బాధితులకు విరాళం

పామూరు, సెప్టెంబరు 23: విజయవాడ వరదలతో నిరాశ్రులైన బాధితు లను ఆదుకొనేందుకు సీఎం రిలీఫ్ ఫండ్‌కు పామూరుకు చెందిన పెండ్యాల బాల తిరుపతయ్య తన వంతుగా ఎమ్మెల్యే ఉగ్ర సమక్షంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు సోమవారం రూ. 10 వేల చెక్కు‌ను అందజేశారు.

రోడ్డుపైనే చెత్త..

జాళ్లపాలెం రహదారిని కమ్మేసిన వ్యర్థాలు

పందులతో తరచూ ప్రమాదాలు ● చెత్తను తొలగించాలని ప్రజల వినతి

వాహనదారుల అవస్థ


జాళ్లపాలెం రోడ్డులో సిమెంటు రోడ్డు మీదకు వచ్చిన చెత్త వ్యర్థాలు

కొండపిలోని జాళ్లపాలెం రోడ్డులో చెత్త పేరుకుపోయింది. గ్రామానికి నలువైపులా రోడ్ల వెంట స్థానికులు వ్యర్థాలను పోస్తున్నారు. ముఖ్యంగా జాళ్లపాలెం వెళ్లే రహదారి వద్ద పరిస్థితి అధ్వానంగా తయారైంది. దుకాణాల్లోని అరటి గెలలు, ఖాళీ కొబ్బరి బోండాలు, మాంసం వ్యర్థాలు ఇలా అన్నీ ఇక్కడే పోస్తున్నారు. సమీపంలోని పీడబ్ల్యూడీ చెరువు ఒడ్డున కూడా వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతోంది.

– కొండపి, ఆంధ్రజ్యోతి

పందులతో ప్రమాదాలు

తడిచెత్తలోని ఆహార పదార్థాల కోసం అక్కడికి పెద్ద సంఖ్యలో పందులు చేరుతున్నాయి. ఇదేమార్గం నుంచి పది గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. పందులు రోడ్డుకు అడ్డంగా పరుగెడుతుండటంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. పది రోజుల క్రితం కూడా పందిని ఢీకొని ఒక బైకిస్టు కాలు విరిగింది.


జాళ్లపాలెం రోడ్డులో చెత్తను వేసేందుకు రిక్షాలో తరలిస్తున్న వ్యర్థాలు

రోడ్డు దుస్థితిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

రెండు నెలల క్రితం కొండపిలోని రామతీర్థం తాగునీటి ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన కలెక్టర్ తమీమ్ అన్సారియాకు పెదకండ్లగుంట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జాళ్లపాలెం రోడ్డులోని పరిస్థితిని వివరించారు. స్పందించిన ఆమె వెంటనే చెత్తను తొలగించాలని, డంపింగ్ యార్డుకు స్థలం సేకరించాలని అప్పటి ఎంపీడీవో, తహసీల్దార్‌ను ఆదేశించారు. కానీ అది అమలుకు నోచుకోలేదు. సమస్య వచ్చినప్పుడు తాత్కాలికంగా అధికారులు చెత్తను రోడ్డు మీద నుంచి చెరువులోకి నెడుతున్నారు. తిరిగి చెత్తను స్థానికులు అక్కడే వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ఆ మార్గంలో ప్రయాణించే గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చాలా ఇబ్బంది పడుతున్నాం



జాళ్లపాలెం రోడ్డు నుంచి కొండపికి దాదాపు పది గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. రహదారికి ఇరువైపులా చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పందుల కారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సీసీ రోడ్డు మీదకు చెత్త వచ్చి అది కుంచించుకుపోయింది. రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. చెత్తను తొలగించి పందులు సంచరించకుండా చర్యలు తీసుకోవాలి.

– కల్లూరి మల్లికార్జునరావు, పెదకండ్లగుంట

ఐదు చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

రూ.3.41లక్షల సొత్తు స్వాధీనం

అద్దంకి, సెప్టెంబరు 23 : అద్దంకి, బల్లికురవ, పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఐదు దొంగతనాల కేసులకు సంబంధించి నిందితుడిని అరెస్టు చేసి రూ.3,041,500 విలువైన సొత్తుని స్వాధీనం చేసుకున్నట్లు అద్దంకి టౌన్ సీఐ కృష్ణయ్య తెలిపారు. వివరాలలోకి వెళితే.. ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని సంతనూతలపాడు మండలం పేర్నమిట్టకు చెందిన తన్నీరు మధుబాబు అద్దంకి, బల్లికురవ, పోలీస్ స్టేషన్‌ల పరిధిలో దేవాలయాలతో పాటు తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డాడు. అద్దంకి, కలవకూరు రోడ్లలో ఇటుక బట్టీల వద్ద ట్రాక్టర్ ట్రాలీ, ఆటోలతో పాటు దేవాలయాల్లో ఉపయోగించే వెండి పాదుకలు, పట్టాలు, కుంభహారతి చెంబు, శఠగోపాలు, ఆంజనేయస్వామి గంట వంటి వాటితో పాటు రూ.25రకాల వస్తువులను చోరీ చేశాడు. వీటి విలువ రూ.3,045,500 కాగా, నిందితుడి వద్ద నుంచి రూ.3,041,500 విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. మధుబాబు 20 సంవత్సరాలుగా చోరీలకు పాల్పడుతున్నాడు. ఇప్పటికే మార్టూరు, జె.పంగులూరు, మద్దిపాడు, సంతమాగులూరు, ఒంగోలు, కనిగిరి, ఇంకోల్లు, బల్లికురవ, చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌లలో పలు కేసులు నమోదై ఉన్నాయి. రాత్రి సమయాలల్లో దేవాలయాలు, తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లో చోరీలు చేసి దొంగిలించిన సొత్తును పాత ఇనుప దుకాణాలలో అమ్ముతుంటాడు. సోమవారం ఉదయం అద్దంకి సమీపంలోని కొంగపాడు రోడ్డు వద్ద తనిఖీలు చేస్తుండగా మధుబాబు పట్టుబడ్డాడు. అద్దంకి టౌన్ సీఐ కృష్ణయ్య, బాపట్ల సీసీఎస్ సీఐ ప్రేమయ్య ఆధ్వర్యంలో అద్దంకి ఎస్‌ఐ ఖాదర్‌బాషా, సిబ్బంది అంకమరావు, మరియదాసు, గోపి మధుబాబును అరెస్టు చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో సీఐ ఆ వివరాలను వెల్లడించారు. ఎస్‌ఐ ప్రవీణ పాల్గొన్నారు.


వివరాలు తెలుపుతున్న సీఐ కృష్ణయ్య, ఎస్‌ఐలు, సిబ్బంది

మెయింటెనెన్స్ గ్రాంట్ విడుదల చేయాలి


సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బీటీఏ నాయకులు

కొత్తపట్నం(ఒంగోలు నగరం) సెప్టెంబరు 23: పాఠశాలలకు మెయింటెనెన్స్ గ్రాంటును విడుదల చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పర్రె వెంకటరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బీటీఏ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండలంలోని వివిధ పాఠశాలల్లో చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెంకటరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన స్కూలు గ్రాంటు, మెయింటెనెన్స్ గ్రాంటు గత మూడు సంవత్సరాలుగా విడుదల కాలేదన్నారు. దీని వలన పాఠశాల నిర్వహణ ప్రధానోపాధ్యాయులకు కష్టతరంగా మారిందన్నారు. ప్రభుత్వం వెంటనే పాఠశాలకు అందాల్సిన అన్ని రకాల గ్రాంట్లను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర కార్యదర్శి మద్దిరాల శరత్‌చంద్రబాబు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కర్ర దేవసహాయం, మండల అధ్యక్షులు నన్నెసాని భాస్కరరావు, కొప్పోలు కిషోర్, కోశాధికారి చక్కా కోటేశ్వరరావు చిటితోటి రామకృష్ణారావు పాల్గొన్నారు.

పేస్‌లో అతిథి ఉపన్యాసం

ఒంగోలు (విద్య), సెప్టెంబరు 23 : స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్‌ఐటీ చదువుతున్న విద్యార్థులకు హౌటు స్టే ఆఫ్ స్కిల్ డ్యాయింగ్ రిసెప్షన్ టైం అనే అంశంపై సోమవారం అతిథి ఉపన్యాసం నిర్వహించారు. కళాశాల పూర్వ విద్యార్థి, టీసీఎస్‌లో అసిస్టెంట్ సిస్టం ఇంజనీర్‌గా పనిచేస్తున్న బి. పవన్ వెంకటేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఎటువంటి స్కిల్స్ నేర్చుకోవాలి, ఏఐ కోర్సులు నేర్చుకుంటే జాబ్ సాధించవచ్చో వివరించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే మూర్తి, కన్వీనర్ కే రూప అక్కేష్, హెచ్‌వోడీ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

రేపటిలోగా దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 23 : జిల్లాలోని 108 వాహనాల్లో పైలట్(డ్రైవర్), ఎమర్జెన్సీ టెక్నీషియన్(ఈఎంటీ) పోస్టుల కోసం అభ్యర్థులు ఈనెల 25వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మేనేజర్ ఎస్. విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్‌ఎం, బీఎస్సీలైఫ్ సైన్సెస్, బీ ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ తదితర కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఒంగోలు, కనిగిరి పరిసర ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు పాత రిమ్స్‌లోని క్యాంపస్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

లడ్డూను అపవిత్రం చేసిన వారిని శిక్షించాలి

మద్దిపాడు,సెప్టెంబరు 23: తిరుమల లడ్డూను అపవిత్రం చేయటం హేయమైన చర్య అని దానికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని మద్దిపాడు మండల బ్రాహ్మణ నాయకులు కొణిజేటి శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీవారి భక్తులు వారి ఇళ్లలో దీపారాధన చేస్తూ క్షేమమంత్రం చదవాలని అన్నారు. కార్యక్రమంలో జన్నాభట్ల శ్రీనివాసరావు, రవిశంకర్, రమేష్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ రహిత సమాజ స్థాపనకు కృషి

నాగులుప్పలపాడు సెప్టెంబరు 23 : హెచ్‌ఐవీ రహిత సమాజాన్ని స్థాపించుకొనేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ బీవీ సాగర్ సూచించారు. మండల పరిధిలోని పోతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు హెచ్‌ఐవీ, మద్యపానం, మాదక ద్రవ్యాల నిర్మూలన,వాటి వినియోగం వల్ల కలుగు నష్టాలపై సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏఎస్సై సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు.అనంతరం గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జాలారావు, హెల్ప్ సభ్యులు ఎం. మల్లేశ్వరి, నాగలక్ష్మి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

ఎవరా కానిస్టేబుల్?

బాధ్యతారాహిత్యంపై ఎస్పీ సీరియస్

ఒంగోలు(క్రైం)సెప్టెంబరు23: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వచ్చిన సందర్భంగా జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలలోకి వెళితే ఈనెల 21 న నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడులో 'మన మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమం జరిగింది. కార్యాక్రమానికి సీయం చంద్రబాబు నాయుడు వచ్చారు. అక్కడ ఓ జరగరాని సంఘటన చోటు చేసుకుంది. ఉప్పుగుండూరుకు చెందిన చింతల వెంకటస్వామి చదలవాడలో ఉద్యోగం చేస్తాడు.అదే రోజు చదలవాడ విల్లా ఎదురుగా ఉన్న హోటల్‌లోకి వెళుతూ తన జేబులో డబ్బులు తీస్తుండగా జేబులో ఉన్న రూ. 13 వేలు నగదు కింద పడిపోయింది. దీంతో ఆయన వెనుక హోటల్ కు వచ్చిన కానిస్టేబుల్ ఆ నగదును తీసుకొని వెళ్లాడు. అయితే ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకు రాలేదు. దీంతో అక్కడ చూసిన వారు ఎస్పీకి సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్పీ ఎవరా కానిస్టేబుల్ అంటు సీసీ పుటేజీ తీయించారు. అంతే కాదు అతన్ని గుర్తించి చర్యలకు సిద్ధం అవుతున్నారు.

'గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం'

కురిచేడు, సెప్టెంబరు 23: గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని ఆవులమందలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కా ర్యక్రమంలో డాక్టర్ లక్ష్మి, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుసెట్టి పిచ్చయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు పిడతల నెమిలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడు తూ జగన్ చేసిన ఆర్థిక విధ్వంసంతో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయన్నారు. జగన్ పాలనలో చిన్నాభిన్నమైన రాష్ట్రాన్ని చంద్రబాబు గా డిలో పెట్టారన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ కూటమి ప్ర భుత్వం ముందుకు వెళుతున్నదన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే మంచి పేరు తెచ్చుకుంద న్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టిపాటి వెంకటేశ్వర్లు, నక్కా కోటివీరయ్య, కిలారి కొండయ్య, సునీల్, మస్తాన్ వలి, కాట్రాజు నాగరాజు, కమతం నాగిరెడ్డి, గణపర్తి వెంటకేశ్వర్లు, గంధం గురునాథం, గొట్టిపాటి శ్రీనివా సరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కనిగిరి, సెప్టెంబరు 23: క్రీడల్లో విద్యార్థులు రాణించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని దిరిశవంచ ప్రభుత్వ హైస్కూల్‌లో క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలన్నారు. విద్యార్థులకు విద్య ఎంత అవసరమో, క్రీడలు కూడా అంతే అవసరమన్నారు. తొలుత హైస్కూల్ ప్రాంగణంలోని సరస్వతి విగ్రహానికి పూలమాలలు వేసి నమస్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పీరాజ్‌కుమార్, టీడీపీ నా యకులు యడవల్లి శ్రీనివాసులురెడ్డి, ఎస్‌ఐ శ్రీరాం, తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి

పామూరు, సెప్టెంబరు 23: పామూరు మండలాన్ని అభివృద్ధి పథంలో నిలబెట్టాలని ఎంపీపీ గంగసాని లక్ష్మి అధికారులకు సూచించారు. సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. మండ ల పశువైద్యాధికారి ఈమని శ్రీసాయి మాట్లాడుతూ పశువైద్యశాల మరమ్మ తులకు గురై అధ్వానంగా ఉందన్నారు. నిధులు కేటాయించి అభివృద్ధి పరచా లని ఎంపీపీని కోరగా, బడ్జెట్ కేటాయించలేమని చెప్పారు. సమావేశంలో ఎంపీడీవో బి.సురేష్, జడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, వైస్‌ఎంపీపీ గంధం ఏసురత్నం, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం'

ముండ్లమూరు, సెప్టెంబరు 23: అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మట్టా సుబ్బారెడ్డి అన్నారు. సోమ వారం మండలంలోని మారెళ్లలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలుచేస్తున్నారని చెప్పారు. ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించేందుకు నిధులు మంజూర య్యాయన్నారు.

పిడుగుపాటుకు 12 మేకలు మృతి

స్పృహ కోల్పోయిన ముగ్గురు కాపరులు


మృతి చెందిన మేకలు

మద్దిపూడి, సెప్టెంబరు 23 : పిడుగుపాటుకు మండలంలోని సన్నమూరులో 12 మేకలు మృతి చెందాయి. ముగ్గురు కాపరులు స్పృహ కోల్పోయారు. ఈ ఘటన సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వాడాల మీరావళి మేకలు తోలుకొని పొలం వెళ్లాడు. సాయంత్రం వర్షం ప్రారంభం కావడంతో వాటిని వేపచెట్టు కిందకు తోలి ఆయన కూడా అక్కడికి చేరాడు. అనంతరం మరో ఇద్దరు కాపరులు కోలా శ్రీను, వెంకటరెడ్డి కూడా చెట్టు కిందకు వచ్చారు. ఆ సమయంలో పిడుగు పడటంతో 12 మేకలు మృతి చెందాయి. కాపరులు ముగ్గురూ స్పృహతప్పి పడిపోయారు. రెండు గంటల తర్వాత వారు తేరుకున్నారు. మేకల మృతితో రూ.3లక్షలు నష్టం వాటిల్లిందని మీరావళి తెలిపారు.

పాకల కొత్తచెరువులోని తుమ్మచెట్లకు వేలం


వేలం నిర్వహిస్తున్న అధికారులు

సింగరాయకొండ, సెప్టెంబరు 23 : మండలంలోని పాకల పంచాయతీ పరిధి కొత్తచెరువులోని నల్లతుమ్మచెట్ల విక్రయానికి పంచాయతీ అధికారులు సోమవారం గ్రామంలో బహిరంగ వేలం నిర్వహించారు. 18 మంది పాటదారులు పాల్గొన్నారు. అద్దంకికి చెందిన వేముల నాగేశ్వరరావు రూ.34.05 లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సైకం చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి సుభానీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

సింగరాయకొండ, సెప్టెంబరు 23 : సమాచార హక్కు చట్టంపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సచివాలయ సిబ్బంది, అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏడీ నిర్మలాకుమారి మాట్లాడుతూ అధికారుల్లో పారదర్శకత తీసుకురావడం, అవినీతిని అరికట్టడం, ప్రజలకు జబాబుదారీగా ఉండటమే చట్టం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో నరసింహమూర్తి, మండల వ్యవసాయాధికారి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

మద్రిపూడి, సెప్టెంబరు 23 : రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ, అనుబంధ శాఖల సేవలను రైతులకు సత్వరమే అందించాలన్న ఉద్దేశంతో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఏవో వెంకటేష్ తెలిపారు. మంగళ, బుధవారాల్లో రోజుకు రెండు చొప్పున నాలుగు గ్రామాల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వెల్లడించారు. నెలకు ఎనిమిది రోజుల చొప్పున డిసెంబరు 31 వరకూ ఇది కొనసాగుతుందన్నారు. మద్రిపూడి, రేగలగడ్డ గ్రామాల్లో మంగళవారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉద్యాన, పశుసంవర్థక, మార్కెటింగ్, విద్యుత్, మత్స్యశాఖ, బ్యాంకుల అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● కొండపి : మండలంలోని పెట్లూరు, మూగచింతల గ్రామాల్లో మంగళవారం, చినకండ్లగుంట, తాటాకులపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏవో విజయకుమార్ తెలిపారు. పంటల పరిశీలనతోపాటు రైతులకు సూచనలు, సలహాలు ఇస్తామని ఆయన చెప్పారు.

మారేడుమిల్లి జలపాతంలో మార్కాపురం యువకుడి గల్లంతు


హరదీప్ (ఫైల్)

మార్కాపురం, సెప్టెంబరు 23 : అల్లూరి జిల్లా మారేడుమిల్లి సమీపంలోని జలతరంగిణి జలపాతం వద్ద ఆదివారం ఈతకు వెళ్లి గల్లంతైన ఏలూరి ఆశ్రం మెడికల్ కాలేజీ విద్యార్థుల్లో మార్కాపురం యువకుడు హరదీప్ (21) ఉన్నాడు. పట్టణానికి చెందిన చింతకుంట్ల రవికుమార్ కుమారుడు హరదీప్ ఏలూరులోని ఆశ్రం మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. మరో 13 మందితో కలిసి ఆదివారం మారేడుమిల్లి వెళ్లారు. అక్కడ జలతరంగిణి జలపాతం వద్ద అందరూ ఈత కొడుతుండగా ఒక్కసారిగా కుండపోత వర్షం కురిసింది. దీంతో జలపాతం ఒక్కసారిగా పొంగింది. ఐదుగురు నీటిలో కొట్టుకుపోయారు. వెంటనే స్పందించిన స్థానికులు ఇద్దరిని రక్షించారు. హరదీప్‌తోపాటు సహచర విద్యార్థినులు అమృత, సౌమ్యలు మాత్రం గల్లంతయ్యారు. సోమవారం సాయంత్రం వరకూ గాలింపు చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. విషయం తెలిసిన వెంటనే హరదీప్ తల్లిదండ్రులు హుటాహుటిన మారేడుమిల్లి వెళ్లారు. ఈ ఘటనతో వారి కుటుంబంలో విషాదచాయలు అలముకున్నాయి.

పేదల కడుపు నింపేందుకే అన్న క్యాంటీన్లు



కొనకనమిట్లలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

● గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ● పలు గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహణ

గిద్దలూరు, సెప్టెంబరు 23 : పేదల కడుపు నింపేందుకే టీడీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించిందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. రాచర్ల మండలం అనుమలవీడు గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ, గత ఐదేళ్లలో వైసీపీ అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. నాటి ప్రభుత్వ పెద్దలే భూకబ్జాలకు పాల్పడ్డారని, రైతులకు తమ భూములపై హక్కులేకుండా చేసేందుకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను ప్రవేశపెట్టారని విమర్శించారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన వెంటనే ఆ యాక్టును రద్దు చేసి ప్రజలకు తమ భూమిపై భరోసా ఇచ్చారన్నారు. రూ.3వేలు ఇస్తున్న పింఛన్‌ను రూ.4 వేలకు పెంచినట్లు తెలిపారు. 100 రోజుల పాలనలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్నాటి లతీఫ్, ఎంపీపీ షేక్ ఖాశింబీ, టీడీపీ మండలశాఖ అధ్యక్షులు కె.యోగానంద్, జనసేన అధ్యక్షులు ఎ.వెంకటే శ్వర్లు, టీడీపీ నాయకులు అంబవరం శ్రీనివాసరెడ్డి, గోపిరెడ్డి జీవనేశ్వర్‌రెడ్డి, నల్లబోతుల శ్రీనివాసులు, యామా సంజయ్, ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, పంచాయతీరాజ్ డీఈ సుబ్బారెడ్డి, తహసీల్దార్ భారతీభాయి, ఎంఈవో శివకోటేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు.

హామీలను అమలు చేస్తున్నాం

త్రిపురాంతకం : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన మాటప్రకారం కూటమి ప్రభుత్వంలో హామీలను అమలు చేస్తోందని, టీడీపీ వై.పాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని కేశినేనిపల్లి పంచాయితీ పరిధిలోని గొల్లవాండ్లపల్లి గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ మేనిఫెస్టోలో హామీలలో భాగంగా పెన్షన్ పెంచామన్నారు. మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశారన్నారు. రైతులకు అన్యాయం జరుగకుండా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి, రైతులకు రక్షణ కల్పించారన్నారు. పేదలకు కడుపునింపే అన్నా క్యాంటీన్లను ప్రారంభించామన్నారు. త్వరలో రైతులకు డ్రిప్ పరికరాలు కూడా ఇచ్చేందుకు సిద్ధమయ్యామని తెలిపారు. నియోజకవర్గంలో రూ.15 కోట్లతో సీసీ రోడ్లు వేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని చెంచు, సుగాలీ గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. వచ్చే నెల నుంచి అర్హులకు కొత్త పెన్షన్లు ఇస్తామన్నారు. అంతకు ముందు గ్రామంలోని ఇళ్ల వద్దకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి, స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో సాయికుమార్, మండల ప్రత్యేకాధికారి వండర్‌మ్యాన్, తహసీల్దారు జి.శ్రీనివాస్, ఎంపీడీవో వరప్రసాద్, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు వి.శ్రీనివాసరావు, పలువురు అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

కంభం : ప్రజాసంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ జిల్లా మైనారిటీ నాయకులు దాదా తెలిపారు. సోమవారం కంభం పట్టణంలోని జుమ్మా మసీదు సెంటర్, చిన్న మసీదు సెంటర్లలో ఇంటింటికి తిరుగుతూ ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 100 రోజుల్లో చేసిన పనుల గురించి వివరించారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ నాగూర్‌అలీఖాన్, మైనారిటీ నాయకులు మసూద్, సచివాలయ సిబ్బంది రోహిత పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

కొనకనమిట్ల : కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలని ఎంపీడీవో అద్దంకి శ్రీనివాసమూర్తి తెలిపారు. మండలంలోని గొట్లగట్టు గ్రామంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వందరోజుల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సిబ్బంది ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు మోరబోయిన బాబురావు సర్పంచ్ సుఖ్‌దేవ్, ఏపీఎం గోపాలకృష్ణ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొదిలి : రాష్ట్రంలో అభివృద్ధిలో పరుగులు తీస్తున్న ప్రజాపాలన నడుస్తోందని ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఇమాంమ్‌సా అన్నారు. సోమవారం స్థానిక 11వ వార్డులో వందరోజుల కూటమి ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

'గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం'

కురిచేడు, సెప్టెంబరు 23: గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని ఆవులమందలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మి, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, దర్శి మున్సిపల్ ఛైర్మన్ నారపుసెట్టి పిచ్చయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు పిడతల నెమిలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ జగన్ చేసిన ఆర్థిక విధ్వంసంతో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయన్నారు. జగన్ పాలనలో చిన్నా భిన్నమైన రాష్ట్రాన్ని చంద్రబాబు గాడిలో పెట్టారన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతున్నదన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే మంచి పేరు తెచ్చుకుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టిపాటి వెంకటేశ్వర్లు, నక్కా కోటివీరయ్య, కిలారి కొండయ్య, సునీల్, మస్తాన్ వలి, కాట్రాజు నాగరాజు, కమతం నాగిరెడ్డి, గణపర్తి వెంటకేశ్వర్లు, గంధం గురునాథం, గొట్టిపాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కనిగిరి, సెప్టెంబరు 23: క్రీడల్లో విద్యార్థులు రాణించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని దిరిశవంచ ప్రభుత్వ హైస్కూల్‌లో క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలన్నారు. విద్యార్థులకు విద్య ఎంత అవసరమో, క్రీడలు కూడా అంతే అవసరమన్నారు. తొలుత హైస్కూల్ ప్రాంగణంలోని సరస్వతి విగ్రహానికి పూలమాలలు వేసి నమస్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పీరాజ్‌కుమార్, టీడీపీ నాయకులు యడవల్లి శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ శ్రీరాం, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంగా గోపాల్‌రెడ్డి బాధ్యతలు

పొదిలి, సెప్టెంబరు 23 : డీఆర్‌డీఏ వెలుగు పొదిలి నూతన ఏపీఎంగా కర్నాటి గోపాల్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గతంలో కొనకనమిట్ల మండలంలో పనిచేసి సాధారణ బదిలీల్లో పొదిలి వచ్చినట్లు ఆయన చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో డ్వాక్రా గ్రూపులపై సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు.

కరాటేలో స్ప్రింగ్‌బోర్డు విద్యార్థుల ప్రతిభ

గిద్దలూరు, సెప్టెంబరు 23 : గిద్దలూరులోని స్ప్రింగ్‌బోర్డు పాఠశాలకు చెందిన విద్యార్థులు కరాటేలో ప్రతిభ కనపరిచారు. కర్నూలులో జరిగిన 6వ ఇంటర్ కరాటే స్టేట్ చాంపియన్‌షిప్ పోటీలలో స్ప్రింగ్‌బోర్డు పాఠశాలకు చెందిన 16 మంది విద్యార్థులు కరాటే, కుముతే విభాగాలలో బంగారు, కాంస్యం, రజత పతకాలు కైవసం చేసుకున్నారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ జేవీ.నారాయణ, డైరెక్టర్ చైతన్య హెచ్‌ఎం శ్వేత అభినందించారు. కరాటే మాస్టర్ షాషావలిని సన్మానించారు.

సత్తా చాటిన ఎంఎస్ స్కూల్ విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురంలోని ఎంఎస్.స్పోర్ట్స్ కరాటే స్కూల్ విద్యార్థులు కర్నూలులో జరిగిన ఇంటర్ స్టేట్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలలో ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో విద్యార్థులను అభినందించి కరాటే స్కూల్ చీఫ్ ఎగ్జామినర్ మారంరెడ్డి శ్రీనివాసరెడ్డి, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ తోట ప్రసాద్‌లు మాట్లాడుతూ కర్నూలులో ఆరవ ఇంటర్ స్టేట్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలలో 12 మంది తమ పాఠశాల విద్యార్థులు పాల్గొని 16 బంగారు పతకాలు, 9 వెండి, రెండు కాంస్య పతకాలు సాధించారన్నారు. ఓవరాల్ ఛాంపియన్‌షిప్ గెలుచుకున్నారని వివరించారు.

చెన్నయ్య హుండీ ఆదాయం రూ.10 లక్షలు

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో సోమవారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. హుండీ లెక్కింపులో 4 నెలల 13 రోజులకు గాను రూ.10,68,797 ఆదాయం వచ్చిందని ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఈ.నాగమల్లేశ్వరరాజు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు స్థలం కేటాయించరూ!

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 23: మార్కాపురం పట్టణంలో స్వచ్ఛ భారత్ స్ఫూర్తి ప్రదాత గాడ్గే బాబా, నిజాం నవాబుల తూటాలకు ఎదురొడ్డి పోరాడిన చాకలి ఐలమ్మల విగ్రహాల ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని పీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి కనిగిరి బాలవెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించారు. తర్లుపాడు రోడ్డులోని రోడ్డు డివైడర్ మధ్య ఉన్న స్థలాన్ని కేటాయించాలని కోరారు.

దోర్నాల రేంజి అధికారి బదిలీ

పెద్దదోర్నాల, సెప్టెంబరు 23: దోర్నాల రేంజి అటవీశాఖాధికారి ఈ విశ్వేశ్వరరావు సోమవారం బదిలీ అయ్యారు. ఈయన మంగళగిరి ప్రధాన కార్యాలయానికి బదిలీ కాగా, దోర్నాల రేంజికి నూతన అటవీ శాఖాధికారిగా గుండ్లకమ్మ టైగర్ ప్రాజెక్టు గిద్దలూరులో పనిచేస్తున్న హెచ్ జీవన్‌కుమార్ బదిలీపై రానున్నట్లు అటవీ శాఖాధికారులు తెలిపారు.

ఎన్‌సీసీకి 35 మంది విద్యార్థుల ఎంపిక

● ఎంపికైన వారిని అభినందించిన మాజీ మంత్రి సురేష్

మార్కాపురం, సెప్టెంబరు 23: స్థానిక డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన సెలక్షన్స్‌లో 35 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రాజబాబు తెలిపారు. ఎన్‌సీసీ ఏఎన్‌వో కెప్టెన్ అనిల్ నేతృత్వంలో ఎన్‌సీసీ యూనిట్ 186 సీవోవైకి 2024-25 విద్యాసంవత్సరానికి ఈ ఎంపిక నిర్వహించామన్నారు. మొత్తం 100 మంది విద్యార్థులు సెలక్షన్స్‌కు హాజరుకాగా 35 మంది అర్హత సాధించారన్నారు. వారిలో 27 మంది విద్యార్థులు కాగా 8 విద్యార్థినులు ఉన్నారన్నారు. కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్‌మోహన్, ఆంధ్ర బెటాలియన్ అధికారులు సత్యనారాయణ, పుష్పరాజ్‌లు ఈ ఎంపిక ప్రక్రియ నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను కళాశాల కార్యదర్శి, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ అభినందించినట్లు తెలిపారు. క్రమశిక్షణతో విద్యార్థులు విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన బాలికలు

గిద్దలూరు, సెప్టెంబరు 23 : స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గిద్దలూరు నియోజకవర్గస్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపరచి జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాగభూషణ్‌రెడ్డి, గేమ్స్ కో-ఆర్డినేటర్ గుర్రం శోభన్‌బాబు, ఫిజికల్ డైరెక్టర్ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు. బాలికోన్నత పాఠశాలకు చెందిన షన్ముఖి అండర్-14 చెస్‌లో విజేతగా నిలిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైంది. అండర్-17, అండర్-14 కబడ్డీలో రహీన, వైష్ణవి, శ్రీనిత, శిరీష, రమ్యశ్రీ, అనూష, అండర్-14 షాట్‌పుట్‌లో రూబిత, 400 మీటర్ల పరుగు పందెంలో నాగేశ్వరి, యోగాలో నాగశ్వేత, వాలీబాల్‌లో రత్నకుమారి, వీరదీప జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక వాసవీ విద్యానికేతన్ విద్యార్థులు గజ్జలకొండలో జరిగిన జీఎఫ్ఐ క్రీడాపోటీలలో ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థులను అభినందించి ప్రిన్సిపాల్ కె.రంగ య్య మాట్లాడారు. అండర్-17 స్థాయిలో శశాంక్, దివ్యా, వర్షితా, అండర్-14లో కరిష్మా, హర్షిణి సాయి, హేమలతలు ప్రతిభ కనబర్చారని డివిజన్ స్థాయిలోనూ ప్రతిభ చూపాలన్నారు.

మార్కాపురం రూరల్ : మండలంలోని దరిమడుగు గ్రామ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మండల స్థాయి క్రీడాపోటీలలో ప్రతిభ చూపారని ప్రధానోపాధ్యాయులు తిరుపతిరెడ్డి తెలిపారు. మండలంలోని గజ్జలకొండ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 19, 20, 21 తేదీలలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ మండలస్థాయి క్రీడాపోటీలలో అండర్-14, 17లో హైజంప్, జావెలిన్ త్రో, సెటిల్ బ్యాడ్మింటన్, యోగా, ఖోఖో, కబడ్డీ పోటీలలో విద్యార్థులు ప్రతిభ చూపారని సోమవారం ఓ ప్రకటన లో తెలిపారు. ఆటలలో ప్రతిభ చూపిన విద్యార్థులు శ్రీను, ప్రవీణ్‌కుమార్, రుద్ర, రాజేష్, నాగచైతన్య, గణేష్, నిఖిల్, నాగులు, తేజ, నాగ మల్లేశ్వరి, మల్లేశ్వరి, ప్రవళిక, నూర్జహాన్, ఇంద్రాణి, చాందిని, బి.నాగమల్లేశ్వరిలను వ్యాయామ ఉపాధ్యాయులు పి.బాబురావు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

నేటి నుంచి నియోజకవర్గ స్థాయిలో..

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 24, 25వ తేదీలలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ జాహ్నవి ప్రియలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24వ తేదీ అథ్లెటిక్స్, యోగా, చెస్, బ్యాడ్మింటన్ పోటీలు, 25న కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. మండలాల్లో గెలుపొందిన క్రీడాకారులకు నియోజకవర్గ స్థాయిలో పాల్గొనాలన్నారు.

సమాచారహక్కు చట్టంపై అవగాహన

బేస్తవారపేట, సెప్టెంబరు 23 : బేస్తవారపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆర్టీఐ యాక్ట్ కమిషన్ చావలి సునీల్ ఉత్తర్వుల మేరకు అగ్రికల్చర్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వ్యవసాయాధికారి జక్కం మేర్సీ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులతో సమాచారహక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతివ్యక్తి తనకు కావాల్సిన సమాచారాన్ని అధికారికంగా ఈ చట్టం ద్వారా పొందవచ్చునని వివరించారు. అందుకు సంబంధించిన వివరించారు.

పొదిలి : వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సమాచార హక్కుచట్టంపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్య క్రమానికి ఎంఈవో శ్రీనివాసరెడ్డి, సీడీపీవో సుధా మారుతీ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వం వాటి విభాగాలు ప్రజలకు జవాబుదారిగా ఉండటం, సమాచారంలో పారదర్శకత ఉండాలని, ప్రభుత్వ కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించడం వంటివి ఈ చట్టం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అంతేకాకుండా చట్టంలో 31 సెక్షన్‌లు, రెండు షెడ్యూల్ పొందవచ్చన్నారు. ముఖ్యంగా 40బీలో 17 అంశాలను విధిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంఏవో, వ్యవసాయాధికారి షేక్ జైన్‌లుబ్దీన్, గ్రామస్థాయి అధికారులు, ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

కోరం లేక మహాసభ వాయిదా

కొమరోలు, సెప్టెంబరు 23: కొమరోలు కో-ఆపరేటివ్ సొసైటీలో జరిగిన అక్రమాలపై సోమవారం మార్కాపురం డివిజినల్ సొసైటీ కో-ఆపరేటివ్ ఆఫీసర్ పి.రాజశేఖర్ అధ్యక్షతన మహాజన సభను రైతులతో నిర్వహించారు. ఈ సమావేశానికి సభ్యులు కోరం లేకపోవడం, బాధిత రైతులు హాజరుకాకపోవడంతో సమావేశాన్ని, వచ్చేనెల 10కి వాయిదావేశారు. కొమరోలు సొసైటీ పరిధిలోని 43మంది రైతులకు సుమారు రూ.80 లక్షలు వివిధ రూపాల్లో గోల్‌మాల్ జరిగినట్లు తెలిపారు. దీనిని నిజనిర్ధారణ చేసేందుకు సొసైటీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని బాధిత రైతులకు న్యాయం చేస్తారన్నారు. మండలంలోని గోనెపల్లి గ్రామస్థుడైన ఏలూరి నారాయణ తీసుకున్న రుణం చెల్లించారని, తరువాత నారాయణ చనిపోయాడని వారి వారసులకు రుణం చెల్లించాలని చెప్పుతున్నారని వారి కుటుంబ సభ్యులు సమావేశంలో లేవనెత్తారు. రైతులు తీసుకున్న రుణాలు చెల్లించినప్పుడు సొసైటీవారే రిజిష్టర్ కార్యాలయం నుంచి విడుదలచేయాలని కోరారు. కార్యాక్రమంలో సొసైటీ ప్రత్యేకాధికారి బాలయ్య, సొసైటీ మాజీ అధ్యక్షుడు పులకుర్తి వెంకటేశ్వర్లు, కొమరోలు సొసైటీ సీఈవో కిరణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

అంతరాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

● 20 కిలోల గంజాయి స్వాధీనం

మార్కాపురం, సెప్టెంబరు 23: అంతరాష్ట్ర గంజాయి ముఠాను మార్కాపురం పోలీసులు సోమవారం పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మార్కాపురం సీఐ వి.సుబ్బారావు తెలిపిన వివరాలు మేరకు ఈ నెల 22న సాధారణ విధుల్లో భాగంగా సీఐ సుబ్బారావు స్థానిక మార్కెట్ యార్డ్ సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద రాత్రి గస్తీ నిర్వహిస్తున్న సమయంలో ముగ్గురు అనుమానితులు గోతాలతో కనిపించారు. వారిని విచారించగా వారిలో అందరూ గతంలో ప్రకాశం జిల్లాతోపాటు గుంటూరు, బాపట్ల జిల్లాల్లో కేసుల్లో ముద్దాయిలుగా నమోదైనట్లు గుర్తించారు. వారి గోనె సంచుల్లో సుమారు రూ.30 వేలు విలువచేసే 20 కిలోల పైన గంజాయి ఉన్నట్లు గుర్తించి వెంటనే స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారుల మధ్యవర్తి నామా మేరకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. నిందితులు వడ్లమాను శివారెడ్డి, దేవరకొండ శ్రీను, సయ్యద్ మజీద్‌లకు కోర్టు రిమాండ్ విధించింది.. వీరంతా గంజాయిని పల్నాడు జిల్లా వినుకొండలో కొనుగోలు చేసి మార్కాపురం ప్రాంతంలో అమ్మేందుకు వచ్చినట్లు తెలిసింది.

మారేడుమిల్లి జలపాతంలో గల్లంతైన మార్కాపురం యువకుడు



హరదీప్ (ఫైల్)

మార్కాపురం, సెప్టెంబరు 23 : అల్లూరి జిల్లా మారేడుమిల్లి సమీపంలోని జలతరంగిణి జలపాతం వద్ద ఆదివారం ఈతకు వెళ్లి గల్లంతైన ఏలూరి ఆశ్రం మెడికల్ కాలేజీ విద్యార్థుల్లో మార్కాపురం యువకుడు హరదీప్ (21) ఉన్నాడు. పట్టణానికి చెందిన చింతకుంట్ల రవికుమార్ కుమారుడు హరదీప్ ఏలూరులోని ఆశ్రం మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. మరో 13 మందితో కలిసి ఆదివారం మారేడుమిల్లి వెళ్లారు. అక్కడ జలతరంగిణి జలపాతం వద్ద అందరూ ఈత కొడుతుండగా ఒక్కసారిగా కుండపోత వర్షం కురిసింది. దీంతో జలపాతం ఒక్కసారిగా పొంగింది. ఐదుగురు నీటిలో కొట్టుకుపోయారు. వెంటనే స్పందించిన స్థానికులు ఇద్దరిని రక్షించారు. హరదీప్‌తోపాటు సహచర విద్యార్థినులు అమృత, సౌమ్యలు మాత్రం గల్లంతయ్యారు. సోమవారం సాయంత్రం వరకూ గాలింపు చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. విషయం తెలిసిన వెంటనే హరదీప్ తల్లిదండ్రులు హుటాహుటిన మారేడుమిల్లి వెళ్లారు. ఈ ఘటనతో వారి కుటుంబంలో విషాదచాయలు అలముకున్నాయి.

ఎస్ఐగా సంపత్‌కుమార్ బాధ్యతలు

పుల్లలచెరువు,సెప్టెంబరు 23 : పుల్లలచెరువు మండల ఎస్ఐగా ఎల్ సంపత్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సమస్యలపై నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. అసాంఘీక కార్యకాలపాలపై ఉక్కుపాదం మోపుతామని అన్నా రు. ప్రజలు గ్రామాల్లో స్వేచ్ఛగా తమ పనులు చేసుకొని ఎటువంటి గొడవలు లేకుండా ఉండాలన్నారు. స్టేషన్ సిబ్బంది ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

పెద్దారవీడు, సెప్టెంబరు 23: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పెద్దారవీడు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 35 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. మండలంలోని మద్దలకట్టకు చెందిన వ్యక్తి మద్యాన్ని అధిక ధరకు విక్రయించే ఉద్దేశంతో అక్రమంగా తరలిస్తుండగా అతడిని అదుపులోకి తీసుకొన్నామనానరు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఎవరి వద్ద మద్యం స్వాధీనం చేసుకొంది వెల్లడించేందుకు ఎస్సై నిరాకరించారు.

ఫ్రీహోల్డ్ భూముల్లో అక్రమాలపై విచారణకు వినతి

స్పందనలో బుడ్డపల్లి గ్రామస్థుల వినతి



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బుడ్డపల్లి గ్రామస్థులు

మార్కాపురం, సెప్టెంబరు 23: గత సంవత్సరం వైసీపీ ప్రభుత్వం 20 ఏళ్ల పాటు అసైన్‌మెంట్ భూములను సాగుచేసుకున్న వారికి ఫ్రీహోల్డ్ పేరుతో కల్పించిన రిజిస్ట్రేషన్ హక్కు విషయంలో తర్లుపాడు మండలంలోని బుడ్డపల్లెలో అక్రమాలు చోటుచేసుకున్నాయని గ్రామస్థులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన మీ కోసం కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్‌కు అర్జీ అందజేశారు. ప్రధానంగా ఎకరాకు రూ.30 వేల చొప్పున లంచాలు తీసుకొని డిప్యూటీ తహసీల్దార్ ఖలీల్, వీఆర్‌వో రంగయ్యలు ఏడు సంవత్సరాల క్రితం అసైన్‌మెంటు పట్టాలు పొందిన వారికి కూడా ఫ్రీహోల్డ్ కల్పించారన్నారు. గ్రామంలో సుమారు 30 నుంచి 40 సంవత్సరాల క్రితం పట్టాలు పొందిన వారిని మాత్రం పరిగణనలోకి తీసుకోలేదన్నారు. ఈ అక్రమ వ్యవహారంలో కేతగుడిపి సర్పంచ్ మస్తాన్ కీలకంగా వ్యవహరించారని ఆరోపించారు. రికార్డులు పూర్తిస్థాయిలో తనిఖీ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

రూ.8 కోట్ల అవినీతిని నిగ్గు తేల్చండి

మార్కాపురం పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి దేవస్థానంలో గోపురాల నిర్మాణానికి ప్రభుత్వం కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) కింద రూ.2 కోట్లు మంజూరు చేయగా దాతల నుంచి సేకరించిన రూ.8 కోట్లకు లెక్కలు చెప్పని వారిపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గాలి వెంకటరామిరెడ్డి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అర్జీ అందజేశారు. ప్రధానంగా దాతల నుంచి సేకరించిన విరాళాలకు ఎలాంటి రసీదులు ఇవ్వలేదన్నారు. అంతేకాక ఈ విషయం తనకు తెలియదని ఈవో తప్పించుకోవాలని చూస్తున్నాడన్నారు. ఇప్పటికే కమిటీ రాజీనామా చేసినందున తాము దేవునికి విరాళంగా ఇచ్చిన డబ్బులు ఏమైపోయాయో తెలియక భక్తులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని అర్జీ ద్వారా తెలిపారు.

శ్యామల కాశిరెడ్డి సేవలు అభినందనీయం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఉగ్ర

వెలిగండ్ల, సెప్టెంబరు 23: శ్యామల కాశిరెడ్డి సేవలు అభినందనీయమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. తన తండ్రి పేరుమీద శ్యామల వెంకటరెడ్డి ఫౌండేషన్ ఏర్పాటుచేసి మండలంలో పలు అభివృద్ధి పనులకు చేయూతనిస్తున్నారని అన్నారు. తన సొంత నిధులతో బస్సు షెల్టర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సోమవారం వెలిగండ్లలో బస్సు షెల్టర్‌ను మంత్రి రవికుమార్, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ప్రారంభించారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి

పామూరు, సెప్టెంబరు 23: పామూరు మండలాన్ని అభివృద్ధి పథంలో నిలబెట్టాలని ఎంపీపీ గంగసాని లక్ష్మి అధికారులకు సూచించారు. సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. మండల పశువైద్యాధికారి ఈమని శ్రీసాయి మాట్లాడుతూ పశువైద్యశాల మరమ్మతులకు గురై అధ్వానంగా ఉందన్నారు. నిధులు కేటాయించి అభివృద్ధి పరచాలని ఎంపీపీని కోరగా, బడ్జెట్ కేటాయించలేమని చెప్పారు. సమావేశంలో ఎంపీడీవో బి.సురేష్, జడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, వైస్‌ఎంపీపీ గంధం ఏసురత్నం, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

ముండ్లమూరు, సెప్టెంబరు 23: అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మట్టా సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మారెళ్లలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలుచేస్తున్నారని చెప్పారు. ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో పూరిమెట్ల యల్లయ్య, గార్లపాటి కృష్ణ, టి.లక్ష్మీ నారాయణబాబు, గార్లపాటి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

'సంక్షోభంలోనూ సంక్షేమం'

దొనకొండ, సెప్టెంబరు 23: సంక్షోభంలోనూ కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమం అందించి అభివృద్ధికి రెక్కలు తొడిగిందని టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు అన్నారు. సోమవారం దొనకొండ, ఆరవళ్లిపాడు గ్రామాల్లో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తూ స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమ్మతోటి సుబ్బారావు, పత్తి వెంకటేశ్వర్లు, పరుచూరి రామలింగయ్య, దుగ్గెంపూడి చెంచయ్య, కుందుర్తి లక్ష్మణ్, పోతిపోగు చెన్నయ్య, బొందల రాజు, పి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రామిరెడ్డి సేవలు మరువ లేనివి

ముండ్లమూరు, సెప్టెంబరు 23: టీడీపీ నాయకులు మర్రెడ్డి రామిరెడ్డి సేవలు మరువ లేనివని మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు అన్నారు. సోమవారం మండలంలోని పూరిమెట్ల గ్రామంలో రామిరెడ్డి తృతీయ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామిరెడ్డి కుమారుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తూ మంచి గుర్తింపు పొందారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మానం రమేష్, చాగం కొండారెడ్డి, పూసల పవన్ కుమార్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

పీసీపల్లి, సెప్టెంబరు 23: పీసీపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ములకా నాగేశ్వరరావు క్రీడా దుస్తులను బహూకరించారు. ఉపాధ్యాయుల కోరిక మేరకు రూ.పదివేల విలువ కలిగిన క్రీడా దుస్తులను అందజేశారు.ఈ సందర్భంగా నాగేశ్వరరావును ప్రధానోపాధ్యాయుడు తిరుపతయ్య, ఉపాధ్యాయులు ఏసుబాబు, నరసింహారావు, మధు, పీడీ నరేష్, తదితరులు అభినందించారు.


వరద బాధితులకు విరాళం

పామూరు, సెప్టెంబరు 23: విజయవాడ వరదలతో నిరాశ్రులైన బాధితులను ఆదుకొనేందుకు సీఎం రిలీఫ్ ఫండ్‌కు పామూరుకు చెందిన పెండ్యాల బాల తిరుపతయ్య తన వంతుగా ఎమ్మెల్యే ఉగ్ర సమక్ష్యంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు సోమవారం రూ. 10 వేల చెక్‌ను అందజేశారు. తెలుగు మహిళా నాయకురాలు లూన జబిన్ రూ.5 వేలు అందజేశారు.

విద్యార్థులను ప్రోత్సహించటం అభినందనీయం

తాళ్లూరు, సెప్టెంబరు 23: దేశప్రధానితో సన్మానం అందుకున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు రామ్‌భూపాల్‌రెడ్డి సొంత నిధులు వెచ్చించి పేదవర్గాల విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పాటు అందించటం అభినందనీయమని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ జి.సునీత అన్నారు. సోమవారం కేజీబీవీలో పదో తరగతి, ఇంటర్‌లో మొదటి, రెండు ర్యాంకులు పొందిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

అన్న క్యాంటీన్‌కు రూ. 15వేల విరాళం



ఎమ్మెల్యేకు 15వేల విరాళం అందజేస్తున్న సిమెంటు, ఐరన్ వ్యాపారులు

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 23 : టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి గిద్దలూరు సిమెంటు, ఐరన్ వ్యాపారుల అసోసియేషన్ సభ్యులు అన్న క్యాంటీన్ నిర్వహణకు రూ.15వేల విరాళాన్ని అందచేశారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి వారిని అభినందించారు. కార్యక్రమంలో సభ్యులు నారాపురం సుబ్బయ్య, వాడకట్టు రామాంజనేయులు, నంది శ్రీను, సూరె మహేష్, అరవింద్, ఆనంద్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంక్షోభంలోనూ హామీల అమలు

» మంత్రి గొట్టిపాటి రవికుమార్

పీసీపల్లి ,సెప్టెంబరు 23: రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా, ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందనడానికి నిదర్శనమే వంద రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే సాక్ష్యమని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని మురుగుమ్మి గ్రామంలో సోమవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి ఇంటింటికి తిరిగి స్టిక్కర్లు అంటించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన వంద రోజుల్లో గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథ



పామూరులో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

కాలను జనసేన, బీజేపీల సహకారంతో చేసి చూపించారన్నారు. మురుగుమ్మి గ్రామ ప్రజల కోరిక మేరకు విద్యుత్ లో వోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు నూతన సబ్‌స్టేషన్‌ను మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ పీసీపల్లి మండలాన్ని వెలుగొండ ఆయకట్టు పరిధిలోకి చేర్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో జాన్‌ఇర్విన్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో రమణారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, వెంగళాయపల్లి, నేరేడుపల్లి, గుదేవారిపాలెం సర్పంచ్‌లు కరణం తిరుపతయ్య, పల్లా మల్లికార్జున్, కనపర్తి శాంసన్, వివిధ శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టి రోడ్లులేని గ్రామాలుగా తీర్చిదిద్దటమే ప్రభుత్వ లక్ష్యం

పామూరు, సెప్టెంబరు 23: మట్టిరోడ్డు లేని గ్రామాలుగా తీర్చిదిద్దటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సోమవారం పామూరు పట్టణంలో ఉపాధి నిధులతో చేప ట్టనున్న 23 సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రి రవికుమార్ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డితో కలిసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాజీ సర్పంచ్ డీవీ మనోహర్ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ పాలనలో పంచాయతి నిధులను పక్కదారి పట్టించారని అన్నారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాల నలోనే పంచాయతీలకు 14, 15 ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేసిన ట్టు చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ పామూరును మోడల్ పట్టణంగా తీర్చిదిద్దెందుకు రూ.5 కోట్లతో సీసీ రోడ్లు మంజూరు చేశామన్నారు. ప్రజల ఆస్తులను ఎండోమెంట్ నిషేధిత జాబితా నుంచి విముక్తి కలిగించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పలువురు నాయకులు మంత్రి రవికుమార్, ఎమ్మెల్యే ఉగ్రను సత్కరించారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఏ.ప్రభాకర్‌చౌదరి, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, యారవ శ్రీనివాసులు, భైరెడ్డి జయరామిరెడ్డి, బోయిళ్ల నారాయణరెడ్డి, షేక్ ఖాజారహంతుల్లా, ఉప్పలపాటి హరిబాబు, పందిటి హరీష్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య, ఆర్డీవో జాన్‌ఇర్విన్, తహసీల్దార్ రమణారావు, పీఆర్ డీఈ ఆదిశేషు, ఆర్ డబ్ల్యూఎస్ డీఈ విశ్వనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 23: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో సోమవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు స్వామివారి పూర్ణ కుంభం తో స్వాగతం పలికారు. అనంతరం స్వామి మూలవిరాట్ వద్ద అర్చకులు మంకాల సత్యనారాయణశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా, దేవస్థాన చైర్మన్ కొమ్మి చినఆదినారాయణ, ఈవో నరసింహాబాబు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో యారవ శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, నరసారెడ్డి, ఎస్‌సీ మాలకొండయ్య, రజ్జబ్‌బాషా, సయ్యద్ దౌలత్‌బాషా, మన్నేపల్లి శ్రీను, బొబ్బూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతగా పనిచేయాలి

కనిగిరి, సెప్టెంబరు 23: రోగులకు మెరుగైన సేవలు అందించటంలో వైద్యులు, సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సోమవారం స్థానిక కమ్యూనిటీ వైద్యశాలలో నూతనంగా ఏర్పాటుచేసిన ఓపీ బ్లాకును ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆసుపత్రిలో వివిధ విభాగాలను పరిశీలించారు. ఆయా విభాగాల ద్వారా అందుతున్న సేవలు, సౌకర్యాలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ప్రభుత్వాసుపత్రిలో తన సొంత నిధులతోపాటు, దాతల సహకారంతో చేపట్టిన అభివృద్ధిపై మంత్రి అభినందించారు. కార్యక్రమంలో ఆర్డీవో జాన్‌ఇర్విన్, సూపరింటెండెంట్ అబ్దుల్‌కలాం, టీడీపీ నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, నంబుల వెంకటేశ్వర్లుయాదవ్, నారపరెడ్డి (యడవల్లి) శ్రీనివాసులరెడ్డి, రాచమల్ల శ్రీనివాసులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలుచేస్తున్నాం..

వెలిగండ్ల, సెప్టెంబరు 23: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్నారని రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఇది



వెలిగండ్ల: సచివాలయాన్ని ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

మాటమీద నిలబడే ప్రభుత్వమని చెప్పారు. సోమవారం మండలంలోని నాగిరెడ్డిపల్లిల్లో రూ.కోటి 87 లక్షలతో నిర్మించిన ప్రభుత్వ వైద్యశాల, వెలిగండ్లలో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఎస్సీ కాలనీలో నిర్మించిన సిమెంట్ రోడ్డును మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ విజయవాడ వరద బాధితుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు విరాళాలు సేకరించి ఆదుకుంటున్నారని అన్నారు. మండలంలోని కంకణంపాడు, ఇమ్మడిచెరువు గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు త్వరలో ఏర్పాటుచేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ వెలిగండ్ల మండల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రాధాన్యతాక్రమంలో సమస్యలను పరిష్కరి స్తామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి అర్జున్‌నాయక్, ఆర్డీవో జాన్‌ఇర్విన్, టీడీపీ నాయకులు శ్యామల కాశిరెడ్డి, దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, ముత్తిరెడ్డి, కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, చిలకల వెంటటేశ్వర్లు, బీరం వెంకటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పీసీపల్లి: మురుగుమ్మిలో కరపత్రాలు అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే ఉగ్ర

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
మంగళవారం 24 సెప్టెంబరు 2024





ఐదేళ్ల వైసీపీ పాలనలో కౌలు రైతు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాడు. 2014--19 మధ్య ఉన్న కౌలు రైతు కార్డు విధానంలో మార్పులు తీసుకొచ్చి అన్నింటినీ సీసీఆర్‌సీ(క్రాప్ కల్టివేటర్స్ రైట్ కార్డ్) కార్డుతో ముడి పెట్టి కౌలు చేయడమంటేనే గుది బండ అనే స్థాయికి గత ప్రభుత్వం తీసుకొచ్చింది. రుణాలు మొదలుకుని నష్ట పరిహారం వరకు అడుగడుగునా కౌలు రైతు ఐదేళ్ల పాటు నానా ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ఇకపై తమ ఇక్కట్లకు తెరపడ్డట్టేనని కౌలు రైతాంగం భావించింది. దానికి అనుగుణంగా కూటమి ప్రభుత్వం సీసీఆర్‌సీ కార్డుల విషయంలో పెద్ద ఎత్తున లక్ష్యాలను విధించి వ్యవసాయ సిబ్బందిని పరిగెత్తించింది. గడిచిన ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే కౌలు హక్కు పత్రాలను అన్నదాతలకు అందించడంలో గణనీయమైన పురోగతినే ప్రభుత్వం సాధించింది. పెరిగిన సీసీఆర్‌సీ కార్డుల సంఖ్యతో పాటు కౌలు రైతులకు రుణాలు అందించే విషయంలో బ్యాంకర్లు ఉదారంగా వ్యవహరించాలని ప్రభుత్వం కోరింది. కానీ గత ప్రభుత్వంలో బ్యాంకర్ల తీరు ఎలా ఉందో ఇప్పుడు కూడా దాదాపుగా అదేరీతిన ఉండడంతో కౌలు రైతులకు రుణాల విషయంలో అన్యాయం జరుగుతూనే ఉంది.

కౌలు రైతులపై.. కనికరమేది..?

మరీ తీసికట్టుగా..

బాపట్ల జిల్లాలో ఖరీఫ్‌సీజన్‌కు గాను రూ.3,750 కోట్లను లక్ష్యంగా అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో 5 శాతం వాటా అంటే దాదాపు రూ. 180 కోట్లు కౌలు రైతులకు దక్కాల్సి ఉంది. కానీ దాదాపుగా ఖరీఫ్ ముగింపుకొచ్చింది, రుణ లక్ష్యాలు పూర్తయ్యాయి. కానీ చివరికి కౌలు రైతులు అందుకున్న రుణాలు రూ.18 కోట్లలోపే ఉండడం వారికి రుణాలు అందించే విషయంలో ప్రభుత్వం మారినా పురోగతి లేదనే దానికి సూచికగా కనబడుతోంది. ఇక గతేడాది వైసీపీ ప్రభుత్వంలో అయితే ఇది పది కోట్లలోపే ఉండడం గమనార్హం. ఇక గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కూడా వేల కోట్లతో వార్షిక రుణ పద్దును బ్యాంకర్లు ప్రకటించారు. తీరా ముగింపు కొచ్చేసరికి గుంటూరు జిల్లాలో రూ.7 కోట్లు, పల్నాడు జిల్లలో రూ.11 కోట్లలోపులనే కౌలు రైతులు అందుకున్న రుణాలు ఉండడం వారి రుణ దీన స్థితికి అద్దం పడుతోంది. మూడు జిల్లాల పరిధిలో గతంతో పోలిస్తే ప్రభుత్వ చొరవ వల్ల సీసీఆర్‌సీ కార్డుల జారీలో గణనీయమైన పురోగతి కనబడింది. కానీ వాటిని ఎక్కువ శాతం మంది కౌలు రైతులు తీసుకునేదే బ్యాంకుల నుంచి రుణాలు వస్తాయనే ఆశతోనే. కానీ అంతిమంగా జారీ చేసిన సీసీకార్డుల్లో 15 శాతం మందికి కూడా రుణాలు అందకపోవడంతో వాటిని తమకు ఇచ్చి లాభమేంటనే ప్రశ్న రైతుల నుంచి వస్తోంది.



బ్యాంకర్ల సహకారం లేకపోవడం వల్లే..

వార్షిక పద్దు ప్రకటించేటప్పుడు ప్రభుత్వ ప్రాథమ్యాలకు అనుగుణంగా కౌలు రైతులకు రుణాలు అందించే విషయంలో సహకరిస్తామని బ్యాంకర్లు చెబుతారు. కానీ ఆచరణలోకొచ్చేసరికి సవాలక్ష నిబంధనలతో వారికి మొండిచెయ్యి చూపించడం వల్లే కౌలు రైతులకు రుణాలు అందించడంలో ఈ దుస్థితి తలెత్తుతోంది. పైగా అందించే ఆ అరకొర రుణాలు కూడా పూర్తిగా వ్యక్తిగత రుణాలు కాకుండా రైతు మిత్ర గ్రూపులు, జాయింట్ పార్మర్స్ గ్రూప్స్ కలిస్తేనే రుణాలు ఇంత తీసికట్టుగా ఉంటున్నాయి. అదే ఇక వ్యక్తిగత రుణాల వరకే లెక్క తీస్తే ఈ గణాంకాలు మరీ కుచించుకుపోవడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రభుత్వం కూడా ఆర్థిక సంవత్సరం ఆరంభంలో సమావేశం పెట్టి వార్షిక పద్దు ప్రకటించి రుణాల విషయంలో మార్గనిర్దేశకాలు జారీ చేసి మిన్నకుండడం కూడా బ్యాంకర్ల వైపు నుంచి సహకారం అందకపోవడానికి కారణంగా కనబడుతోంది. నెలకొకసారి కౌలు రైతులకు అందించే రుణాల విషయంలో సమీక్ష జరిపి బ్యాంకులకు కూడా కౌలు రైతులకు అందించే రుణాల విషయంలో లక్ష్యాలు నిర్దేశిస్తేనే పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉంది. లేదంటే ఏటా వార్షిక పద్దులో ఘనంగా కౌలు రైతుల వాటా ఇంతని గొప్పలు చెప్పడం తర్వాత వాటిని పట్టించుకోకపోవడం మొక్కుబడి తతంగంగా నిలిచిపోతోంది.

బాపట్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వార్షిక పద్దు ఆధారంగా ఖరీఫ్ రుణ లక్ష్యం దాదాపు పూర్తయింది. ఇందులో కౌలు రైతుల వాటా తీస్తే నానాటికీ తీసికట్టు నాగంబొట్టు అన్న చందాన ఉంది తప్పితే వారికి గతంతో పోలిస్తే అదనంగా ఒనగూరిన ప్రయోజనం గుండుసున్నా. కౌలు రైతులను ఆదుకోవాలనే ప్రభుత్వ లక్ష్యాలను దెబ్బతీసే విధంగా బ్యాంకర్లు నిబంధనల ఉచ్చు వేసి కౌలు రైతులకు మొండిచెయ్యి చూపిస్తున్నారు. దీనికి తోడు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేసి వ్యవసాయ శాఖ మిన్నకుండడం కూడా కౌలు రైతులకు రుణాల విషయంలో ఇప్పటికీ అన్యాయం జరుగుతూనే ఉంది. ఈ ఖరీఫ్ సీజన్ ఆరంభంలో కౌలు రైతుల రుణ వాటాలో ప్రభుత్వం నిర్దేశించిన మొత్తాలను ఇప్పుడు జారీ చేసిన మొత్తాలను పోలిస్తే రుణాల విషయంలో బ్యాంకుల నిర్లక్ష్యం బయటపడుతోంది. కూటమి ప్రభుత్వం మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నామని కానీ ఇప్పటికీ రుణాల విషయంలో తమకు నిరాశే ఎదురవుతుందని కౌలు రైతాంగం వాపోతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కౌలు రైతులకు అందించిన రుణాల మీద సమీక్ష జరిపి న్యాయం చేయాలని అన్నదాతలు అభ్యర్థిస్తున్నారు

- ప్రభుత్వం మారినా.... కౌలు రైతుకు సున్నా...!
- రుణాలు అందించడంలో సహకరించని బ్యాంకర్లు
- సీసీఆర్‌సీ కార్డుల జారీతో సరి.. రుణాల మాటేమిటి !
- వేల కోట్లతో ఘనంగా ఖరీఫ్ వార్షిక పద్దు
- కౌలు రైతుల వాటా మాత్రం తీసికట్టుగానే..

సీసీఆర్‌సీ కార్డుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ...

కౌలు రైతులకు అందించే సీసీఆర్‌సీ కార్డుల జారీ విషయంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు అందులో విజయవంతమయింది. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన వాటితో పోలిస్తే గణనీయమైన పురోగతిని సీసీఆర్‌సీ కార్డులను కౌలు రైతులకు అందించే విషయంలో సాధించింది. పెట్టుకున్న లక్ష్యాలలో దాదాపు 85 శాతం వరకు కార్డులను కౌలు రైతులకు అందించారు. బాపట్ల జిల్లాలో 1,06,300 సీసీఆర్‌సీ కార్డులను కౌలు రైతులకు అందించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం పెట్టుకోగా ఇందులో ఇప్పటికే 86,500 కార్డులను అందించింది. అదే విధంగా గుంటూరు జిల్లాలో 46,800, పల్నాడులో 66,000 కార్డులను అందించాలని లక్ష్యం పెట్టుకోగా ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా 85శాతం కార్డులను ఇప్పటికే అందించి గత ప్రభుత్వంతో పోలిస్తే మెరుగైన ఫలితాలను కూటమి ప్రభుత్వం సాధించింది

వార్షిక పద్దు వేల కోట్లలో...

ఏటా ఆర్థిక సంవత్సరం ఆరంభంలో బ్యాంకర్లతో సమావేశమై జిల్లాల వారీగా వార్షికపద్దును ప్రకటించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ పద్దుల్లో అగ్రతాంబూలం సేద్యానిదే ఉంటుంది. గత ప్రభుత్వంలో వ్యవసాయ రుణాల్లో కౌలు రైతుల వాటాను నిర్దిష్టంగా నిర్వచించేది కాదు. దీంతో వారి కేటాయింపుల విషయంలోనూ స్పష్టత లోపించేంది. కానీ కూటమి ప్రభుత్వం కొలువుదీరాక వ్యవసాయ రుణాల్లో కౌలు రైతాంగం వాటా 5 శాతం వరకు ఉండాలని, ఇందుకు బ్యాంకర్లు కూడా మానవతా దృక్పథంతో సహకరించాలని ఖరీఫ్ ఆరంభంలోనే తెలిపింది. వాస్తవానికి కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు తీసుకునేదే బ్యాంకు రుణాల వస్తాయనే ఆశతోనే. ఖరీఫ్ ముగింపకొచ్చింది...బ్యాంకులు తాము రుణ లక్ష్యాలను చేరుకున్నామనే గొప్పలూ చెప్పుకుంటున్నాయి. కానీ కౌలు రైతులకు అందిన రుణ మొత్తాలను పరిశీలిస్తే విస్తుపోవడం ఖాయంగా కనిపిస్తోంది.

కొత్త ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నాం..

రుణాల విషయంలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా తమను వంచించిందని, కానీ కూటమి ప్రభుత్వంపై తాము ఆశలు పెట్టుకున్నామని కౌలు రైతులు చెబుతున్నారు. సీసీఆర్‌సీ కార్డులు అందించే విషయంలో చొరవ చూపిన ప్రభుత్వం వాటి ద్వారా అందించే రుణాల విషయంలో బ్యాంకర్ల నుంచి పూర్తి స్థాయిలో సహకారం తీసుకోవడంలో విఫలమైందని కౌలు రైతాంగం ఆరోపిస్తోంది. ఇప్పటికైనా జిల్లాల వారీగా కౌలు రైతులకు అందించిన రుణాల లెక్కలను జిల్లా కలెక్టర్లు సమీక్షిస్తే రుణ పద్దు కేటాయింపుల్లో తమకు ఏ స్థాయిలో అన్యాయం జరిగిందో అర్థమవుతుందని కౌలు రైతులు చెబుతున్నారు.

- అతని అక్రమాలపై అప్పట్లో స్వపక్షంలో, విపక్షంలోనూ రచ్చ
- ఒక వైపు దర్యాప్తు జరుగుతుండగా జనసేనలో చేరే ప్రయత్నం
- కోపంతో రగిలిపోతున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్గీయులు
- కేంద్ర మంత్రి పెమ్మసాని అనుయాయుల్లో విస్మయం
- ఇదే తరహాలో కొందరు బీజేపీలో చేరే ప్రయత్నం
- ఇటువంటి వారి విషయంలో ఆచితూచి వ్యవహరించకపోతే కూటమికి అప్రతిష్ట..

కూటమిలో.. కిలారి చిచ్చు





గుంటూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ళ వైసీపీ పాలనలో సీఎం జగన్‌తో అంటకాగి పొన్నూరు నియోజకవర్గం అడ్డాగా రూ. వందల కోట్ల దోపిడీకి పాల్పడ్డాడనే ఆరోపణలకు గురైన మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య కూటమిలో భాగమైన జనసేనలో చేరేందుకు ప్రయత్నిస్తున్నాడనే వార్తలను ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. అక్రమ క్వారీయింగ్‌లతో రూ. వందల కోట్లు దోపిడీకి పాల్పడ్డాడని అప్పట్లో పొన్నూరు నియోజకవర్గానికి చెందిన సొంత పార్టీ నేతలే రోడ్డెక్కి యాగీ చేసిన విషయం తెలిసిందే. ఆనాడు ప్రతిపక్ష నేతగా ఉన్న ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పలుమార్లు కిలారి దోపిడీని సాక్ష్యాలతో ఎండగట్టటం జరిగింది. అక్షరాల 700 ఎకరాల్లో అక్రమ క్వారీయింగ్ అప్పటి ఎమ్మెల్యే రోశయ్య కనుసన్నల్లోనే జరగటాన్ని కేజీఎఫ్ తరహా దోపిడీగా అభివర్ణించారు. ఒక్క అక్రమ క్వారీయింగే కాకుండా ఉద్యోగుల పోస్టింగ్‌ల సమయంలో పెద్ద ఎత్తున డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. అంత వరకైతే పర్వాలా ఆ మండలంలో పనిచేసే ఎస్‌ఐలు, సీఐలు, తహశీల్దార్‌లకు సైతం నెల నెలా ఇండెంట్ పెట్టి వసూలు చేశారని కూడా ఏకంగా కొందరు అధికారులే రచ్చకెక్కారు. తన మాట వినని అధికారులను సస్పెండ్ చేయించటం వంటి చర్యలకు కూడా కిలారి పాల్పడినట్లు అప్పట్లో ఆధారాలు ఉన్నాయి. ఏకంగా ఓ తహశీల్దార్‌ను అయితే అతని దోపిడీకి సహకరించటం లేదని సస్పెండ్ చేయించారు. చివరకు ఆయన న్యాయస్థానంలో పోరాటం ద్వారా తిరిగి తన పదవిని కాపాడుకున్నారు. ఒక దశలో పొన్నూరు నియోజకవర్గంలో ఉద్యోగం చేయాలంటే అధికారులు వణికిపోయారు.

రోశయ్య హయాంలో పొన్నూరులో వైసీపీ ఎంత పతనావస్థకు చేరిందంటే ఆ సీటును అడిగేందుకు ఎవరూ ముందుకు రాకపోవటమే తార్కాణం. ఇంత అప్రతిష్ఠ రోశయ్య కూడగట్టుకోవటం మూలంగానే తిరిగి అతనికి సీటిస్తే పొన్నూరులో ఓటమి ఖాయమని భావించే అతన్ని అక్కడ నుంచి తప్పించారు. ఆ తరువాత గుంటూరు ఎంపీగా కూడా ఆయనను తప్పనిసరి పరిస్థితుల్లోనే బరిలోకి దించారు. అతని బావ ఉమ్మారెడ్డి వెంకటరమణకు తొలుత ఎంపీ సీటును ఇవ్వగా ఆయన కొద్ది రోజులకే పోటీకి నిరాకరించి తప్పుకున్నారు. అప్పటికే టీడీపీ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన పెమ్మసాని చంద్రశేఖర్‌ను తట్టుకొని నిలబడేందుకు ఎవరూ ముందుకు రాకపోవటంతో కిలారి రోశయ్యను బరిలోకి దించారు.

జగన్ వత్తిడితో ఎంపీ బరిలోకి దిగిన కిలారి గెలుపు కోసం పది శాతం కూడా ప్రయత్నం చేయలేదు. గెలవనని ముందుగానే నిర్ణయించుకోవటంతో పార్టీ ఇచ్చిన ఫండ్ మినహా సొంత డబ్బు రూపాయి కూడా ఖర్చు చేయలేదు. ఆ ఎన్నికల్లో మూడు న్నర లక్షలకు పైగా ఓట్ల తేడాతో ఘోర పరాజయాన్ని కిలారి చవిచూశారు. కొద్ది రోజుల క్రితం వైసీపీకి రాజీనామా చేస్తు న్నట్లు ప్రకటించారు. వాస్తవానికి జగన్ హయాంలో పొన్నూరులో ఆయన చేసిన అరాచకాలపై ప్రస్తుత ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆధారాలతో సహా అధికారులకు అందించటంతో దర్యాప్తు మొదలైంది. ఈ కేసుల నుంచి తప్పించుకునేందుకే ఆయన కూటమి గొడుకు కిందకి చేరే ప్రయత్నం ప్రారంభించాడు. టీడీపీలో ఎటువంటి పరిస్థితుల్లో చేర్చుకోరని నిర్ణయించుకొని తన సామాజికవర్గం నేతల ఆసరాతో జనసేనలో చేరే ప్రయత్నం ముమ్మరం చేశారు. రెండు రోజుల క్రితం జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను కూడా మర్యాద పూర్వకంగా కిలారి కలిసి వచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన తన అనుయాయులతో త్వరలో తాను జనసేనలో చేరబోతున్నట్టు తద్వారా తిరిగి తాము అధికార పార్టీ గొడుగు కిందకు చేరుతున్నామని ధీమా వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో టీడీపీ శ్రేణుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ముఖ్యంగా పొన్నూరు నుంచి ఆరు పర్యాయాలు గెలిచి ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న ధూళిపాళ్ళ నరేంద్ర వర్గీయులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పాడి రైతులకు ఎంతో వెన్నుదన్నుగా ఉన్న సంగం డెయిరీని మూత వేయించేందుకు అప్పడు ఎమ్మెల్యేగా ఉన్న కిలారి రోశయ్య చేసిన ప్రయత్నాలను నరేంద్ర అనుయాయులు గుర్తుచేస్తున్నారు. 2019 ఎన్నికల్లో వైసీపీ గాలిలో గెలిచి ఒక్క మారు గెలిచినందుకే రోశయ్య ఎంతో విర్రవీగి టీడీపీ శ్రేణులపై పొన్నూరు నియోజకవర్గంలో ఎన్నో అక్రమ కేసులు బనాయించిన విషయాలను కూడా వారు మరిచిపోలేకపోతున్నారు. అటువంటి నేతను కూటమిలో భాగమైన జనసేనలో చేర్చుకుంటే కలిసి మెలిసి తిరగటం ఎలా సాధ్యమవుతుందని వారు ప్రశ్నిస్తున్నారు. కాగా ఇప్పటి వరకు రోశయ్యను చేర్చుకునే విషయంలో కూటమి నేతలు ఎవరూ కూడా తమ ఎమ్మెల్యే నరేంద్రను సంప్రదించలేదని ఆయన అనుయాయులు వాపోతున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన రోశయ్య పెమ్మసాని చంద్రశేఖర్ చేతిలో ఓడిపోయిన విషయం తెలిసిందే. రోశయ్య చేరికపై పెమ్మసానిని కూడా సంప్రదించలేదని ఆయన అనుయాయులు మండిపడుతున్నారు. సొంత పనిపై అమెరికా వెళ్ళిన నరేంద్ర ఒక వారంలో తిరిగి రానున్నారు. అదే విధంగా ప్రస్తుతం కేంద్ర మంత్రిగా వ్యవహరిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్ కూడా సొంత పనిపై అమెరికా వెళ్ళటం జరిగింది. వీరిద్దరూ ఈ నెలాఖరులో రానున్నారు. వచ్చాక వారి స్పందన ఏమిటో వెల్లడి కానున్నది.

అంగన్‌వాడీల్లో.. ఉడకని పప్పు



- నామమాత్రంగా సరఫరా
- పౌష్టికాహారంలోనూ కోత

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) అంగన్‌వాడీలకు కందిపప్పు సరఫరాలో నిర్లక్ష్య వైఖరి కనిపిస్తోంది. ఈ నెలలో ఒక్క కేంద్రానికి కూడా కందిపప్పు సరఫరా చేయలేదు. పౌరసరఫరాల శాఖ నిర్లక్ష్యం చిన్నారులు, గర్భిణులకు శాపంగా మారుతోంది. సదరు కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించని కారణంగా సరఫరా నిలిచిపోయిందని చెబుతున్నారు. కందిపప్పు సరఫరా నిలిచిపోవడంతో పప్పు అందకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకున్న బాలింతలు, గర్భిణులకు నెలకు కిలో కందిపప్పు సరఫరా నిలిచిపోవడంతో వారు మార్కెట్‌లో కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ 170 నుంచి 180 వరకు ధర ఉంది. దీంతో వారిపై ఆర్థిక భారం పడుతోంది. 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలకు నిత్యం 15 గ్రాముల కంది పప్పు ఇవ్వాలి. దీంతో చాలా చోట్ల పప్పు లేకుండానే మెనూ లాగించేస్తున్నారు.

పల్నాడు, బాపట్ల, గుంటూరు, జిలాల్లో 5,401 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 2,30,690 మంది లబ్ధిదారులు ఉన్నారు. కేంద్రాలకు వచ్చే గర్భిణులు బాలింతలు పిల్లలకు మధ్యాహ్న భోజనం కింద సోమవారం నుంచి శనివారం వరకు పప్పు తప్పనిసరిగా వండాల్సి ఉంది. సరఫరా నిలిచిపోవడంతో సిబ్బందికి ఇబ్బందులు తప్పడంలేదు. ఆగస్టు నెలకు అరకొరగా కందిపప్పు సరఫరా చేశారు. సెప్టెంబరు నెలకు కందిపప్పు నేటికీ సరఫరా కాలేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో కందిపప్పు పంపిణీ దాదాపుగా నిలిచిపోయింది. ఆగస్టు నెలకు సంబంధించి అరకొరగా సరఫరా చేయగా, సెప్టెంబరు నెలకు నేటి వరకు కందిపప్పు సరఫరా చేయలేదు. పల్నాడు జిల్లాలో 2032 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 1,37,523 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో బాలింతలు,గర్భిణులు 12,945 మంది, ఆరు నెలల నుంచి 3 ఏళ్ల లోపు పిల్లలు 60,540, 3 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలు 51,739, ఆరు నెలల లోపు చిన్నారులు 7,184 మంది కేంద్రాల్లో నమోదయ్యారు. బాపట్లలో 1,889 అంగన్‌వాడీ కేంద్రాల్లో 81,293 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో గర్భిణులు, బాలింతలు 9,019, 6 నెలల నుంచి 3 ఏళ్లలోపు పిల్లలు 36,693, 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు 26,684, ఆరు నెలల లోపు చిన్నారులు 5,399 మంది ఉన్నారు. గుంటూరు జిల్లాలో 1,480 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,18,747 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో గర్భిణులు, బాలింతలు 10,648 మంది, 6 నెలల నుంచి 3 ఏళ్లలోపు పిల్లలు 49,194, 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు 49,269, ఆరు నెలల లోపు చిన్నారులు 5,609 మంది ఉన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

కందిపప్పు సరఫరా ఇలా..

అంగన్‌వాడీ కేంద్రాలకు ఆగస్టు నెలలో కందిపప్పు పంపిణీని పౌరసరఫరా లెక్కల ప్రకారం పరిశీలిస్తే అరకొరగా సరఫరా చేసినట్టు అర్థమవుతోంది. పల్నాడు జిల్లాలో 33,506 కేజి ప్యాకెట్‌ల కందిపప్పు పంపిణీ చేయాల్సి ఉండగా 7,274 ప్యాకెట్‌లు మాత్రమే పంపిణీ చేశారు. బాపట్ల జిల్లాలో 19,409 ప్యాకెట్‌లకు 7,552 ప్యాకెట్‌లు, గుంటూరు జిల్లాలో 26,314 ప్యాకెట్‌లకు గాను 9,897 ప్యాకెట్‌ల కందిపప్పు పంపిణీ చేసినట్టు సదరు శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. పల్నాడు జిల్లాలో ఎనిమిది, బాపట్ల జిల్లాలో మూడు, గుంటూరు జిల్లాలో మూడు మండలాలకు ఒక్క ప్యాకెట్ కందిపప్పు ఇవ్వలేదు. జూలై నెలలో కూడా అరకొరగానే సరఫరా జరిగింది. మూడు నెలలుగా తమ కేంద్రానికి కందిపప్పు ఇవ్వలేదని లింగంగుంట్ల కేంద్రం సిబ్బంది తెలిపారు. సెప్టెంబరు నెలకు సంబంధించి కందిపప్పు సరఫరా కాలేదని పౌరసరఫరాల శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పటికైనా అంగన్‌వాడీలకు కందిపప్పు అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

---

42 మంది ఎంపీడీఓలు బదిలీ

పక్క జిల్లాల నుంచి వచ్చిన 16 మందికి ఇక్కడ పోస్టింగ్



గుంటూరు సిటీ, సెప్టెంబరు 23 : ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 42 మంది మండల పరిషత్ అభివృద్ధి అధికారుల(ఎంపీడీఓ)ను బదిలీ చేస్తూ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఇంచార్జి సీఈఓ మోహన్ రావు ఉత్తర్వులు జారీచేశారు. ఆదివారం అర్థ రాత్రి కి ఎంపీడీఓల బదిలీల తుదిజాబితా రూపుదిద్దుకుంది. మండలాల వారీగా బదిలీ అయిన ఎంపీడీవోల వివరాలు ఇలా ఉన్నాయి. పీజే విలియమ్స్ (ముప్పాళ్ళ)షేక్ మహబూబ్ సుభాని (చెరుకుపల్లి) జీ కాశియ్య(నకరికల్లు)ఏ శ్రీనివాసరావు (దుగ్గిరాల) ఐ సత్యనారాయణ (పిట్టలవానిపాలెం) కే శివ పార్వతి(ప్రత్తిపాడు) పీ ఉమాదేవి (కారంపూడి) కే నరసింహారావు (కొల్లూరు) కే సమతా వాణి (తాడికొండ) ఎం శోభారాణి (రేపల్లె) వై హనుమారెడ్డి (బెల్లంకొండ) కే సరోజినీ దేవి (రెంటచింత) ఫణి కుమార్ నాయక్ (మాచర్ల) వి విజయలక్ష్మి (కొల్లిపర) టీ సుగుణమ్మ (మంగళగిరి) పీ పుట్టారెడ్డి (దుర్గి) జి విసత్యనారాయణ (రాజుపాలెం) పి రామకృష్ణ (పెదకూరపాడు)ఎన్ వెంకటేశ్వరరావు (ఫిరంగిపురం) బీ శ్రీనివాస్ రెడ్డి (సత్తెనపల్లి) జీ చంద్రశేఖర రావు (పొన్నూరు) బీ మారుతి శేషాంబ (అమృతలూరు) బీ శివన్నారాయణ (వేమూరు) కే ప్రభాకర్‌రావు (నాదెండ్ల)ఏ దీప్తి(తెనాలి)బీ బాబురావు (బాపట్ల)ఆర్ శ్రీనివాసరావు (పెదకాకాని)కే శ్రీనివాసరావు (అచ్చంపేట) ఎం రమేష్ బాబు (వట్టిచెరుకూరు)ఎస్వీ రమణ (భట్టిప్రోలు) కానూరి శిల్ప (తుళ్లూరు) జి లక్ష్మీదేవి (పెదనందిపాడు) కే లలిత(చేబ్రోలు) టీ చందన (మేడికొండూరు) యుగ కీర్తి (కాకుమాను)ఎన్ సుదీప (చుండూరు) వి హేమలతాదేవి (యడ్లపాడు) టీ పార్వతి (అమరావతి) సీహెచ్ రామచంద్రరావు (పిడుగురాళ్ల) బండ్ల శ్రీనివాసరావు (గుంటూరు రూరల్) తోట వెంకట కృష్ణకుమారి (నరసరావుపేట) ఏ శ్రీనివాసరావు(కర్లపాలెం) ఎంపీడీవోలుగా నియమితులయ్యారు. బదిలీ ఉత్తర్వు లను ఎంపీడీఓలు సోమవారమే అందుకున్నారు.మరికొందరు వెంటనే విధుల్లో చేరారు.

పొలం పిలుస్తోంది పోస్టర్ ఆవిష్కరణ

బాపట్ల, సెప్టెంబరు 23 : పొలం పిలుస్తుంది పోస్టర్‌ను కలెక్టర్ జె.వెంకటమురళి, జిల్లా స్థాయి అధికారులు సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలం పిలుస్తుంది కార్యక్రమం వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకేనన్నారు. ప్రతి మంగళ, బుధవారాలలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధుల పొలంబాట, పంటసాగుపై చర్చలు ఉంటాయని తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటమురళి తదితరులు



రూ.3 కోట్లతో నిర్మించిన సబ్‌స్టేషన్ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్

టీడీపీ కూటమి తరఫున ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను ప్రభుత్వం వంద రోజులలో నెరవేర్చింది. పెన్షన్ల పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, అన్న క్యాంటీన్లు పునరుద్ధరణతోపాటు పలు పథకాలపై దృష్టి పెట్టింది. రాష్ట్రంలో సంస్కరణలతోపాటు వైసీపీ ప్రభుత్వం వివిధ శాఖల్లో నిలిపేసిన ప్రజోపయోగ పథకాలను తిరిగి చేపట్టింది. ఇలా ప్రజలకు మేలు జరిగే అనేక మంచి పనులు చేపట్టిన కూటమి ప్రభుత్వం ఆ విజయాలను 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించింది. వంద రోజుల పాలన పూర్తయిన ఈనెల 20 నుంచి 26 వరకు వారంరోజుల పాటు ప్రత్యేక కార్యక్రమం చేపట్టే సభలు, సమావేశాల నిర్వహణతోపాటు ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి వివరించాలని తెలిపింది. అందులో ప్రజాప్రతినిధులు, స్థానిక అధికారులు, సిబ్బంది పాల్గొనాలని ఆదేశించింది. తదనుగుణంగా జిల్లాలో కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది.

ప్రజల వద్దకే పాలన

ఇంటింటికీ వెళ్తున్న పాలకవర్గం

ఇది మంచి ప్రభుత్వం పేరుతో..

వంద రోజుల విజయాలపై ప్రచారం

పలు ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతల భాగస్వామ్యం

ఒంగోలు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో ప్రజల వద్దకు వెళ్తున్నారు. స్థానిక సిబ్బందితో కలిసి రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల్లో సాధించిన విజయాలను ప్రజలకు వివరిస్తున్నారు. ఈ ఏడాది జూన్ 12న రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడగా ఈ నెల 20 నాటికి వంద రోజుల పాలన పూర్తయింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ వంద రోజులలో చేపట్టిన పథకాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజల వద్దకు వెళ్లి వివరించాలని పాలక పెద్దలు నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి ఊహించని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా నుంచే ప్రారంభించిన విషయం విదితమే. తొలి రోజున నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడులో ఆ కార్యక్రమం జరగ్గా కొద్దిగంటల వ్యవధి ముందుగా మాత్రమే సమాచారం అందినా జిల్లా యంత్రాంగం స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో విజయవంతం చేశారు.



ముక్తినూతలపాడులో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

కాగా అదే ఉత్సాహంతో జిల్లావ్యాప్తంగా ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమం కొనసాగుతోంది. అందులోభాగంగా సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కీలక ప్రజాప్రతినిధులు, ఇతర ముఖ్యనేతలు ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగగా టీడీపీ శ్రేణులు, స్థానిక సిబ్బంది ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వ విజయాలు వివరిస్తూ కరపత్రాలు పంపిణీతో పాటు స్టిక్కర్లను అందించారు.

అన్ని నియోజకవర్గాల్లో ఉత్సాహంగా...

కనిగిరి నియోజకవర్గంలోని వెలిగండ్లలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి నేతృత్వంలో గ్రామసభ జరగ్గా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఒంగోలు నగర పరిధిలోని ముక్తినూతలపాడులో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాల్గొనగా నగరంలోని పలు డివిజన్లలో స్థానిక టీడీపీ శ్రేణులు నిర్వహించారు. దర్శి నియోజకవర్గంలోని వెంకటాపురం, ఇతర గ్రామాల్లో టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి నేతృత్వంలో జరిగిన సభల్లో ఎమ్మెల్సీ అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్యే పాపారావు, పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ పాల్గొన్నారు. గిద్దలూరులో జరిగిన కార్యక్రమంలో అక్కడి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొనగా త్రిపురాంతకం మండలం గొల్లవాండ్లపల్లిలో టిడిపి ఇన్‌చార్జీ ఎరిక్షన్‌బాబు పాల్గొన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గం చీమకుర్తిలో టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మన్నం ప్రసాద్ నేతృత్వంలో పెద్దసంఖ్యలో టీడీపీ శ్రేణులు ఈ కార్యక్రమం నిర్వహించారు.

వైసీపీ హయాంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం

- మంత్రి గొట్టిపాటి రవికుమార్

కనిగిరి, సెప్టెంబరు 23: గత వైసీపీ పాలనలో ప్రభుత్వ వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. రాష్ట్ర ఆర్థికంగా వెనుకబడిపోయిందన్నారు. సోమవారం పట్టణ సమీపంలోని అర్బన్ కాలనీలో నూతనంగా రూ.3కోట్లతో ఏర్పాటు చేసిన 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి రవికుమార్ మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తిచేసి కనిగిరి ప్రాంతంలో వ్యవసాయ రంగానికి ఊతమిస్తామన్నారు. కనిగిరి ప్రాంతంలో మరమ్మతులకు గురైన స్తంభాలను తొలగించి వాటి స్థానంలో వంద నూతన స్తంభాలు ఏర్పాటు చేయిస్తామన్నారు. ఇటీవల కనిగిరి పట్టణంలోని ముగ్గురు యువకులు విద్యుదాఘాతంతో మరణించడం దురదృష్టకరమన్నారు. వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందించినట్టు చెప్పారు. కనిగిరి ప్రాంతంలో ఆర్‌డీఎస్ స్కీం కింద రూ.70 కోట్లతో విద్యుత్ పనులు చేపట్టి పూర్తి చేయనున్నట్టు చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో కూడా కనిగిరిలో అన్న కాంటీన్ నిర్వహించి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పేదల ఆకలి తీర్చటం గొప్ప విషయమన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను సీఎం చంద్రబాబు చేపట్టారన్నారు. కనిగిరి ప్రాంతంలో అదనంగా సబ్‌స్టేషన్లు మంజూరు చేయించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. అనంతరం సబ్‌స్టేషన్‌లలో నూతనంగా ఎంపికైన ఆరుగురు షిఫ్ట్ ఆపరేటర్లకు నియామకపత్రాలు అందజేసి ప్రాంగణంలో మొక్కలు నాటారు. తొలుత మండలపరిధిలోని నందనమారెళ్లలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు.



కారు దిగొచ్చిన కలెక్టరమ్మ..!

పేద కుటుంబంపై మానవత్వం చాటుకున్న వైనం

కలెక్టరేట్ వద్ద బాల భిక్షాటకులకు ఆసరా..!

కొత్త దుస్తులు కొనిచ్చి.. వైద్యసేవలు అందించి.. నైట్ షెల్టర్‌లో వసతి

విధి నిర్వహణలో నిరంతరం బిజీగా గడిపే కలెక్టర్ తమీమ్ అన్సారియా మానవత్వం చాటుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగే స్పందన కార్యక్రమానికి హాజరవుతున్న క్రమంలో ఆవరణలో కనిపించిన దృశ్యం ఆమెను కదలించింది. కారులో వెళుతున్న కలెక్టర్‌కు అక్కడే గాంధీ వేషధారణలో ఉన్న ఇద్దరు ఆడపిల్లలను చూసి ఆగారు. గుంతకల్లుకు చెందిన ఓ సంచార జాతులకు చెందిన కుటుంబం ఐదుగురు పిల్లల్తో అక్కడే భిక్షాటన చేస్తుండగా వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా ఇద్దరు చిన్నారులు ఒంటి నిండా సిల్వర్ రంగు పూసుకుని, మహాత్మాగాంధీ వేషధారణలో భిక్షాటన చేస్తుండటం గుర్తించారు. వారిలో ఎనిమిది నెలల చిన్నారి కూడా ఉంది. దీంతో కార్పొరేషన్ కమిషనరు కే. వెంకటేశ్వరరావును, మెప్మా పీడీ టి.రవికుమార్‌ను అక్కడకు పిలిపించారు. వెంటనే చిన్నారులను జీజీహెచ్‌కు తరలించి, వారికి అవసరమైన వైద్యం అందించాలని ఆదేశించారు. దీంతో కమిషనరు వారిని జీజీహెచ్‌కు తీసుకెళ్లడంతోపాటు వారికి స్నానం చేయించి, అవసరమైన కొత్త దుస్తులు అందజేశారు. అనంతరం వారి కుటుంబసభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించి, జీజీహెచ్‌లోని నైట్ షెల్టర్‌లో వారికి వసతి కల్పించారు. అంతేకాకుండా చదువుకోవాల్సిన వయస్సులో భిక్షాటన చేయకూడదని కలెక్టర్ ఆ కుటుంబానికి పిల్లలను హాస్టల్‌లో చేర్పించి, చదివిస్తానని, అలాగే అవసరమైతే నివాస స్థలం కూడా ఏర్పాటు చేస్తామని వారికి భరోసా ఇచ్చారు. కాగా కలెక్టర్ స్పందించిన తీరు పట్ల అక్కడ ఉన్న జేసీ గోపాలకృష్ణ, ఇతర ప్రభుత్వ అధికారులు, పలువురు కలెక్టర్ పెద్ద మనస్సును అభినందించారు.

- ఒంగోలు (కార్పొరేషన్)

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



వాహనంలో ఇరుక్కొని మృతిచెందిన అశోక్

వెంకటాచలం, సెప్టెంబరు 23 : మండలంలోని టోల్‌ప్లాజా వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. గుడ్లూరుకి చెందిన వ్యాపారి సైదులు చెన్నైలో కోడిగుడ్లు కొనుగోలు చేసుకుని బొలేరో వాహనంలో తిరిగి వస్తుండగా వారువస్తున్న వాహనం ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో గుడ్లూరుకి చెందిన బొలేరో డ్రైవర్ అశోక్ (33) వాహనంలోనే ఇరుక్కొని అక్కడికక్కడే మృతి చెందాడు. వ్యాపారి సైదులుతోపాటు ఆయన అన్న కుమార్తె గాయపడ్డారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని క్షతగాత్రులను నెల్లూరుకి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేణంగివరంలో మట్టి తోలకంపై కేసు

ఎక్స్‌కవేటర్‌తో సహా ఏడు ట్రాక్టర్లు స్వాధీనం

అవమాన భారంతో స్థానిక నేత ఆత్మహత్యాయత్నం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేత

పంగులూరు, సెప్టెంబరు 23 : మండలంలోని రేణంగివరంలోని ఊర చెరువులో ట్రాక్టర్లతో మట్టి తరలింపును పోలీసులు అడ్డుకున్నారు. ఎస్ఐ వినోద్‌బాబు ఇచ్చిన సమాచారం మేరకు.. రెవెన్యూ అధికారులు అందించిన సమాచారంతో చెరువులో మట్టిని అక్రమంగా తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లతో పాటు మట్టిని లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై ఆర్ఐ ఏసురత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇంటి అవసరాల కోసం మట్టి తోలుకోవడాన్ని పోలీసులు అడ్డుకున్నారని, దీనిని అవమానంగా భావించిన స్థానిక నేత పోలీసు స్టేషన్ ఎదుట పురుగు మందు తాగే ప్రయత్నం చేశారు. గమనించిన పోలీసులు అడ్డుకుని అతడిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అక్కడ నుంచి ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



వరద బాధితులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

వరద బాధితులకు వస్త్రాల పంపిణీ

చీరాలటౌన్, సెప్టెంబరు 23 : వరద ప్రమాదంతో నిస్సహాయ స్థితిలో ఉన్నవారికి ప్రతి ఒక్కరూ సాయం అందించాలని చీరాల మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్ డెవలప్‌మెంట్ సొసైటీ, టెక్స్‌టైల్స్ మర్చంట్ సొసైటీ ప్రతినిధులు కోరారు. భట్టిప్రోలు సమీపంలోని పెద్దలంక, పెసర్లంక గ్రామాల్లోని ప్రజలకు సుమారు రూ.4లక్షల విలువైన నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ అనుకోని రీతిలో సంభవించిన విపత్తు కారణంగా ఎందరో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ఈక్రమంలోనే తమవంతు సాయం అందించామన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు గుర్రం రాఘవరావు, కోట శ్రీమన్నారాయణ, బ్రహ్మానందం, శ్యామ్ ప్రసాద్, నారాయణరావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ సంచులు వాడొద్దు



జూట్ బ్యాగులను పంపిణీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్సై

చీరాల, సెప్టెంబరు 23 : ప్లాస్టిక్ సంచుల వాడకం వద్దు.. జూట్ సంచులు ముద్దని పొల్యూషన్ కంట్రోలు బోర్డ్ ఏఈ రామకోటయ్య అన్నారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం చీరాల మార్కెట్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలను వివరించారు. చీరాల కూరగాయల మార్కెట్, బాపట్ల కూరగాయల మార్కెట్, రెల్వే స్టేషన్ ప్రాంతాల్లో 500 జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై, ఐటీసీ ప్రతినిధి ఎంఎస్ రెడ్డి, ప్రొటెక్ట్ ఎన్‌జీఓ ప్రతినిధి చంద్రారెడ్డి, కొండలు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌ను వినియోగించుకోవాలి

చీరాల, సెప్టెంబరు 23 : సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు చెప్పారు. సోమవారం కళాశాలలో ఈసీఈ విభాగానికి చెందిన 2, 3 సంవత్సరాల విద్యార్థులకు ఎపైస్వేకేర్ ప్రైవేటు లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో మూడు రోజుల వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఇంటర్‌నెట్ ఆఫ్ థింక్స్ ఎంబెడెడ్ సిస్టమ్స్‌పై అవగాహన కల్పించి, ప్రయోగాలు చేస్తుందని ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ డి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపన్నహస్తం అభినందనీయం

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, సెప్టెంబరు 23 : తోటివారికి సాయపడాలనే మంచి మనస్సుతో వరద బాధితుల సహాయార్థం, అన్న క్యాంటీన్ నిర్వహణకు ఇతోధికంగా ఆర్థిక సాయం అందిస్తున్న శ్రీగౌతమి విద్యా సంస్థల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనీయులని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శ్రీగౌతమి విద్యా సంస్థలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతినిధులు వరద బాధితుల సహాయార్థం రూ.1.50లక్షలు, అన్న క్యాంటీన్ నిర్వహణకు రూ.10వేలు చెక్కుల రూపంలో ఎమ్మెల్యే కొండయ్యకు అందజేశారు. కార్యక్రమంలో విద్యా సంస్థల ప్రతినిధులు ఎం.వెంకటేశ్వర్లు (ఎంవీ, కె.వెంకట్రావు (కేవీ), ఉపాధ్యాయులు, విద్యార్థులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒకే ఒక్కడు

బాలినేనితో జనసేనలోకి వాయల

వైసీపీలోనే ఉంటామంటున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల నాయకులు

కొత్తపట్నం(ఒంగోలు నగరం) సెప్టెంబరు 23: ఆయనతో పోయేదెవరు.. ఇక్కడే (వైసీపీలో) ఉండేదెవరు అనే అభిప్రాయ సేకరణలో ఒకే ఒక్కడు నేను వెళతానంటూ ముందుకొచ్చాడు. మిగిలిన నాయకులు, వైసీపీ తరఫున సర్పంచ్‌లు, ఎంపీటీసీలుగా గెలిచిన వారు, కార్యకర్తలు, గ్రామస్థాయి నాయకులు కూడా బాలినేనితో పోయేదే లేదంటూ తేల్చిచెప్పారు. వైసీపీ మండల స్థాయి విస్తృత సమావేశం సోమవారం రాత్రి కొత్తపట్నంలో కళ్యాణ మండపంలో జరిగింది. జనసేన తీర్థం పుచ్చుకోబోతున్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డితో కలిసి నడిచేది ఎంతమంది అనే విషయంపై ప్రత్యేకించి ఈ సమావేశాన్ని నిర్వహించారు. బాలినేని దూతగా ఇనగంటి పిచ్చిరెడ్డి అక్కడికి హాజరయ్యారు. అయితే ఈ సమావేశంలో దాదాపు అందరూ బాలినేని వెంట జనసేనలోకి వెళ్లేదే లేదంటూ కరాఖండిగా తేల్చిచెప్పారు. మాజీ ఎంపీపీ వాయల మోహనరావు మాత్రమే బాలినేని వెంటే నేను.. ఆయనతోనే నా పయనం అంటూ తన అభిప్రాయాన్ని తేల్చిచెప్పారు. సమావేశంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, దాచూరి గోపాలరెడ్డి, వీరేపల్లి రామచంద్రారెడ్డి(వీఆర్పీ), జిల్లా వ్యవసాయ సలహామండలి మాజీ చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, వాయల మోహనరావు, మండలంలోని వైసీపీ సర్పంచిలు, ఎంపీటీసీలు, గ్రామస్థాయి నాయకులు కూడా పాల్గొన్నారు. బాలినేని వైఖరిపై సమావేశంలో కొంతమంది ఆగ్రహం వ్యక్తం చేయగా మరికొందరు అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీని నట్టేట ముంచేసి జనసేనలోకి పోతున్న బాలినేనితో కలిసి నడిచే ప్రసక్తేలేదంటూ సమావేశంలో పాల్గొన్న అందరూ తేల్చిచెప్పారు. ఒక్క వాయల మోహనరావే నాకు అన్నివేళలా అండదండగా ఉన్న బాలినేనితోనే తాను అడుగులు వేస్తానంటూ అభిప్రాయాన్ని తేల్చిచెప్పారు. కాగా వాయలపై సమావేశంలో పలువురు వైసీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేయటం గమనార్హం. మొత్తం మీద బాలినేని ఆశించినట్లుగా కొత్తపట్నం మండలం నుంచి జనసేన జెండా కిందకు పోయే వారు ఒక్కరే కనిపిస్తున్నారు. మిగిలిన వైసీపీ నాయకులు, కేడర్ ఆయన తీరుపై ఆగ్రహంతో ఊగిపోతున్నారు.



కొత్తపట్నంలో జరిగిన వైసీపీ సమావేశంలో మాట్లాడుతున్న అంజిరెడ్డి, హాజరైన నేతలు

ష్.. గప్‌చుప్!

బాలినేని, జనార్దన్‌లకు అధిష్ఠానాల ఆదేశాలు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు : ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిలు స్థానికంగా మాటల తూటాలు పేల్చుకోవద్దని అధిష్ఠానాల నుంచి ఆదేశాలు అందినట్లు తెలిసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలోని భాగస్వామ్య పార్టీలు అనేక అంశాలపై ఉమ్మడిగా కలిసి పయనిస్తున్న విషయం విదితమే. అయితే జిల్లాలో ఇటు దామచర్ల, అటు జనసేనలో చేరబోతున్న బాలినేనిలు ఆదివారం ఒకరిపై ఒకరు చేసుకున్న విమర్శలపై రెండు పార్టీల అధిష్ఠానాలు స్పందించినట్లు తెలుస్తోంది. రాష్ట్రస్థాయిలో ప్రతి విషయంలోనూ టీడీపీ వైపు నుంచి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు, జనసేన నుంచి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమన్వయంతో ముందుకెళ్తున్నారు. ఎక్కడైనా సమస్యలు వస్తే ఒకరికొకరు మాట్లాడుకొని తదనుగుణంగా ముందుకు సాగుతున్న విషయం జగమెరిగిన సత్యం.ఈ నేపథ్యంలో దామచర్ల, బాలినేనిలు బహిరంగా ఒకరపై ఒకరు వ్యాఖ్యానాలు చేసుకోవడంతో అధినాయకులు ఈవిషయంపై దృష్టి సారించినట్లు సమాచారం. తదనుగుణంగా మున్ముందు మీరు సమస్యలు వచ్చినా తమ దృష్టికి తేవాలని, కిందిస్థాయిలో ఒకరిపై ఒకరు వ్యాఖ్యానాలు చేసుకుంటూ బజారుకెక్కడం సరికాదన్న సంకేతాన్ని వారికి ఇచ్చినట్లు తెలుస్తోంది. తద్వారా ఇద్దరూ స్థానికంగా బహిరంగంగా వ్యాఖ్యానాలు ఫుల్‌స్టాప్ పెట్టే దిశగా రాష్ట్ర నాయకుల నుంచి ఆదేశాలు అందినట్లు సమాచారం. కాగా, జనసేనలో చేరబోతున్న బాలినేనికి కూడా వివిధ కారణాల దృష్ట్యా పార్టీలో చేరే కార్యక్రమానికి పరిమితంగానే నాయకులను తీసుకురావాలన్న సంకేతాలు అందినట్లు తెలిసింది. ఒంగోలు కార్పొరేషన్‌లో వైసీపీలో ఉన్న కార్పొరేటర్‌లతోపాటు, కొందరు ద్వితీయ శ్రేణి నాయకులు, వైసీపీ ప్రజాప్రతినిధులను తనతోపాటు పార్టీలో చేరేందుకు బాలినేని సిద్ధం కాగా, వెంకటేశ్వర స్వామి దీక్షలో పవన్ కల్యాణ్ ఉన్నందున పరిమిత సంఖ్యలోనే పార్టీలో చేరే వారిని తీసుకురావాలని ఆదేశాలు కూడా బాలినేనికి ఇచ్చినట్లు తెలిసింది. కావాలంటే పవన్ కల్యాణ్ దీక్ష పూర్తయిన తర్వాత మరోసారి ఒంగోలులో కార్యక్రమం ఏర్పాటు చేసుకొని మిగిలిన వారు పార్టీలో చేరే కార్యక్రమాన్ని నిర్వహిద్దామని, 26వతేదీ మాత్రం బాలినేనితోపాటు పరిమిత సంఖ్యలోనే పార్టీలో చేరే వారిని తీసుకురావాలని స్పష్టం చేసినట్లు తెలిసింది. కిందిస్థాయిలో ఒకట్రెండు జిల్లాలో రెండు పార్టీల నాయకుల మధ్య వచ్చిన విభేదాలతో రాష్ట్రస్థాయిలో సఖ్యత దెబ్బతినకూడదన్న ఉద్దేశంతో ఇరు పార్టీల అధిష్ఠానాలు ఇటు దామచర్ల, అటు బాలినేనికి బజారుకెక్కవద్దని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. తదనుగుణంగానే సోమవారం ఈ ఇద్దరు నాయకులు ఆదివారం చోటుచేసుకున్న ఘనటలకు కొనసాగింపుగా వ్యాఖ్యానాలు చేయకుండా మిన్నకుండిపోయినట్లు తెలుస్తోంది.

పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉండాలి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 23 : పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ కమిషనర్ ఎం.సత్యనారాయణ అన్నారు. సోమవారం అద్దంకి ప్రభుత్వ వైద్యశాల వద్ద స్వచ్ఛత హి సేవ 2024 కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.శరత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. చీరాల నుంచి గైనకాలజిస్ట్ డాక్టర్ వై.లక్ష్మి, ఒంగోలు నుంచి డెర్మటాలజిస్ట్ డాక్టర్ పి.రాజశేఖర్, సీహెచ్‌సీ పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ పి.వెంకట కిరణ్, డాక్టర్ ఏ.అనితాజ్యోతి, డాక్టర్ జి.ప్రదీప్తి, డాక్టర్ జి.మేర్సీ, డాక్టర్ కె.అవినాష్, డాక్టర్ సుబోద్, ప్రదీప్‌కుమార్ వైద్య శిబిరంలో 105 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. రోగులకు వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు కరి సుబ్బారావు, దామవరపు నాగేశ్వరరావు అల్పాహారం, తాగునీటిని అందించారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఐదు చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

రూ.3.41లక్షల సొత్తు స్వాధీనం

అద్దంకి, సెప్టెంబరు 23 : అద్దంకి, బల్లికురవ, పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఐదు దొంగతనాల కేసులకు సంబంధించి నిందితుడిని అరెస్టు చేసి రూ.3,041,500 విలువైన సొత్తుని స్వాధీనం చేసుకున్నట్లు అద్దంకి టౌన్ సీఐ కృష్ణయ్య తెలిపారు. వివరాలలోకి వెళితే.. ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని సంతనూతలపాడు మండలం పేర్నమిట్టకు చెందిన తన్నీరు మధుబాబు అద్దంకి, బల్లికురవ, పోలీస్ స్టేషన్‌ల పరిధిలో దేవాలయాలతో పాటు తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డాడు. అద్దంకి, కలవకూరు రోడ్లలో ఇటుక బట్టీల వద్ద ట్రాక్టర్ ట్రాలీ, ఆటోలతో పాటు దేవాలయాల్లో ఉపయోగించే వెండి పాదుకలు, పట్టాలు, కుంభ హారతి చెంబు, శఠగోపాలు, ఆంజనేయస్వామి గంట వంటి వాటితో పాటు రూ.25రకాల వస్తువులను చోరీ చేశాడు. వీటి విలువ రూ.3,045,500 కాగా, నిందితుడి వద్ద నుంచి రూ.3,041,500 విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. మధుబాబు 20 సంవత్సరాలుగా చోరీలకు పాల్పడుతున్నాడు. ఇప్పటికే మార్టూరు, జె.పంగులూరు, మద్దిపాడు, సంతమాగులూరు, ఒంగోలు, కనిగిరి, ఇంకోల్లు, బల్లికురవ, చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌లలో పలు కేసులు నమోదై ఉన్నాయి.

రాత్రి సమయాలల్లో దేవాలయాలు, తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లో చోరీలు చేసి దొంగిలించిన సొత్తును పాత ఇనుప దుకాణాలలో అమ్ముతుంటాడు. సోమవారం ఉదయం అద్దంకి సమీపంలోని కొంగపాడు రోడ్డు వద్ద తనిఖీలు చేస్తుండగా మధుబాబు పట్టుబడ్డాడు. అద్దంకి టౌన్ సీఐ కృష్ణయ్య, బాపట్ల సీసీఎస్ సీఐ ప్రేమయ్య ఆధ్వర్యంలో అద్దంకి ఎస్ఐ ఖాదర్‌బాషా, సిబ్బంది అంకమరావు, మరియదాసు, గోపి మధుబాబును అరెస్టు చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో సీఐ ఆ వివరాలను వెల్లడించారు. ఎస్ఐ ప్రవీణ పాల్గొన్నారు.



వివరాలు తెలుపుతున్న సీఐ కృష్ణయ్య, ఎస్ఐలు, సిబ్బంది

చీరాల మున్సిపల్ కమిషనర్‌గా అబ్దుల్ రషీద్

చీరాల, సెప్టెంబరు 23 : రాష్ట్రంలో మున్సిపల్ కమిషనర్ల బదిలీలకు సంబంధించి సోమవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్ ఉత్తర్వులు ఇచ్చారు. అందులో భాగంగా వెంకటగిరి మున్సిపాలిటీలో కమిషనర్‌గా పనిచేస్తున్న అబ్దుల్ రషీద్‌ను చీరాల మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. ప్రస్తుత చీరాల మున్సిపల్ కమిషనర్‌గా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న చక్రవర్తిని తన మాతృ సంస్థ వ్యవసాయశాఖ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ వైజాగ్‌కు బదిలీ చేశారు. రెండు రోజులలో నూతన కమిషనర్ అబ్దుల్ రషీద్ బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

శ్రీమన్నారాయణకు డాక్టరేట్


శ్రీమన్నారాయణకు డాక్టరేట్ అందజేస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు, ఆచార్య విజయలక్ష్మి

మార్టూరు, సెప్టెంబరు 23 : మార్టూరు గ్రామంలోని నేతాజీనగర్‌కు చెందిన గోగులమూడి శ్రీమన్నారాయణకు ఆంధ్ర విశ్వ విద్యాలయం డాక్టరేట్ డిగ్రీని ప్రకటించింది. ఆంధ్ర విశ్వ విద్యాలయ న్యాయ కళాశాల పరిశోధక విద్యార్థి శ్రీమన్నారాయణ డాక్టరు బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాలకు చెందిన ఆచార్య విజయలక్ష్మి పర్యవేక్షణలో వాయు కాలుష్యం, భారతీయ చట్టాలు, ప్రభుత్వ విధానాలు అనే అంశానికి సంబంధించి చేసిన విశ్లేషణాత్మకమైన పరిశోధనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ధనుంజయరావు డాక్టరేట్ డిగ్రీని శ్రీమన్నారాయణకు అందజేశారు.

కొమ్మమూరు కాలువకు జలకళ

- కారంచేడు వద్ద ఆరు అడుగులు ఉన్న నీటి మట్టం
- ఎమ్మెల్యే ఏలూరి చొరవ, మంత్రి నిమ్మల ఆదేశాలతో నీటి విడుదల
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు


కారంచేడు వద్ద నీటితో కళకళలాడుతున్న కొమ్మమూరు కాలువ

కారంచేడు(పర్చూరు), సెప్టెంబరు 23 : కొమ్మమూరు కాలువలో నీరులేక వేల ఎకరాల్లో సాగుచేసుకున్న వరిని సాగు చేసుకున్న రైతులు కళ్లముందు పైర్లు ఎండిపోతుంటే వాటిని రక్షించుకునేందుకు అన్నదాతలు నానా అవస్థలు పడ్డారు. నీటిని విడుదల చేసి పైర్లను కాపాడాలంటూ అధికారులకు విన్నవించుకున్న పట్టించుకున్న దాఖలాలు లేవు. దీనికి తోడు కాలువకు పడిన గండ్ల మరమత్తులు, అధికారుల మధ్య సమన్వయ లోపంతో నీటి విడుదలకు జాప్యం వాటిల్లింది. దీంతో రైతులు తీవ్ర నిరాశకు గురి చేసింది. ఈ నేపథ్యంలో కాలువలో అరకొర ఉన్న నీటిని ఇంజన్‌ల ద్వారా నారు మళ్ళకు అందించేందుకు సాగు రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. నియోజకవర్గంలో దాదాపు 90వేల ఎకరాలకు వరకు కొమ్మమూరు కాలువపైనే రైతులు ఆదారపడి సాగుచేసుకుంటున్నారు. ఈ కాలువ ద్వారానే పంటపొలాలకు సాగునీరు. ఇప్పటికే వేల ఎరరాల్లో వరిని సాగుచేసుకున్న రైతులు పంటలు పైర్లు ఎండు ముఖం పట్టడంతో తీవ్ర ఆవేదనకు గురయ్యారు.


నీటి విడుదలతో వరి పైరుతో పచ్చగా ఉన్న పొలాలు

సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే ఏలూరి

సాగునీరు లేక వేల ఎకరాల్లో వరి, నారు మడులు ఎండిపోతున్న విషయాన్ని రైతుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పందించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యను నీటి పారుదల మంత్రి నిమ్మల రామారావు దృష్టికి తీసుకుపోయి నీటిని విడుదల చేయించేలా చర్యలు చేపట్టారు. దీంతో అధికారులు తక్షణ చర్యలు చేపట్టి కొమ్మమూరు కాలువకు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం కారంచేడు వద్ద కొమ్మమూరు కాలువలో నీటి మట్టం 6 అడుగులకు చేరడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

పైర్లకు జీవం పోసినట్లయింది



కళ్ల ముందు నారు మళ్లు ఎండిపోతుంటే తీవ్ర ఆవేదన చెందాం. కొమ్మమూరు కాలుకు నీటిని విడుదల చేయడంతో పైర్లకు ప్రాణం పోసినట్లయింది. సాగునీటి విడుదలకు ప్రభుత్వ యంత్రాంగం చేసిన కృషిని మరువలేం. గత వైసీపీ పాలనలో సాగునీరు అందక వేల ఎకరాల్లో చేతికి అందివచ్చిన పంటను కోల్పోయాం.

\- యార్లగడ్డ జోగయ్య, కారంచేడు

నీటి మట్టం తగ్గకుండా చూడాలి



అధికారులు ప్రత్యేక పర్యవేణలో నీటి మట్టం తగ్గకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎండిపోతున్న పైర్లు, రైతులు పడుతున్న అవస్థలపై ప్రభుత్వం చూపిన చొరవ మరువలేం. నీరులేక నారు మళ్లు ఎండిపోతుంటే తీవ్ర కలత చెందాం.

\- వై.పాపయ్య, కారంచేడు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ హరిబాబు

పార్కింగ్‌లో నిబంధనలు పాటించాలి

చీరాలటౌన్, సెప్టెంబరు 23 : చీరాల పట్టణంలో వాహనాల రద్దీ పెరిగినందువల్ల పార్కింగ్ విషయంలో వాహనదారులు నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ ఆంబోతుల హరిబాబు హెచ్చరించారు. ఇటీవల పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు పెద్ద ఎత్తున తలెత్తుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ హరిబాబు పట్టణంలో వాహనాల రద్దీను క్రమబద్ధీకరించారు. ప్రయాణాలు సాగిస్తున్న వాహనదారులకు పలు హెచ్చరికలు జారీ చేశారు. మద్యం సేవించి, రాష్ డ్రైవింగ్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఆయనవెంట సిబ్బంది ఉన్నారు.

పాఠశాలకు సాయం అభినందనీయం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 23 : పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలకు రోటరీ క్లబ్ తమ వంతు సాయం అందించడం అభినందనీయమని ఎంపీడీవో డీ గంగాధరరావు అన్నారు. సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో నంబూరివారిపాలెంలోని ప్రాథమిక పాఠశాలకు రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ యూ దేవపాలన మనవడు శరణ్‌పాల్ సౌజన్యంతో పాఠశాలకు ఐదు కుర్చీలు, రెండు జింక్ ర్యాకులు, రెండు కూలింగ్ వాటర్ క్యాన్లను బహూకరించారు. అనంతరం దేవపాలనను సభ్యులు, ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి చుండూరి మురళి సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, సందిరెడ్డి శ్రీనివాసరావు, హళహరి హరిప్రసాద్, సుబ్బారావు, గణపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

బల్లికురవ, సెప్టెంబరు 23 : ప్యాక్షన్ గ్రామమైన వేమవరంలో మొబైల్ పద్ధతిలో బైకులో పెట్టుకొని మద్యం అమ్మకాలు చేస్తున్న మూడావత్ పెద్ద సీతయ్య నాయక్‌ను అరెస్టు చేసి అతని వద్ద ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జీవీ చౌదరి తెలిపారు. వేమవరం ఎస్టీ కాలనీకి చెందిన పెద్ద సీతయ్య నాయక్ గత కొంత డకాలంగా బైకులో పెట్టుకొని గ్రామంలో మొబైల్ సర్వీసు ద్వారా మద్యం అమ్మకాలు చేస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ జీవీ చౌదరి సోమవారం మద్యం అమ్మకాలు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపారు.

పొలం పిలుస్తోంది సభలను వినియోగించుకోవాలి

పర్చూరు, సెప్టెంబరు 23 : రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించి నాణ్యమైన దిగుబడులను సాధించేలా చేసేందుకే పొలంబడి గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్. మోహనరావు సోమవారం ప్రకటనలో కోరారు. పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్‌లోని పర్చూరు, కారంచేడు, యద్దనపూడి, ఇంకొల్లు మండలాల పరిధిలో కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రతి మండలంలో వారంలో రెండు రోజులు పాటు పొలం బడి కార్యమం జరుగుతుందన్నారు.

ఇంకొల్లు : పావులూరు, కొణికి, సుబ్బారెడ్డిపాలెం, నక్కలపాలెం గ్రామాలలో ఈ 25వ తేదీన జరగనున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి వేణుగోపాల్ కోరారు.

పంగులూరు : మంగళ, బుధవారాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాలు జరుగుతాయని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి తెలిపారు. 24న రామకూరు, 25న బైటమంజులూరు, ముప్పవరంలో ఉంటాయన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

బల్లికురవ, సెప్టెంబరు 23 : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో మంగళవారం గ్రామ తెలుగు యువత, గ్రామ పెద్దల సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆశీస్సులు, శంకర్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. శిబిరానికి వచ్చే వారు తెల్లరేషన్ కార్డు, కుటుంబ సభ్యుల ఫోను నెంబర్‌ను తీసుకు రావాలని నిర్వాహకులు సూచించారు.

ప్రతిభ గుర్తింపునకే ఆటల పోటీలు

మేదరమెట్ల, సెప్టెంబరు 23 : పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించడం ద్వారా వారిలోని ప్రతిభను గుర్తించవచ్చని ఎంఈవో ఎల్ పున్నయ్య తెలిపారు. సోమవారం పమిడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కాజావలి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయని కల్యాణి, సురేష్, శ్రీను, రాజా, నాగార్జున, గ్రామ పెద్దలు జాగర్లమూడి జయకృష్ణ పాల్గొన్నారు.


పోస్టర్‌ను విడుదల చేస్తున్న జన విజ్ఞాన వేదిక నాయకులు, ఉపాధ్యాయులు

రేపు చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్

చినగంజాం, సెప్టెంబరు 23 : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన పాఠశాల స్థాయి చెకుముకి సైన్సు టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల హెచ్‌ఎం డి.రత్నకుమారి ఆధ్యక్షతన సోమవారం జరిగిన కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు, ఉపాధ్యాయులు చెకుముకి సైన్సు సంబరాలు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ పాఠశాలలోని 8,9,10 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు మీడియంలో చెకుముకి సైన్సు టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 25న పాఠశాల స్థాయిలో, అక్టోబరు 1న మండల స్థాయి, అక్టోబరు 27న జిల్లా స్థాయి, నవంబరు 9, 10 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జన విజ్ఞాన వేదిక కార్యకర్తలను సంప్రదించాలని రామారావు కోరారు. కార్యక్రమంలో వేదిక మండల అధ్యక్షుడు ఎస్.నరసింహారావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూ కల్తీ అపచారం


సమావేశంలో పాల్గొన్న కాపు, బలిజ నేతలు

చినగంజాం, సెప్టెంబరు 23 : శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జరిగిన అపచారం చాలా బాధాకరమని కాపు, బలిజ సంక్షేమ సేన జిల్లా అధ్యక్షుడు తరణి గోపాలకృష్ణ అన్నారు. సోపిరాల రైల్వే గేటు సెంటర్‌లో కాపు, బలిజ సంక్షేమ సేన జిల్లా ఉపాధ్యక్షుడు పర్వతరెడ్డి పార్థసారిధి అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందువుల మనోభావాలతో ఆటలాడుకునే ఎవరినైనా కఠినంగా శిక్షించేలా సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు విజ్ఞప్తి చేశారు. లడ్డూ ప్రసాదం కల్తీకి కారుకులైన వైసీపీ పాలకులను, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు చైర్మన్, మెంబర్లను విచారించి శిక్షలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కాపు, బలిజ సంక్షేమ సేన గౌరవ సలహాదారులు చెరుకూరి రాఘవయ్య, బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు శిఖరం కోటయ్య, చీరాల నియోజకవర్గ అధ్యక్షులు పోలుదాసు ఫణికుమార్, నాయకులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి : అర్చకుడు శ్రీనివాసశర్మ

కారంచేడు(పర్చూరు) : హిందూ మనో భావాలను దెబ్బతీసే విధంగా తిరుమల తిరుపతి స్వామివార్ల లడ్డూ ప్రసాదాల కల్తీకి సంబంధించిన దోషులను కఠినంగా శిక్షించాలని కారంచేడు శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకులు నండూరి శ్రీనివాస శర్మ డిమాండ్ చేశారు. దీనికి సంబంధించి సోమవారం ఆయన ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. లడ్డూ ప్రసాద కల్తీపై ప్రభుత్వం స్పందించిన తీరుపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ఇంకొల్లు : లడ్డూ ప్రసాదం కల్తీపై బాధ్యులను శిక్షించాలని ఇంకొల్లు హరిహర ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. పర్చూరు రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి భక్తులు, గ్రామస్థులు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో హనుమంతరావు, రావి సింగమ్మ, వెంకటరత్నం, వెంకటేశ్వరశాస్త్రి, బండ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, ధేనువకొండలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న రామకృష్ణ

- 100 రోజుల్లో గాడినపడ్డ రాష్ట్రం
- సీఎం చంద్రబాబుకే అది సాధ్యం
- ఎమ్మెల్యే కొండయ్య
- పలు గ్రామాల్లో ఇంది మంచి ప్రభుత్వం కార్యక్రమం

చీరాల, సెప్టెంబరు 23 : సీఎం చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమంకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారు. ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మున్సిపల్ పరిధిలోని 23వ వార్డు, చీరాల మండలం బుర్లవారిపాలెం, వేటపాలెం మండలం రామన్నపేటలలో సోమవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయా సందర్భాల్లో నిర్వహించిన సభల్లో ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలు నాశనం అయ్యాయన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం, మేధస్సుతో రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తున్నారన్నారు. అప్పుల ఊబిలోకి నెట్టేసిన రాష్ట్రాన్ని 100 రోజుల్లోనే గాడిన పెడుతూ, మరోపక్క పథకాలను అమలు చేయడం, ప్రతి నెలా 1వ తేదీ నాటికి పింఛన్‌లు, ఉద్యోగులకు జీతాలు ఇచ్చేలా చేయడం ఒక్క సీఎం చంద్రబాబుకే సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై స్థానికులు ఎమ్మెల్యేకు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి, పలువురు అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : సంక్షేమ పథకాల అమలు కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తామని టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని ధేనువకొండ గ్రామంలో టీడీపీ వంద రోజుల పాలనలో అమలు చేసిన పథకాలపై ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. రానున్న రోజుల్లో అమలు చేసే పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తుపాకుల పద్మావతి, వీఆర్‌వో లక్ష్మయ్య పంచాయతీ కార్యదర్శి ఏ. నాగేశ్వరరావు, గ్రామ టీడీపీ నాయకులు అన్నబత్తిన అజయ్, బోడపాటి హరిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలోని మణికేశ్వరంలో ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐటీడీపీ అధ్యక్షుడు కరిముల్లా, టీడీపీ నాయకులు షేక్ బడావలి, ఈసువలి, అంజయ్య, మౌలాలి, మందా మధ్యూస్, దావిదు, కరిముల్లా, కాలేషా, అజ్మతుల్లా, మందా రవి, రాంబాబు, రూబేను, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ : టీడీపీ కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో ప్రజలకు ఎన్నో మెరుగైన సంక్షేమ పథకాలను అందించిందని సర్పంచ్ పందిరి అంజిబాబు అన్నారు. సోమవారం బల్లికురవలో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ప్రజలకు అందించిన కరపత్రాలను అందజేశారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించి పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో కుమారి, పంచాయతీ కార్యదర్శి అనిల్, వీఆర్వో మీనా, శానిటేషన్ అధికారి యలగాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చినగంజాం : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కడవకుదురు, మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అడవీదిపాలెం గ్రామాల్లో సభలు నిర్వహించారు. కడవకుదురు గ్రామ సచివాలయ ఆవరణలో గ్రామ సర్పంచ్ గొల్లమూరి శివకుమారి అధ్యక్షతన జరిగిన సభలో వీరయ్య మాట్లాడారు. కడవకుదురులో రూ.35లక్షలతో నిర్మించే సిమెంట్ రోడ్లకు, అడవీదిపాలెంలో రూ.10.5లక్షలతో నిర్మించే సిమెంట్ రోడ్లుకు భూమి పూజ చేసినట్లు పంచాయతీరాజ్ ఏఈ డి.దాసు తెలిపారు. గ్రామాల్లో నాయకులు, అధికారులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను గురించి వివరించారు. సోపిరాల గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకులు టీ.జయరావు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాల ఏవో బి.కల్పన, ఎంఈవో-2 ఎస్.కోటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి ఎం.వెంకటరమణ, కూటమి నాయకులు నక్కల వీరరాఘవులు, చల్లా వెంకటరావు, తోట అశోక్‌చక్రవర్తి, లక్ష్మణరావు, డి.బాలకృష్ణ, కే.ఉదయభాస్కరరావు, సచివాలయ ఉద్యోగులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.


సభలో పాల్గొన్న సర్పంచ్, అధికారులు


కడవకుదురులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న నేతలు


పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో ప్రేమలత

మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభం

మార్టూరు, సెప్టెంబరు 23 : మండల స్థాయి అండర్ 14, అండర్ 17 బాల బాలికల ఆటల పోటీలు సోమవారం మార్టూరు జడ్పీ హైస్కూల్‌లో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా చీరాల ఉప విద్యాశాఖాధికారి ఎ.శ్రీనివాసరావు హాజరుగా కాగా, ఎంఈవో ప్రేమలత రిబ్బను కత్తిరించి ఆటలపోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. సాయంత్రం వరకు పోటీలు ఉత్సాహంగా సాగాయి. మంగళవారం కూడా పోటీలను కొనసాగుతాయని వ్యాయామ ఉపాధ్యాయులు కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ స్కూళ్ల నుంచి వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయిని రూత్ మెర్సీబాబు పర్యవేక్షణలో ఉపాధ్యాయులు భోజన సౌకర్యాలను కల్పించారు.



శారదను సన్మానిస్తున్న రోటరీ ప్రతినిధులు

ఉపాధ్యాయురాలికి సత్కారం

యద్దనపూడి, (మార్టూరు) సెప్టెంబరు 23 : పిల్లలకు ఉన్నత విలువలతో కూడిన విద్యను బోధించిన టీచర్ శారదను రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్ వారు నేషన్ బిల్డర్ అవార్డుతో సత్కరించారు. ఆదివారం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో యద్దనపూడి మండలం సూరవరపుపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయిని శారదను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శారదను మండల విద్యాధికారులు పుల్లెల సుబ్రమణ్యేశ్వరరావు, చిలుకూరి గోపి అభినందించారు.

పథకాలను ప్రజలకు అందించాలి

ఇంకొల్లు, సెప్టెంబరు 23 : పథకాలు సక్రమంగా అందేలా అధికారులు పనిచేయాలని టీడీపీ నాయకుడు హనుమంతరావు అన్నారు. భీమవరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలింతలకు బాలసంజీవని కిట్లు అందేసారు. కార్యక్రమంలో సీడీపీ వో ఝాన్సీ, సూపర్‌వైజర్ వాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అంగన్‌వాడీ కార్యకర్తల వినతి


వినతిపత్రం అందజేస్తున్న అనంతలక్ష్మి తదితరులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 23 : అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గడ్డం అనంతలక్ష్మి, కార్యదర్శి కొల్లి లక్ష్మి నరసమ్మ కోరారు. సోమవారం గుంటూరులోని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డిని యూనియన్ నాయకలు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు సామ్రాజ్యం, నాగజ్యోతి, మరియాంబి, బండారు కల్యాణి పాల్గొన్నారు.

చీరాలటౌన్ : ఆశా వర్కర్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పలువురు ఆశా వర్కర్‌లు కోరారు. సోమవారం జిల్లా వైద్యాధికారి విజయమ్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఏఎన్‌ఎంల నుంచి కూడా పని భారం అధికంగా ఉన్నట్లు వివరించారు. అధికారులు సమస్యలపై పారదర్శకంగా ఆలోచించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ధనలక్ష్మి, ప్రధానకార్యదర్శి వెంకటేశ్వరమ్మ, కోశాధికారి వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం అభినందనీయం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 23 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో గ్రామస్థులు భాగస్వామ్యం కావడం అభినందనీయమని ఎంఈవో 2-బూదాటి సుధాకరరావు అన్నారు. సోమవారం మండలంలోని గోపాలపురంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన యర్రా కోటిస్వాములు, తన కుమారుడు గోపాలకృష్ణ నోట్ పుస్తకాలతో పాటు, మినరల్ వాటర్‌కు సంబంధించిన పరికరాలను పాఠశాలకు బహూకరించారు. ఎంఈవో2 సుధాకరరావు మాట్లాడుతూ దాతల సాయాన్ని వినియోగించుకొని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని రాణించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బీవీ రత్నం, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ మల్లవరపు ఆదిలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

రిటైర్డ్ లెక్చరర్ గోరంట్ల లక్ష్మీనారాయణ మృతి



అద్దంకిటౌన్, సెప్టెంబరు 23 : రిటైర్డ్ లెక్చరర్, రోటరీ మాజీ అధ్యక్షుడు గోరంట్ల లక్ష్మీనారాయణ ఆదివారం రాత్రి మృతి చెందారు. సోమవారం లక్ష్మీనారాయణ మృతదేహాన్ని అద్దంకిలోని రోటరీ క్లబ్, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సాహితీ సంస్థల సభ్యులు సందర్శించి నివాళులర్పించారు. పలు అభివృద్ధి పనులకు దాతగా ముందుండే లక్ష్మీనారాయణ సేవలను సభ్యులు గుర్తు చేసుకున్నారు.

దుకాణదారులు లైసెన్స్‌లు తీసుకోవాలి

ఇంకొల్లు, సెప్టెంబరు 23 : కిరాణా దుకాణ యజమానులు లైసెన్సులు పొంది, నాణ్యమైన సరుకులను మాత్రమే విక్రయించాలని బాపట్ల జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ ఆదేశించారు. సోమవారం ఆయన పలు దుకాణాలలో తనిఖీ నిర్వహించారు. లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తున్న వాటిని గుర్తించారు. వెంటనే అనుమతులు తీసుకోవాలని సూచించారు.



లోకమాతా వారాహీ

ఉగ్రరూపానికి ప్రతీక అయిన వారాహీదేవిని పూజించవద్దనే దుష్ప్రచారాన్ని పారదోలి, లోకదేవి వారాహీదేవి అని తెలియజేసేందుకే ఈ వారాహీ రథయాత్ర చేపట్టినట్లు ఆదిపరాశక్తి టెంపుల్స్ ట్రస్టుకు చెందిన వారాహీ మహారుద్రస్వామి తెలిపారు. తిరుపతి నుంచి బయలుదేరిన వారాహీ రథయాత్ర సోమవారం ఉదయం 10 గంటలకు నెల్లూరుకు చేరుకుంది. అయ్యప్పస్వామి ఆలయం వద్ద రథయాత్రకు భక్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం రాజరాజేశ్వరి ఆలయం, శబరి శ్రీరామక్షేత్రం, వీఆర్‌సీ సెంటర్, గాంధీ బొమ్మమీదుగా వీఆర్ హైస్కూలు మైదానానికి చేరుకుంది. అక్కడ వారాహీ మహాహోమం జరిగింది. ఈ సందర్భంగా మహారుద్ర స్వామి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే సంకల్పంతో రథయాత్రలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తిరుపతి, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, కాకినాడ, విశాఖ, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో రథయాత్రలు, మహాయజ్ఞాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, వ్యాపారవేత్తలు, భక్తులు పాల్గొన్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం)




రథం ముందు మహిళల కోలాటం

కలెక్టరేట్‌లో పనిచేసేందుకు ఉద్యోగుల్లో వణుకు | కోర్టు కేసులు, భూ సమస్యలే ప్రధాన కారణం | జిల్లా పరిపాలనా కేంద్రంలో 22 పోస్టుల ఖాళీ | మండలాల నుంచి తీసుకొచ్చి నెట్టుకొస్తున్న వైనం | తాజాగా బదిలీ చేసినా ఎమ్మెల్యేలతో ఫోన్లు

మాకొద్దు బాబోయ్!

'కలెక్టరేట్‌లో పోస్టా.. అమ్మ బాబోయ్ మాకొద్దు. జిల్లా కేంద్రానికి సుదూరంగా ఉన్న సీతారామపురం, కొండాపురం వంటి ప్రాంతాల్లోనైనా పని చేస్తాం. కలెక్టరేట్‌లో అయితే వద్దే వద్దు.'

రెవెన్యూ ఉద్యోగుల తీరిది. ఎవరూ పని చేసేందుకు రాకపోవడంతో కొన్నేళ్లుగా కలెక్టరేట్‌లో చాలా సీట్లు ఖాళీగా ఉంటున్నాయి. తాజా బదిలీల్లో కూడా పలువురు ఉద్యోగులకు కలెక్టరేట్‌లో పోస్టింగ్స్ ఇవ్వగా చాలామంది తప్పించుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. ఎమ్మెల్యేల ద్వారా ఉన్నతాధికారులకు ఫోన్లు చేయించుకుంటూ వేర్వేరు ప్రాంతాలకు వెళ్లేందుకు ముమ్మరంగా యత్నిస్తున్నారు. ఈ వ్యవహారం ఇప్పుడు ఉన్నతాధికారులకు కూడా తలనొప్పిగా మారింది.



నెల్లూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పాలన కేంద్రమైన కలెక్టరేట్‌లో పని చేయడమంటే ఒకప్పుడు రెవెన్యూ ఉద్యోగులు గౌరవంగా భావించేవారు. ఎందుకంటే ఇక్కడి నుంచే అన్ని మండలాల పరిపాలనను పర్యవేక్షించేవారు. ప్రతీ ఫైలూ కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల చేతుల మీదుగా నడుస్తుంది కాబట్టి. అయితే గత ప్రభుత్వంలో పాలన పూర్తిగా గాడితప్పింది. ఉన్నతాధికారుల ఆదేశాల కన్నా రాజకీయ నాయకుల ఆదేశాలే శిరోధార్యం అన్నట్లుగా పరిస్థితులు మారిపోయాయి. దీంతో పాలనలో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ప్రధానంగా జిల్లాలో భూ సమస్యలు పెరిగిపోయి, కోర్టు కేసులు కూడా అధికమయ్యాయి. ఈ ప్రభావం మండల స్థాయిలో పనిచేసే ఉద్యోగుల కన్నా కూడా కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగులపై ఎక్కువగా పడుతోంది. ఒక్క భూ సమస్యలే కాకుండా ఇతరత్రా వ్యవహారాలకు సంబంధించి కూడా సమస్యలు ఎక్కువయ్యాయి. అదే సమయంలో రాజకీయ ఒత్తిళ్లు కూడా అధికమవడంతో కలెక్టరేట్‌లో ఉద్యోగం అంటేనే ఉరుకులు, పరుగులు అన్నట్లుగా మారిపోయింది. 'సమయానికి కార్యాలయానికి రావాల్సి ఉంటుంది. ఎప్పటికి తిరిగి వెళతామో తెలియదు. అదే మండలాల్లో అయితే కొంత ఫ్రీడం ఉంటుంది. పని విషయంలో కూడా మరీ ఒత్తిడి ఉండదు' అంటూ ఓ అధికారి వ్యాఖ్యానించడం గమనార్హం.

● డ్రాఫ్టింగ్ సమస్య

కలెక్టరేట్‌లోని సెక్షన్లలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్ కేడర్ ఉద్యోగులకు డ్రాఫ్టింగ్ స్కిల్స్ చాలా అవసరం. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తరఫున ప్రతి ఫైల్‌ను వీరే డ్రాఫ్ట్ చేయాల్సి ఉంటుంది. అందుకు సబ్జెక్ట్‌పై కూడా అవగాహన ఉండాలి. అదే సమయంలో ప్రస్తుతమున్న పరిస్థితుల్లో ప్రధానమైన కోర్టు కేసులకు సంబంధించి వేగంగా కౌంటర్‌లు తయారు చేయాల్సి వస్తోంది. మండలాల నుంచి ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుని ఆ సమాచారాన్ని కలెక్టర్, జేసీలకు అందించాల్సి ఉంటుంది. అయితే చాలా మందికి డ్రాఫ్టింగ్ సమస్య కనిపిస్తోంది. కోర్టు కేసులకు కౌంటర్ తయారు చేయడం కూడా చేతకావడం లేదు. మండల స్థాయిలోని ఉద్యోగులు సరిగ్గా కౌంటర్ వేయలేకపోతుండడం మూలంగా ఉన్నతాధికారులపై కంటెమ్ప్ట్‌లు వస్తున్నాయి. వాటికి కౌంటర్‌లు తయారు చేయడం కలెక్టరేట్ సిబ్బందికి కష్టంగా అనిపిస్తోంది. అలానే ల్యాండ్ మేటర్స్‌కు సంబంధించి ఫైళ్లు నడపాలంటే చట్టాలపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలి. ఇది కూడా ఒక సమస్యగా కనిపిస్తున్నట్లు చెప్పుకుంటున్నారు.

● పోస్టింగ్ అక్కడ.. విధులు ఇక్కడ

కలెక్టరేట్‌లో ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగుల్లో చాలా మంది ఒరిజినల్ పోస్టింగ్‌లు అక్కడ కాదు. ఎక్కడో మండలాల్లో వీరు జీతాలు తీసుకుంటుంటారు. కానీ విధులు మాత్రం కలెక్టరేట్‌లో నిర్వహిస్తుంటారు. ఒరిజినల్‌గా కలెక్టరేట్‌లో విధులు నిర్వహించాల్సిన ఉద్యోగులు వేర్వేరు మండలాల్లో పని చేస్తుంటారు. గడిచిన కొన్నేళ్లుగా ఇదే తంతు నడుస్తోంది. ప్రస్తుతం వివిధ సెక్షన్లలో 22 సీట్ల వరకూ ఖాళీగా ఉన్నట్లు సమాచారం. ఈ సీట్లలో వివిధ మండలాల్లో పనిచేయాల్సిన వారిని తీసుకొచ్చి పాలన నెట్టుకొస్తున్నారు. తాజా బదిలీల్లో కూడా చాలా వరకూ మండలాలు, డివిజనల్ కార్యాలయాలకు ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు తీసుకొచ్చారు. కానీ కలెక్టరేట్‌లో పని చేస్తామని మాత్రం ఆసక్తి చూపడం లేదు. దీంతో ఉన్నతాధికారులే కొంత మందిని ఎంపిక చేసి కలెక్టరేట్‌లో పోస్టింగ్ వేశారు. కానీ వీరిలో కూడా చాలా మంది ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఎమ్మెల్యేల ద్వారా ఫోన్లు చేయిస్తూ ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నారు.

లడ్డూ కల్తీపై సీబీఐతో విచారించాలి

● తిరుమల పవిత్రతను దెబ్బతీసిన వారిని శిక్షించాలి

● కలెక్టరేట్ ఎదుట స్వామీజీల ఆందోళన

నెల్లూరు (హరనాథపురం) : శ్రీవారి లడ్డూలో జంతువుల అవశేషాల కలిపిన అంశమై సీబీఐ చేత విచారణ జరిపించాలని కోరుతూ జిల్లాకు చెందిన పలువురు స్వామీజీలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామయణం మహేష్ స్వామి, దయానంద స్వామి, రామానందగిరి స్వామి, శ్రీ శ్యామానందస్వామి, శ్రీ రాజరాజేశ్వరి రంగనాథ భక్త మండలి సభ్యులు మాట్లాడారు. కాసులకు కక్కుర్తి పడో, హిందువుల మనోభావాలు దెబ్బతీయాలనో కుట్రపూరితంగా లడ్డూలో జంతువుల అవశేషాలు కలిగిన కొవ్వును కలపడం క్షమించరాని నేరమని అన్నారు. లడ్డూను అపవిత్రం చేయడమేగాక ఆ లడ్డూలను అయోధ్య బాల రాముడికి పంపించి మరింత అపచారానికి ఒడిగట్టారని మండిపడ్డారు. ఆ నీచులను శిక్షించేందుకు సీబీఐ బృందం ద్వారా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ తిరుమలలో నెయ్యి కల్తీని సమర్థించేలా మాట్లాడటం ఆయన పరమత విధానాన్ని బయట పెడుతుందన్నారు. తిరుమల ఆలయాన్ని శుద్ధి చేస్తే గాయపడిన హిందువుల మనసులు, శ్రీవారి భక్తుల హృదయాలు శాంతించవన్నారు. ప్రభుత్వాలు రాజకీయ ఒత్తిడితో ఇతర మతస్తులను పాలక మండలి సభ్యులుగా, ఉద్యోగులుగా నియమించడం కూడా ఆలయ పవిత్రను దెబ్బతీస్తుందని ఆరోపించారు. బాధ్యులపై వెంటనే కేసులు నమోదు చేయించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో బీజేపీ నేతలు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, మిడతల రమేష్, కందికట్టు రాజేశ్వరమ్మ, కరణం సుభాషిణి, శ్రీరాజరాజేశ్వరి రంగనాథ భక్తమండలి సభ్యుడు మెంటా రామమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం ఇస్తున్న స్వామీజీలు, బీజేపీ నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వీఆర్‌ఏల దుర్మరణం

కలిగిరి, సెప్టెంబరు 23: లక్ష్మీపురం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జలదంకి మండలం కొదండరామాపురం వీఆర్‌ఏలు వంకదారి మాల్యాద్రి(49), వడ్డే శ్రీనివాసులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వివరాల మేరకు.. సిద్దనకొండూరు నుంచి వీరు తమ స్వగ్రామానికి మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా చినక్రాకకు చెందిన ట్రాక్టర్ ఇసుకలోడ్‌తో సిద్దనకొండూరు వైపు వస్తుండగా లక్ష్మీపురం సమీపంలో ఢీకొన్నది. ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఉమాశంకర్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.



మాల్యాద్రి | శ్రీనివాసులు

నెల్లూరు సబ్‌రిజిస్ట్రారా.. మేం రాం!

● బదిలీల్లో ముందుకురాని అధికారులు

● ఏసీబీ దాడులు.. సస్పెన్షన్లే కారణం



నెల్లూరు (హరనాథపురం) : నెల్లూరు సబ్ రిజిస్ట్రార్ పోస్టు అంటేనే అధికారుల్లో వణుకు పుడుతోంది. ఆదివారం రాత్రి జరిగిన స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ బదిలీల్లో ఏ సబ్ రిజిస్ట్రార్ కూడా ఈ సీటును కోరుకోలేదు. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే కొందరు సబ్ రిజిస్ట్రార్లు అక్రమ రిజిస్ట్రేషన్ల ద్వారా ఏసీబీ అధికారులకు పట్టుబడి సస్పెన్షన్లకు గురవుతుండటమే ఇందుకు కారణం. అంతేగాక మార్కెట్ వ్యాల్యూ చూసే సీనియర్ సహాయకులపై వేటు పడుతోంది. పలు ఆరోపణలు ఈ కార్యాలయంపై ఉండటంతో ఎవరూ సాహసించి ఈ సీటు కోరుకోవడం లేదు. దీంతో విధిలేని స్థితిలో ఈ సబ్ రిజిస్ట్రార్ సీటుకు సీనియర్ సహాయకుడు, మరోచోట పనిచేసే సబ్ రిజిస్ట్రార్‌ను, డిప్యూటేషన్‌పై సబ్ రిజిస్ట్రార్‌ను నియమించాల్సి వస్తోంది. కాగా, ఈ కార్యాలయంలో పనిచేసే జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కూడా ఇక్కడ పనిచేయలేక గుంటూరు జిల్లాకు బదిలీ చేయించుకుని వెళ్లారు. జూనియర్ సహాయకులు కూడా మరోచోటకు బదిలీ చేయించుకుని వెళ్లడం గమనార్హం.

● 11 మంది కొత్త సబ్ రిజిస్ట్రార్లు

బదిలీల కౌన్సెలింగ్ ద్వారా జిల్లాకు 11 మంది కొత్త సబ్ రిజిస్ట్రార్లు వచ్చారని స్టాంపులు- రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ కిరణ్ కుమార్ తెలిపారు. అల్లూరుకు రవిజోసఫ్, ముత్తుకూరుకు ప్రసన్నలక్ష్మి, ఇందుకూరుపేటకు భానుమతి, రాపూరుకు అమర్ (పదోన్నతి), బుచ్చిరెడ్డిపాళెంకు కోటేశ్వరమ్మ, కావలికి సుమలత, వింజమూరుకు కోటేశ్వరరావు, స్టోన్‌హౌస్‌పేటకు రాధాకృష్ణమూర్తి, ఆత్మకూరుకు శ్రీనివాస్, బుజబుజనెల్లూరుకు ప్రవీణ, కందుకూరుకు రామకోటయ్య నియమితులైనట్లు తెలిపారు. అదేవిధంగా 20 మంది సీనియర్ అసిస్టెంట్లకు కూడా బదిలీలు జరిగాయని తెలిపారు. బదిలీపై వచ్చిన వారు బుధవారం బాధ్యతలు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

దేవదాయ శాఖ సహాయ కమిషనర్‌గా జనార్దన్‌రెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 23 : జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్‌గా కోవూరు జనార్దన్‌రెడ్డి నియమితులయ్యారు. ఒంగోలు ఏసీగా పని చేస్తున్న ఈయన బదిలీపై నెల్లూరుకు వచ్చారు. అలాగే రాజరాజేశ్వరి ఆలయ ఈవోగా జనార్దన్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చారు. ప్రస్తుత ఏసీ కె. శ్రీనివాసరావును మూలపేట వేణుగోపాల స్వామి, ఇరుకళల పరమేశ్వరి ఆలయాల ఈవోగా నియమించారు. పెంచలకోన ఈవో, డిప్యూటీ కమిషనర్‌గా పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి నియమితులయ్యారు. అక్కడున్న సాగర్ బాబును వలేటివారిపాళెం మండలం మాలకొండ ఆలయానికి బదిలీ చేశారు. వేణుగోపాలస్వామి ఆలయ ఈవో దాసరి చంద్రశేఖర రావును ప్రకాశం జిల్లాకు, రాజరాజేశ్వరి ఆలయ సహాయ కమిషనర్ బీవీ. వెంకటసుబ్బయ్యలను అన్నమయ్య జిల్లాకు బదిలీ చేశారు. వీరితోపాటు వివిధ ఆలయాల్లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లనూ బదిలీ చేశారు.



పెంచలకోన ఆలయ ఈవోగా నియమితులైన పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి



జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి

మైనింగ్ శాఖ డీడీగా చంద్రశేఖర్

● విజయవాడకు శ్రీనివాస కుమార్ బదిలీ

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : జిల్లా మైనింగ్ శాఖ డీడీగా ఎస్.చంద్రశేఖర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడున్న శ్రీనివాస కుమార్‌ను విజయవాడ డీడీగా బదిలీ చేసింది. కాగా, గూడురు సబ్ డివిజన్ ఏడీగా ఉన్న రంగకుమార్‌ను అన్నమయ్య జిల్లా మదనపల్లికి బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో పార్వతీపురం నుంచి కే.శ్రీనివాస్ నియమితులయ్యారు. అదే విధంగా నెల్లూరు మైనింగ్‌శాఖ ఆర్‌ఐగా ఉన్న దేవిసింగ్‌ను అన్నమయ్య జిల్లా రాయచోటికి బదిలీ చేశారు. ఈయన స్థానంలో ఇబ్రహీంపట్నం నుంచి సీహెచ్ స్వాతిని నియమించారు. గూడూరు ఏజీ నరేష్‌ను తిరుపతికి బదిలీ చేయగా, అనకాపల్లి నుంచి టీ.సుబ్బరాయుడును ఆయన స్థానంలో నియమించారు. గూడురు ఆర్‌ఐగా ఉన్న గంగాధర్‌ను ఇబ్రహీంపట్నంకు బదిలీ చేశారు. ఈయన స్థానంలో ఇబ్రహీంపట్నం నుంచి ఎం.బాలమురళిని నియమించారు.

జిల్లా పరిషత్‌లో భారీగా బదిలీలు

● 20 మంది ఎంపీడీవోలకు స్థానచలనం

నెల్లూరు (జడ్పీ): జిల్లా పరిషత్‌లో ఎంపీడీవోల నుంచి కార్యాలయ సబార్డినేట్స్ వరకు 272 మందిని బదిలీ చేస్తూ కలెక్టరు ఆనంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో 20 మంది ఎంపీడీవోలు, 27 మంది ఏవోలు, 44 మంది సీనియర్ అసిస్టెంట్లు, 71 మంది జూనియర్ అసిస్టెంట్లు, 22 మంది టైపిస్టులు, 26 మంది గ్రంథాలయ అసిస్టెంట్లు, 62 మంది కార్యాలయ సబార్డినేట్స్ ఉన్నారు.

బదిలీ అయిన ఎమ్పీడీవోలు వీరే!

ఎంపీడీవో	ప్రస్తుతం	బదిలీ
ఎం.శ్రీహరి	కోవూరు	బుచ్చిరెడ్డిపాళెం
కె. ప్రత్యూష	ముత్తుకూరు	కలిగిరి
ఎం.బ్రహ్మయ్య	కొండాపురం	జలదంకి
ఎ.మధుసూదన రావు	అనంతసాగరం	గూడూరు
జి.వెంకటేశ్వర్లు	మనుబోలు	దగదర్తి
ఎం.భవాని	కోట	రాపూరు
ఎ. ప్రమీలా రాణి	సూళ్లూరుపేట	పెళ్లకూరు
ఎం. భాస్కర్	సెలవుల్లో..	ఎస్‌ఆర్ పురం
కె. వెంకటేశ్వర రావు	గూడూరు	టీపీ గూడూరు
కె. సురేష్‌బాబు	పెళ్లకూరు	నాయుడు పేట
పి. ప్రసన్నకుమారి	డక్కిలి	ఏస్‌పేట
కె. గోవర్ధన్	కలువాయి	డీవీ సత్రం
వీ. రజనీ కాంత్	ఓజిలి	అల్లూరు
డివి నరసింహారావు	బుచ్చిరెడ్డిపాళెం	పొదలకూరు
ఎవీ సుబ్బారావు	బోగోలు	కొడవలూరు
పి. సుబ్రహ్మణ్యం	కొడవలూరు	బోగోలు
కె. షాలేట్	చిట్టమూరు	సంగం
పి. నాగమణి	మర్రిపాడు	ముత్తుకూరు
టి నాగేష్‌కుమారి	పొదలకూరు	విడవలూరు
వివి. సూర్యసాయి	చిల్లకూరు	వాకాడు

గంజాయిని సమూలంగా నిర్మూలించండి!

● మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టండి

● నేర సమీక్షలో గుంటూరు రేంజ్ ఐజీ త్రిపాఠి



నేర సమీక్షలో పోలీస్ అధికారులకు సూచనలు చేస్తున్న ఐజీ త్రిపాఠి, చిత్రంలో ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 23 : జిల్లాలో గంజాయిని సమూలంగా నిర్మూలించాలని, మూలాలతో సహా ఛేదించడం ద్వారానే రాబోయే భావితరాల పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సమాజంలో పరిస్థితులను బట్టి పోలీసులు విధులు నిర్వహించాలని సూచించారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, అన్ని కోణాలలో ఛేదించి తప్పిపోయిన తల్లిదండ్రులకు అప్పగించాలని ఆదేశించారు. మహిళలు, బాలికలు, వృద్ధుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ట్రాఫిక్‌పై దృష్టి సారించి, కొన్ని ప్రాంతాలను దత్తత తీసుకొని ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలని, హైవేపై బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ప్రమాదాలు నివారించాలని ఆదేశించారు. రౌడీ షీటర్లకు తప్పకుండా కౌన్సెలింగ్ నిర్వహించాడంతోపాటు వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని, కేసులు ఉన్న వ్యక్తులను బైండోవర్ చేయాలన్నారు. జిల్లాలో కుల, మత విద్వేషాలు లేకుండా పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించి ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలన్నారు. లోక్ అదాలత్ కేసుల పరిష్కారంలో జిల్లా ప్రథమస్థానంలో నిలవడం, ముత్తుకూరు పరిధిలో జరిగిన దోపిడీ కేసును గంటల వ్యవధిలో ఛేదించడం అభినందనీయమన్నారు. ఎస్పీ కె కృష్ణకాంత్ మాట్లాడుతూ రాత్రింబవళ్లు గస్తీలను పటిష్ఠంగా అమలుపరచాలని, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపాలన్నారు. పల్లె నిద్ర, విలేజ్ విజిట్ తప్పక చేయాలని, సైబర్ నేరాలు, ఇతర చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో అదనపు ఎస్పీలు సీహెచ్ సౌజన్య, శ్రీనివాసరావు, లీగల్ అడ్వయిజర్ శ్రీనివారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

● వారంలో 2 రోజులు.. 4 గ్రామాల్లో నిర్వహణ

నెల్లూరు (వ్యవసాయం) : పంటల సాగులో రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం పొలం పిలుస్తోంది పేరుతో కొత్త కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. గత ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించడం, పొలంబడి కార్యక్రమానికి పూర్తిస్థాయిలో నిధులు ఇవ్వకపోవడంతో అధికారులు మమ అనిపించారన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నుంచి నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పొలంబాట పట్టనున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ, దానిఅనుబంధ మత్స్య, ఉద్యాన, పశుసంవర్థక, సేంద్రియ, మార్కెటింగ్‌శాఖల అధికారులు సమన్వయంతో రైతుల సమస్యలు పరిష్కరించనున్నారు. ప్రతిశాఖ అధికారి రైతు వద్దకు వెళ్లి పంట పరిశీలించి లోపాలను గుర్తించి సేకరించిన వివరాలు ఉన్నతాధికారులకు నివేదించాలి. వీటిని శాస్త్రవేత్తల బృందం పరిశీలించి రైతులకు అవసరమైన కార్యక్రమాలను చేపట్టాలి. ఈ కార్యక్రమంలో ప్రతి మంగళ, బుధవారాల్లో 4 గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.

● ఖర్చులు తగ్గించడమే లక్ష్యం

వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గించి ఆదాయం పెంచడమే ఈ కార్యక్రమ ముఖ్యఉద్దేశం. బిందు సేద్యం, భూసార పరీక్ష ఫలితాల కార్డుల పంపిణీ, కౌలు రైతుల గుర్తింపు, కార్డుల మంజూరు, రైతు సంఘాల ఏర్పాటు, రుణాల మంజూరు, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించచం, ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి పిలుపునిచ్చారు.

26న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం

నెల్లూరు (హరనాథపురం) : ఈనెల 26న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లాస్థాయి సమావేశం జరుగుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ.మహీధర్, కార్యదర్శి ఎస్. విజయకుమార్ ఒక సంయుక్త ప్రకనటలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నగరంలోని వెటర్నరీ పాలిక్లినిక్‌లో జరిగే ఈ సమావేశంలో ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు పాల్గొంటారని తెలిపారు.

'విజయ'లో 4 నామినేషన్ల దాఖలు

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : విజయ డెయిరీలో మూడు డైరెక్టర్ పదవులకు సోమవారం 4 నామినేషన్లు దాఖలు అయ్యాయి. వాసలి పాల సొసైటీ నుంచి గంగా శ్రీనివాసులు, తిరుమలపూడి నుంచి బాబు నాయుడు, నారికేళ్లపల్లి నుంచి చంద్రశేఖర్‌రెడ్డి, విడవలూరు మండలం అన్నారెడ్డిపాళెం నుంచి శ్రీహరి నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం సాయంత్రం వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఈలోగా ఒకరు ఉపసంహరించుకొంటే మిగతా ముగ్గురు సభ్యులు ఏకగ్రీవం అవుతారు. లేదా 28న ఎన్నికలు జరపనున్నారు.

వేంకటేశ్వరస్వామి చిత్రపటానికి క్షీరాభిషేకం


వేంకటేశ్వరస్వామి పటానికి క్షీరాభిషేకం చేస్తున్న హిందూధర్మ ప్రచార మహాసభ కార్యకర్తలు

సంగం, సెప్టెంబరు 23: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో హిందూధర్మ ప్రచార మహాసభ ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి పటానికి సోమవారం సాయంత్రం క్షీరాభిషేకం చేశారు. కలియుగ దైవ ప్రసాదం లడ్డూలో వినియోగించే నెయ్యిని కల్తీ చేయడంతో జరిగిన అపచారాన్ని ఖండిస్తూ వెంకటేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో హిందూధర్మ ప్రచార మహాసభ కార్యకర్తలు మాఘం గిరి బాబు, ప్రభాకర్, సురేంద్ర, టీడీపీ నాయకులు కర్నాటి చరణ్‌రెడ్డి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు బ్రాహ్మణ మహా సంఘం సభ్యుల మౌన ప్రదర్శన

కావలి టౌన్, సెప్టెంబరు 23: తిరుమల శ్రీవారి పవిత్ర లడ్డూకు జరిగిన అపవిత్రత అపరాధానికి నిరసనగా మంగళవారం పట్టణంలో మౌన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ మహా సంఘం అధ్యక్షుడు పీవీస్ ప్రసాద్ తెలిపారు. సోమవారం పాతూరులోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల ప్రాంగణంలో సంఘం సభ్యులతో కలిసి మాట్లాడారు. సాయంత్రం 4గంటలకు ఒంగోల్ బస్టాండ్ వద్ద నున్న పట్టాభిరామస్వామి ఆలయం నుంచి ఈ ప్రదర్శనగా ఆర్డీవో కార్యాలయం వరకు చేపడతామన్నారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తామన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక పోటీలు

కావలిటౌన్, సెప్టెంబరు 23: డీఆర్ విశ్వోదయా బాలల దినోత్సవంలో భాగంగా సోమవారం జేబీ కళాశాలలోని ఎంఎ హాల్‌లో డాక్టర్ రామ్‌సెంటర్ ఆధ్వర్యంలో సాంస్కృతిక పోటీలు ప్రారంభమయ్యాయి. సెంటర్ ఛైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన వేడుకలో టీడీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు శ్రీదేవి చౌదరి, రాజ్‌కుమార్ చౌదరి, విశ్వోదయా రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, రామ్ సెంటర్ డైరెక్టర్ తాతిరెడ్డి, ఆర్గనైజర్ జ్యోతిశ్రీ, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ మాల్యాద్రి, పీడీ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

కందుకూరు : యాదవపాలెం, నాంచారమ్మ కాలనీ, బండపాలెం, ముదిరాజ్‌పాలెం ప్రాంతాల్లో పారిశుధ్య సిబ్బంది మురుగు కాలువలు, వీధులు శుభ్రం చేశారు. కమిషనర్ కె. అనూష ఆదేశాలతో చెత్తను ట్రాక్టర్లతో డంపింగ్‌కు తరలించారు. రోడ్డు మార్జిన్లలో పిచ్చిమొక్కలను తొలగించి దోమల నివారణకు లార్వా మందును పిచికారి చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి ఉన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

పవన్ దీక్షకు నేతల సంఘీభావం

కావలి, సెప్టెంబరు 23: జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ 11రోజుల ప్రాయశ్చిత దీక్షకు సంఘీభావంగా స్థానిక కచ్చేరి మిట్ట వెంకటేశ్వరస్వామి ఆలయంలో జనసేన జిల్లా కార్యదర్శి సమ్మెన వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో నాయకులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన పట్టణ ఉపాధ్యక్షులు గాదంశెట్టి రవి, నాగార్జున, జనసైనికులు పాలడుగు వెంకటేశ్వరరావు, తోకల వెంకటేశ్వర్లు, బాబూరావు, జ్యోతి, భవాని పాల్గొన్నారు.

ఆత్మకూరు విద్యుత్‌శాఖ ఈఈగా శ్రీనివాసులు

ఆత్మకూరు : సబ్ డివిజన్ ఏపీఎస్పీడీసీఎల్ ఈఈగా ఐ శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఆయనను సన్మానించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరా మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. విద్యుత్ సమస్యలు ఎదురైతే వినియోగదారులు 9440817594కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని తెలిపారు. ఆత్మకూరు సబ్ డివిజన్ ఈఈగా పనిచేస్తున్న బి జనార్ధన్ తిరుపతికి బదిలీ అయ్యారు.


కాలువలో కోళ్ల వ్యర్థాలు


కాలువలో వేసిన కొబ్బరి బోండాలు, కోళ్ల వ్యర్థాలు

పట్టణంలోని ఉదయగిరి రోడ్డు నుంచి పెద్దపవని వెళ్లే రోడ్డు మార్గంలో అటవీ ప్రాంతం, వీజీ సెంటర్ నుంచి వర్షపు నీరు వెళ్లేందుకు వైకుంఠపురం అన్నపుగుంట సమీపంలో ఏర్పాటు చేసిన కాలువలో వ్యాపారులు కొబ్బరిబొండాలు, చికెన్ వ్యర్థాలను వేస్తున్నారు. దీంతో ఈప్రాంతంలో దుర్గంధం వెదజల్లడంతో పాటు వర్షపు నీరు ప్రవహించేందుకు అడ్డుగా ఉంటున్నాయి. వరద నీరు ఎక్కువగా వస్తే రోడ్డుపై పారుతోందని స్థానికులు వాపోతున్నారు. మురుగునీటి కాలువలు, రోడ్డు మార్జిన్‌లో వ్యర్థాలు వేయకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.
- కావలి రూరల్

నిరుపయోగంగా ఓవర్ హెడ్ ట్యాంక్

మండలంలోని చినక్రాక వద్ద 14వ మైలు సెంటర్‌లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసేందుకు ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం చేపట్టారు. సమీపంలోని చెరువు నుంచి సోమశిల జలాలను శుద్ధి చేసి పంపింగ్ చేసి పైపులైను ద్వారా గ్రామాల్లోని ట్యాంకు మళ్లించేవారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ పథకం నిలిచిపోవడంతో ఓవర్‌హెడ్‌ట్యాంకు నిరుపయోగంగా మారింది. పథకంను వినియోగంలోకి తీసుకవచ్చేలా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు. **- జలదంకి**



ఇలా ఉంటే ఎలా వెళ్లేది ?


చిల్లచెట్లతో మూసుకుపోయిన రాళ్లపాడు ప్రాజెక్టు ఐబీరోడ్డు

రాళ్లపాడు ప్రాజెక్టు నుండి ప్రాజెక్టు కార్యాలయం, అతిథి గృహానికి వెళ్లే రోడ్డు చిల్లచెట్లతో మూసుకుపోయింది. వరదలు వచ్చిన అత్యవసర సమయాల్లో ప్రాజెక్టు వద్దకు చేరేందుకు ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు వచ్చినా అతిథిగృహానికి ఈరోడ్డులోనే వెళతారు. ఏడాది నుండి చిల్లచెట్లను తొలగించక పోవడంతో అధికారులు, సిబ్బంది తాతాహోటల్ మీదుగా చుట్టూ తిరిగి కార్యాలయాలకు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **– లింగసముద్రం**

అల్లుకున్న తీగల తొలగింపు


అల్లుకున్న తీగలను తొలగిస్తున్న సిబ్బంది

వలేటివారిపాలెం : స్థానిక జాతీయ రహ దారి సమీప పొలాల్లో విద్యుత్ కరెంట్ స్తంభా లకు అల్లుకున్న తీగలు సోమవారం ట్రాన్స్‌కో సిబ్బంది తొలగించారు. ఈ సమస్యపై ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి వారు స్పందించడంతో స్థానికులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలు మెచ్చేలా ప్రభుత్వ పాలన : మంత్రి ఆనం


ఆత్మకూరు: బహిరంగసభలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి ఆనం


కందుకూరు: కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

ఆత్మకూరు, సెప్టెంబరు 23 : రాష్ట్రంలో అధికారం చేపట్టిన ప్రజా కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన ప్రజలు మెచ్చేలా సాగిందని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని 22 వార్డు పేరారెడ్డిపల్లిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి ఇంటికి వెళ్లి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి కరపత్రాలు, స్టికర్లు అందజేశారు. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగసభలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విజయవాడ నగరం వరదల్లో విలవిల్లాడుతున్నప్పుడు ముఖ్యమంత్రి అహర్నిశలు శ్రమించి అండగా నిలిచారన్నారు. రూ. 2000 కోట్లు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధులను గత ప్రభుత్వం పక్కదారి పట్టించిందన్నారు. అయినా నిధులకు వెనకాడకుండా వరద బాధితులను ఆదుకున్నామని వివరించారు. ఈ కార్య క్రమంలో ఆర్డీవో కె మధులత, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, ఎస్‌డీసీసీ మాజీ ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, నెల్లూరు పార్లమెంటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ మాదాల శ్రీనివాసుల నాయుడు, కాంరెడ్డి రవీంద్రరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్ పలువురు టీడీపీ, బీజెపి, జనసేన నేతలు పాల్గొన్నారు.

ఏకనాయకత్వంతో పనిచేయాలి : ఎమ్మెల్యే కాకర్ల

కొండాపురం: గ్రామ పంచాయతీల్లో ఏకనాయకత్వం కింద పనిచేయాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. సోమవారం మండలకేంద్రంలో మాజీ వైస్ ఎంపీపీ పోలినేని చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టీడీపీ నాయకులతో కలసి గుడవళ్లూరులోని దుకాణాలు, ఇళ్లకు వెళ్లి కరపత్రాలను, స్టిక్కర్లను అందజేశారు. స్థానిక బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన సమా వేశంలో మాట్లాడారు. పంచాయతీలో సమస్యలు తీర్చాలని గుడవళ్లూరు సర్పంచ్ మాచర్ల ఆయనను కోరారు. మండల అభివృద్ధిలో భాగంగా పంచాయతీల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకు మ్యాచింగ్ గ్రాంటు కింద ప్రతి పంచాయతీకి రూ.25 నుంచి రూ.50వేల వరకు సొంత నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు టీడీపీ కన్వీనర్ ఎమ్ ఓంకారం ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు, టీడీపీ సీనియర్ నాయకులు పోలినేని పెదమాల కొండయ్య, చినమాల కొండయ్య విగ్రహాలను మండలకేంద్రంలో ఏర్పాటుకు కృషిచేయాలని నాయకులు కోరారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

కలిగిరి నుండి మండలం మీదుగా వల్లేటివారిపాలెం మండలం వరకు మంజూరైన రెండు లైన్ల రహదారి పనులకు స్థానిక ఆదర్శ పాఠశాల వద్ద ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మాజీ జడ్పీచైర్మన్ చెంచలబాబు యాదవ్, యారవ క్రిష్ణయ్య, పోలినేని రమేష్, గంటా లక్ష్మీనరసింహులు, దామా మహేశ్వరరావు, దాసరి అశోక్, చెరుకూరు వెంకటాద్రి, బొట్లగుంట హరిబాబు, నర్రా చెంచు నాయుడు తదితరులు పాల్గొన్నారు.


దుత్తలూరు (ఉదయగిరి రూరల్) : శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కాకర్ల

●**దుత్తలూరు(ఉదయగిరి రూరల్) :** మండలంలోని జంగాలపల్లి గ్రామంలో ఉపాధిహామీ నిధులు రూ.20 లక్షలతో నాలుగు రోడ్ల నిర్మాణానికి సోమవారం రాత్రి శిలాఫలకాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం, సీనియర్ టీడీపీ నాయకులు మల్లంపాటి గువరయ్యనాయుడు, వెంగళరెడ్డి, పీఆర్ ఏఈ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు : ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు: పెదమోపాడులో సోమవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన ప్రజావేదికలో ప్రజలు సమస్యలపై వినతులు అందజేశారు. నియోజకవర్గంలో సీసీరోడ్ల నిర్మాణానికి రూ.1.5 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. అనంతరం ఐసీడీఎస్ పౌష్టికాహార మాసోత్సవాల లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, తహసీల్దారు ఇక్బాల్, సర్పంచ్ పరిమళపాల్, నియోజకవర్గ పరిశీలకులు కుసుమ కుమారి, తోకల వెంకటేశ్వర్లు, రావుల రవి, తన్నీరు ఏడుకొండలు, తన్నీరు శ్రీను, రాయపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డెల్టాగా మార్చేందుకు కృషి : ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

బిట్రగుంట: బోగోలు పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి హాజరయ్యారు. జిల్లా మంత్రుల సహకారంతో వచ్చే ఏడాదికి నాలుగు మండలాలను డెల్టా ప్రాంతంగా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. రైల్వే ఎల్సీగేట్ 144తో బోగోలు మండల ప్రజలు అవస్థలు పడుతున్నారని, ఈ సమస్య పరిష్కారానికి ఎంపీ వేమిరెడ్డితో కలిసి రైల్వే అధికారులతో కుమ్మర వీధిలోని రైల్వే ఎల్సీగేట్ 143 వద్ద బాక్స్ టైప్ బ్రిడ్జి నిర్మాణం త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సురేష్‌బాబు, మాజీ సోమశీల కమిటీ అధ్యక్షుడు కండ్లగుంట మధుబాబు నాయుడు, నేతలు ముంతాల వెంకయ్య, సర్పంచు అనిత, పార్టీ మండల మహిళ అధ్యక్షురాలు అరుణమ్మ, మాజీ ఉపసర్పంచు అంజయ్య యాదవ్, సుధీర్‌బాబు, ప్రభాకర్, నాగరాజు, వరప్రసాద్, తిరుమలేష్, రఘురాంనాయుడు ఉన్నారు.


బిట్రగుంట: రైతులకు విత్తనం వడ్లు అందచేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

సీఎం సహాయ నిధికి విరాళం

అనంతసాగరం, సెప్టెంబరు 23: మండలంలోని కొత్తపల్లి మాజీ సర్పంచులు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, చల్లా పద్మమ్మలు విజయవాడ వరద బాధితులకు చేయూత నందించారు. సోమవారం ఆత్మకూరుకు విచ్చేసిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి రూ. 40వేల చెక్కును సీఎం సహాయ నిధికి అందించారు.

● **కందుకూరు:** విజయవాడ వరద బాధితుల సహాయార్థం స్కందపురి లారీఓనర్స్ అసోసియేషన్ సభ్యులు రూ.1,01,116 విరాళంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు ఈ మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల వేదికకు 8 వినతులు

కందుకూరు : స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై 8 వినతులు వచ్చాయని కమిషనర్ అనూష తెలిపారు. ఈ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్ల సమస్యల పరిష్కారానికి సెల్: 91777 00267 నెంబరుకు ఫోన్‌చేసి తెలియజేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

అల్లూరు ఎంపీడీవోకి సన్మానం

అల్లూరు : బదిలీపై వెళుతున్న ఎంపీడీఓ జ్యోతిని సోమవారం కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘన వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. మండల ప్రజలతో తనకు ఏర్పడిన అనుబంధం మరువలేనిదన్నారు. ప్రతిఒక్కరూ సహకారాన్ని అందించడంతోనే సమస్యలు లేకుండా విధులను నిర్వర్తించానన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, అన్నిశాఖల ఏఈలు, పంచాయతీల ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

● ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

అనంతసాగరం : గోవిందమ్మపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నూలు విజయ్‌కుమార్ (46) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. ఆయన భౌతిక కాయాన్ని ఎంఈవో 2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సందర్శించి సంతాపం తెలిపారు. విజయ్‌కుమార్ మృతికి ఉపాధ్యాయులు, పలు సంఘాల నేతలు సంతాపం తెలిపారు.

వాగు ఆక్రమిస్తున్నారని గ్రామస్థుల ఆందోళన

కలువాయి, సెప్టెంబరు 23 : వెదనపర్తి చెరువు కలుజు నీరు వెళ్లే తూర్పు వాగును కొందరు మట్టితో పూడ్చి ఆక్రమిస్తున్నారని సోమవారం గ్రామస్థులు పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. వెదనపర్తి చెరువు కలుజు పారినప్పుడు తూర్పు వాగు ద్వారా ఆ నీరంతా గోపవరం చెరువుకు చేరుతుంది. ఈ వాగు పక్కన పొలం ఉన్న గోపవరం గ్రామానికి చెందిన కొందరు దాన్ని పూడ్చి వారి పొలంలో కలుపుకుంటున్నారని వారు తెలిపారు. చెరువు కలుజు నీరు వెళ్లే ఈవాగును పూడ్చితే ఆ నీరంతా తమ పొలాలపై పడి మునిగిపోతాయని వెదనపర్తి గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేశారు. ఈవిషయం రెవెన్యూ అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ విషయమై ఆర్ఐ మస్తాన్‌వలీ మాట్లాడుతూ గ్రామ తలారిని పంపి వాగు పూడ్చే పనులు నిలిపివేసినట్లు తెలిపారు.

బోరు పాయింట్ ఏర్పాటు

సంగం, సెప్టెంబరు 23: స్థానిక రాళ్లచెలిక కాలనీకి తాగునీటి సరఫరాకు ఎర్రచెరువు ప్రాంతంలో సోమవారం బోరు పాయింట్ వేశారు. కాలనీకి తాగునీరు సరఫరా అయ్యే మోటారు నాలుగు రోజుల కిందట మరమ్మతులకు గురైంది. దీంతో కాలనీవాసులు తాగునీటికి ఇబ్బందులు పడుతుండడంతో నూతన బోరు పాయింట్ వేయించారు.

గంధ మహోత్సవం గోడపత్రిక ఆవిష్కరణ

అనంతసాగరం, సెప్టెంబరు 23: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్న హజరత్ మస్కుర్ అలిషా ఖాదరీ దర్గా 14వ గంధమహోత్సవ గోడ పత్రికను సోమవారం మంత్రి ఆనంచేతుల మీదుగా అవిష్కరించారు. వేడుకలకు హాజరు కావాలని దర్గా నిర్వాహకులు మంత్రిని కోరారు. కార్యక్రమంలో సానిసాహెబ్, మాజీద్‌సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి ఎంపీడీవో బదిలీ

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 23: ఉదయగిరి మండల పరిషత్ అభివృద్ధి అధికారి దేవరకొండ ఈశ్వరమ్మ ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. అధికారులు ఆమె స్థానంలో ఇంకా ఎవర్నీ నియమించలేదు. అలాగే తహసీ ల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్, పలువురు వీఆర్వోలు ఇతర ప్రాంతాలకు బదిలీ కాగా వారి స్థానంలో అధికారులు కొత్తవారిని నియమించారు.

ఉచిత ఇసుక అందుబాటులో ఉండాలి

● సీఐటీయూ నిరసన


ప్రదర్శన నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

ఆత్మకూరు, సెప్టెంబరు 23: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలులోకి తెచ్చినా ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని సోమవారం ఆత్మకూరులో సీఐటీయు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు భవన నిర్మాణ కార్మికులు, సీఐటీయు అనుబంధ విభాగాల కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఐటీయు నాయకుడు ఆత్మకూరు నాగయ్య మాట్లాడుతూ ఉచిత ఇసుక ఆత్మకూరు ప్రజలకు అందుబాటులో లేదని, ఆత్మకూరు నుంచి సుమారు 20 కి.మీ దూరంలో ఉన్న మర్రిపాడు, సంగం డంపింగ్ యార్డ్‌ల వద్దకు వెళ్లి ఇసుక తెచ్చుకోవాలంటే భారంగా ఉందని, ఆత్మకూరు సమీపంలో ఉన్న పెన్నానది నుంచి కూడా ఇసుక తెచ్చుకోలేకపోతున్నారన్నారు. ఈమేరకు వారు ఆర్డీవో మధులతకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కె డేవిడ్‌రాజు, జిల్లా భవన కార్మికుల కార్యదర్శి ఏ గోపాల్ పాల్గొన్నారు.

ఆశావర్కర్‌ను విధుల్లోకి తీసుకోవాలి


కలిగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు

కలిగిరి, సెప్టెంబరు 23: రావులకొల్లు దళిత ఆశావర్కర్ పందిటి విజయమ్మను విధుల్లోకి తీసుకోవాలని సోమవారం మండల ఆశావర్కర్లు డిమాండ్ చేశారు. ఈ విషయంపై పట్టణంలోని కలిగిరమ్మ గుడి సర్కిల్ నుండి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడారు. గ్రామంలో ఎలాంటి విచారణ చేపట్టకుండా సర్పంచ్ తీర్మానంతో ఆశావర్కర్‌ను తొలగించడం అన్యాయం అన్నారు. అనంతరం తహసీల్దారు రవీంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. వీరికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు తాల్లూరి మాల్యాద్రి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెంచలనరసయ్య, మల్లికార్జున, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయక్రిష్ణ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేద్కర్, మందా సుజాత మద్దతు పలికారు. కార్యక్రమంలో నందిపోగు వెంగళరావు, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు అరుణ, మేరీ, గౌసియా, అంజమ్మ, సుభాని, భార్గవి, మంజుల పాల్గొన్నారు.

విజన్ 2047పై ప్రజల సూచనలు సేకరించాలి

ఏఎస్ పేట, సెప్టెంబరు 23: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన స్వర్ణాంధ్ర విజన్ 2047పై ప్రజల సూచనలు, సలహాలు సేకరించాలని ఎంపీడీవో శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25వ తేదీన గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి రాష్ట్ర అభివృద్ధికి తగిన సూచనలు ప్రజల నుండి స్వీకరించి మండల ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు


మాట్లాడుతున్న సూపరింటెండెంట్ పద్మావతి


కావలి టౌన్, సెప్టెంబరు 23: పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిచడమే తమ లక్ష్యమని ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ పద్మావతి తెలిపారు. సోమవారం ఏరియా వైద్యశాల ప్రాంగణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిజిటల్ హెల్త్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య భద్రతా శిబిరం ఏర్పాటు నిర్వహించారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రత కోసం ఈప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక రోగులను మెరుగైన వైద్యం కోసం ఉన్నత ఆసుపత్రులకు రెఫర్ చేశారు. బీజేపీ నేతలు శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, ఐఎంఏ గౌరవాధ్యక్షుడు బెజవాడ రవికుమార్, వైద్యులు కర్నాటి రోహిత్, చైతన్య, వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు లక్ష్మీ, పబ్బాసాయి పాల్గొన్నారు.

పాఠశాలలో సింక్‌ల ధ్వంసం


ధ్వంసం చేసిన సింక్‌లు

సంగం : ఆకతాయిలు బరితెగించి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని బాలుర టాయిలెంట్ గదిలో ఏర్పాటుచేసిన సింక్‌లను ధ్వంసం చేసి బయట పడేశారు. సోమవారం ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు గుర్తించి ప్రధానోపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరిశీలించారు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో ఆటలాడటానికి వచ్చిన ఆకతాయిలు ఈ పనికి పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. ధ్వంసం చేసిన సింక్‌ల విలువ రూ. 50 వేల వరకు ఉంటుందని ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గ్రామ స్వరాజ్యానికి నాంది పలకాలి


వ్యర్థాలతో రూపొందించిన వస్తువులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

వరికుంటపాడు, సెప్టెంబరు 23: మండలంలోని వేంపాడులో సోమవారం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మల్లికార్జున మాట్లాడుతూ నివాసాల నుంచి సేకరించిన వ్యర్థ పదార్థాలతో వస్తువులు తయారుచేసి గ్రామ స్వరాజ్యానికి నాంది పలకాలన్నారు. అనంతరం మొక్కలు నాటి గ్రామ నమూనాను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సికిందర్, హెచ్ఎం వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● **ఉదయగిరి రూరల్ :** స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రీన్‌అంబాసిడర్స్, గ్రీన్‌గార్డుల కుటుంబ సభ్యులకు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అనీషా, శివరాం, ఠాగూర్, రజిత, మధుమోహన్, బీజేపీ నాయకులు కదిరి రంగారావు, నెల్లూరు వెంకటస్వామి, చుండి హరిగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నేతల పరామర్శ

వలేటివారిపాలెం : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అయ్యవారిపల్లె తాతామనువడు ఉప్పుటూరి పెదకొండపనాయుడు, దినేష్‌ల మృతదేహాలకు మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, నెల్లూరు పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.